ANDHRAJYOTHY


ఆంధ్రజ్యోతి

5



శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
శుక్రవారం 8 ఆగస్టు 2025

'సోమశిల'కు పెరిగిన ఇన్‌ఫ్లో



అనంతసాగరం ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : సోమశిల జలాశయానికి ఎగువ నుంచి వస్తున్న వరద ప్రవాహం పెరుగుతోంది. గురువారం 15,723 క్యూసెక్కులు నమోదైనట్లు అధికారులు తెలిపారు. డ్యాంలో నీటి మట్టం 37.446 టీఎంసీలకు చేరుకోగా ఉత్తర కాలువకు 370, వరద కాలువకు 6,000, డెల్టాకు 3,600 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

ట్రంప్ సుంకం..
రొయ్యకు శోకం!

8 నుంచి 58 శాతానికి పెరిగిన పన్ను

- ఆక్వా రంగానికి భారీ కుదుపు
- ధరలపై తీవ్ర ప్రభావం
- స్థానిక వినియోగం పెంచుకునే దిశగా అడుగులు
- ఢిల్లీ స్థాయిలో నిపుణులతో చర్చలు ప్రారంభం



వేల ఎకరాల్లో సాగు... వందల కోట్ల పెట్టుబడి... వేల కోట్ల టర్నోవర్... ఇంతటి భారీ పరిశ్రమపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పెంచిన సుంకం (పన్ను) భారం పిడుగుపాటే. సాధారణంగా ఒక వస్తువుపై రెండు నుంచి పది శాతం వరకు దిగుమతి సుంకం విధించడం సహజం. అయితే, రొయ్యలపై మొన్నటి వరకు 8 శాతం సుంకాన్ని 58 శాతానికి పెంచారు. ఎలాగైనా భారత్‌ను తన చెప్పు చేతల్లోకి తెచ్చుకోవాలనే కుట్రలో భాగంగా ఇక్కడ నుంచి అమెరికాకు ఎగుమతి అయ్యే వస్తువులపై భారీస్థాయిలో పన్ను పెంచారు. 58శాతం పన్నుతో ఆ జాబితాలో రొయ్యలు మొదటి వరుసలో నిలిచాయి. రొయ్యల పరిశ్రమపై ఆధారపడిన జిల్లా రైతాంగాన్ని భారీ కుదుపునకు గురిచేశాయి.

\- నెల్లూరు, (ఆంధ్రజ్యోతి)

పెరిగిన సుంకం కారణంగా అమెరికా మార్కెట్‌లో మన రొయ్యల ధర 60 శాతం పెరుగుతుంది. ఉదాహరణకు కిలో రూ.100 ఉన్న రొయ్యల ధర కొత్త పన్ను కారణంగా 160లకు చేరుతుంది. ఇదే సమయంలో భారత్‌తో పోల్చితే పక్క దేశాల నుంచి దిగుమతి అయ్యే రొయ్యలపై పన్ను శాతం తగ్గించారు. ఉదాహరణకు చైనా నుంచి దిగుమతి చేసుకునే రొయ్యలపై 30 శాతం పన్ను విధించారు. ఇలా మిగిలిన దేశాల దిగుమతులపై సుంకం తగ్గించడంతో మార్కెట్‌లో మన దేశం నుంచి దిగుమతి చేసుకున్న రొయ్యల కన్నా ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకున్న రొయ్యల ధరలు తక్కువగా ఉంటాయి. కాబట్టి అమెరికా వినియోగదారులు ఎక్కువ ధర ఇచ్చి మన రొయ్యలను కొనుగోలు చేయడానికి ఇష్టపడరు.

● జిల్లా రైతులపై పెను ప్రభావం

ట్రంప్ పన్ను పోటు అంతిమంగా ఆక్వా రైతులపై పెను ప్రభావం చూపుతుంది. ఇతర దేశాల ధరలతో పోటీ పడి మార్కెట్‌లో తట్టుకోవాలంటే మన రొయ్యలను తక్కువ ధరకు అమ్ముకోవాల్సి వస్తుంది. ఆ క్రమంలో రైతులకు అందే రేటు తగ్గిపోతుంది. సాగుకు అయ్యే ఖర్చులు తగ్గవు కానీ రొయ్యల ధరలు మాత్రం తగ్గిపోతాయి. ఈ పరిణామం రైతులను తీవ్ర నష్టానికి గురి చేసే ప్రమాదం లేకపోలేదు. దేశంలో రొయ్యల ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో ఉంది. దేశవ్యాప్తంగా ఏటా 10 లక్షల టన్నుల రొయ్యలు ఉత్పత్తి అయితే అందులో రాష్ట్రం వాటా 7 నుంచి 8లక్షల వరకు ఉంటుంది. ఉభయగోదావరి, కృష్ణా జిల్లాల తరువాతి స్థానం నెల్లూరుది. జిల్లాలో 40వేల హెక్టార్లలో ఆక్వా కల్చర్ ఉండగా, ఏటా రెండు లక్షల టన్నుల ఉత్పత్తి జరుగుతుంది. ప్రస్తుతం 100 కౌంట్ రొయ్య ల ఉత్పాదక వ్యయం కిలోకు 200 రూపాయల వరకు పుడుతుంది. ఎగుమతిదారులు కిలో 220లకు కొంటున్నారు. వాస్తవానికి 20 రోజుల క్రితం వరకు కిలో ధర 240గా ఉండేది. అయితే ట్రంప్ ఆంక్షల ప్రభావం ఇంకా అమెరికా మార్కెట్‌లో అమలులకి రాకముందే ఇక్కడ ధర పతనం ప్రారంభమైంది. పది రోజుల వ్యవధిలో కిలోపై రూ.20 తగ్గింది.



సాగుదారులూ ఆందోళన చెందొద్దు!



అమెరికా సుంకం పెంచిన కారణంగా రొయ్యల పరిశ్రమలో ఎదురయ్యే సమస్య తాత్కాలికమే. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ట్రంప్ విధించిన కొత్త పన్ను అమలులోకి రావడానికి ఇంకా 21 రోజుల సమయం ఉంది. ఈలోగా పరిస్థితిలో కొంత మార్పు వచ్చే అవకాశం ఉంది. ఈనెల 21వ తేదీన అమెరికా బృందం దేశానికి వస్తుంది. ఆ సందర్భంగా పెంచిన పన్నులపై దేశ పెద్దలు, నిపుణులు వారితో చర్చిస్తారు. ప్రపంచ మార్కెట్‌లో ఇంకా చాలా దేశాలు ఉన్నాయి. భారత్ వాటిని ఉపయోగించుకుంటుంది. ట్రంప్ బ్లాక్‌మెయిల్‌కు భారత్ భయపడదు. ప్రపంచ వ్యాప్తంగా ప్రత్యామ్నాయ మార్కెట్‌ను సృష్టించుకోగలదు.

\- బీద మస్తాన్‌రావు, ఎంపీ

స్థానిక మార్కెట్‌పై పాలకుల దృష్టి

సుంకాల ద్వారా భారత్‌ను గుప్పెట్లోకి తెచ్చుకోవాలని ట్రంప్ చేస్తున్న ప్రయత్నాలను దేశ పాలకులు ఒక సవాల్‌గా తీసుకొంటున్నారు. సంక్షోభం నుంచి స్వమార్కెట్ వృద్ధి వైపు అడుగులు వేస్తున్నారు. గత మూడు రోజులుగా దేశంలోని ముఖ్యమైన ఎగుమతిదారులతో ఢిల్లీ పాలకులు, ఉన్నతాధికారులు సమాలోచనలు చేస్తున్నారు. ప్రధాన

\- మిగతా 6లో



ప్రతానికి పూజా సామగ్రి కొనుగోలు చేస్తున్న మహిళలు

వరములీయగ
రావే వరలక్ష్మీ

నేడు వరలక్ష్మీ వ్రతం

నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : వరములిచ్చే దేవతగా, సంపదను.. సౌభాగ్యాన్ని అనుగ్రహించే తల్లిగా లక్ష్మీదేవిని కొలుస్తూ ఏటా శ్రావణ మాసంలో ముత్తయిదువులు వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరిస్తుంటారు. జిల్లా వ్యాప్తంగా శుక్రవారం వరలక్ష్మీ వ్రతం జరుపుకోవడానికి ప్రజలు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేసుకున్నారు. పూజా సామగ్రి, వస్త్రాలు, ఆభరణాలు కొనుగోలు చేసే వారితో గురువారం బజార్లు కిటకిటలాడాయి. దీంతో పూలు, పండ్లు, నిత్యావసర సరుకులు, పూజా సామగ్రి ధరలు భగ్గుమన్నాయి. ఇక ఆలయాల్లోనూ భారీ స్థాయిలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు జరగనున్నాయి. భక్తుల కోసం పాలక మండళ్లు ప్రత్యేక ఏర్పాట్లు చేశాయి. నెల్లూరులోని రాజరాజేశ్వరి, కన్యకా పరమేశ్వరి, శబరి శ్రీరామక్షేత్రం, ఇరుకళల పరమేశ్వరి, మహాలక్ష్మి ఆలయాల్లో వరలక్ష్మీ వ్రతాలు, విశేష పూజలు జరగనున్నాయి.

ఆ ప్రాంతాలకు ఉపశమనం కలిగేనా!?

- అశాస్త్రీయంగా నాడు జిల్లాల విభజన
- సీఎం ప్రకటనతో కందుకూరు, గూడూరు ప్రాంతవాసుల్లో ఆశలు

వైసీపీ ప్రభుత్వం చేసిన తప్పుల మూలంగా కందుకూరు, గూడూరు ప్రాంతాల ప్రజల జీవనం అస్తవ్యస్తమైంది. నాడు అశాస్త్రీయంగా చేసిన జిల్లాల విభజన కారణంగా ఈ రెండు ప్రాంతాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. 'మమ్మల్ని మా జిల్లాల్లోనే ఉంచండి మహాప్రభో..' అంటూ నాడు ప్రజలు వేడుకున్నా పట్టించుకున్న నాథుడు లేడు. ప్రజల ఆకాంక్షలకు విరుద్ధంగా జరిగిన జిల్లాల పునర్విభజనను అధికారంలోకి వచ్చాక సరిదిద్దుతామని ఎన్నికల సమయంలో సీఎం చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. ఆ క్రమంలోనే కందుకూరు, గూడూరు ప్రాంతాలకు వచ్చినప్పుడు వీటిని తిరిగి పాత ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లోనే కలుపుతామని ప్రకటించారు. అందులో భాగంగా తాజాగా జిల్లాలు, డివిజన్లు, మండలాల పునర్విభజనను చేపట్టేందుకు ప్రభుత్వం మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసింది. వచ్చే ఏడాది నుంచి జనగణన ప్రారంభం కానున్న నేపథ్యంలో ఈ ఏడాదిలోపు పునర్విభజన ప్రక్రియను పూర్తి చేయాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించిన నేపథ్యంలో ప్రభుత్వం వేగంగా కదులుతోంది. బుధవారం జరిగిన కేబినెట్ సమావేశంలోనూ ఈ అంశం ప్రధానంగా చర్చకు రాగా, నెల రోజుల్లోపు మంత్రివర్గ ఉపసంఘం నివేదిక ఇవ్వాలని సీఎం ఆదేశించారు. ఆ సిఫార్సుల మేరకు అక్టోబరులోపు పునర్విభజన ప్రక్రియ పూర్తి చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ నేపథ్యంలో గూడూరు, కందుకూరు ప్రాంతాల్లో మళ్లీ ఆందోళనలు మొదలయ్యాయి. తమను పాత జిల్లాల్లోనే కలపాలంటూ అక్కడి ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

వివరాలు 8లో..



ప్రధాన ఆలయాల పాలక మండళ్లకు
నోటిఫికేషన్లు

నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రవ్యాప్తంగా రూ.1 కోటి నుంచి 5 కోట్ల ఆదాయం కలిగిన 15 ఆలయాలకు పాలక మండళ్ల నియామకానికి దేవదాయ శాఖ గురువారం నోటిఫికేషన్లు జారీ చేసింది. 20 రోజుల్లోపు ఆసక్తి కలిగిన వారు పాలక మండలి సభ్యులుగా దరఖాస్తు చేసుకోవాలని కోరింది. అలాగే రూ.5 కోట్ల నుంచి 20 కోట్లు ఆదాయం కలిగిన ఆలయాల్లో జిల్లాలో రెండింటికి నోటిఫికేషన్ జారీ అయింది. అందులో రాపూరు మండలం పెంచలకోనలోని శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహస్వామి ఆలయం, వలేటివారిపాళెం మండలం మాలకొండలోని శ్రీమాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయాలు ఉన్నాయి. ఇక ఏడు ఆలయాల్లో బుచ్చి మండలం జొన్నవాడ, నెల్లూరులోని రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయం, మూలాపేట మూలస్థానేశ్వరస్వామి ఆలయం, వేదగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయం, దుత్తలూరు మండలం నర్రవాడలో శ్రీవెంగమాంబ పేరంటాళ్ల అమ్మవారి దేవస్థానం, బోగోలు మండ లం కొండబిట్రగుంటలోని ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయం, ముత్తుకూరు మండలం కృష్ణపట్నంలోని శ్రీసిద్ధేశ్వర, వేణుగోపాలస్వామి ఆలయాలు ఉన్నాయి.

బీఎల్‌వోలకు
తీపి కబురు!

- గౌరవ వేతనం రెండింతలు పెంపు
- ఈఆర్వో, సహాయ ఈఆర్వోలకూ జీతం
- ఉత్తర్వులు జారీ చేసిన ఈసీ

ఉదయగిరి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : ఓటరు జాబితా తయారీలో కీలకంగా వ్యవహరించే క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బందికి భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) తీపి కబురు అందించింది. ఏడాది కాలానికి వారికిచ్చే గౌరవ వేతనాన్ని రెట్టింపు చేసింది. ఇప్పటివరకు కేవలం బూత్‌స్థాయి అధికారులు (బీఎల్‌వో), సూపర్‌వైజర్లకు మాత్రమే గౌరవ వేతనం చెల్లించేవారు. తాజాగా అసెంబ్లీ నియోజకవర్గాల ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి (ఈఆర్‌వో), సహాయ ఈఆర్‌వోలకు కూడా గౌరవ వేతనాన్ని చెల్లించనున్నట్లు ఉత్తర్వులు జారీ చేసింది.

● రెట్టింపు వేతనం

ఏడాది కాలానికి బీఎల్‌వోలకు రూ.6 వేల నుంచి 12 వేలకు, సూపర్‌వైజర్లకు రూ.12 వేల నుంచి 18 వేలకు పెంచారు. ఇక ఈఆర్‌వోలకు రూ.30 వేలు, సహాయ ఈఆర్‌వోలకు రూ.25 వేలు చొప్పున గౌరవవేతనం చెల్లిస్తారు. పనితీరులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన బీఎల్‌వోలకు ప్రోత్సాహం కింద మరో రూ.6 వేలు ఇవ్వనున్నట్లు ఈసీఐ ప్రకటించింది. 2015 తర్వాత ఇప్పుడు గౌరవ వేతనాలు పెరిగాయి. కాగా, జిల్లాలో ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా, ప్రతి నియోజకవర్గానికి ఈఆర్‌వో, ఏఈఆర్‌వోలు ఉంటారు. అలాగే బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లు సుమారు 3 వేల మందికిపైగా విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న వేతన బకాయిలను సైతం మంజూరు చేసింది.



చేనేత ఉత్పత్తులను ప్రోత్సహించండి

● జాతీయ చేనేత దినోత్సవంలో జేసీ కార్తీక్

నెల్లూరు(వ్యవసాయం), ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): చేనేత ఉత్పత్తులను ప్రోత్సహించాలని జాయింట్ కలెక్టర్ కార్తీక్ పిలుపు నిచ్చారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా గురువారం నెల్లూరు గాంధీబొమ్మ సెంటర్‌లోని గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రభుత్వ అధికారులు వారంలో ఒక రోజు చేనేత వస్త్రాలు ధరించాలని కోరారు. చేనేత ఐక్య కార్యాచరణ కమిటీ జిల్లా అధ్యక్షుడు బుధవరపు బాలాజీ మాట్లాడుతూ 1907లో విదేశీ వస్త్రాలు బహిష్కరించి స్వదేశీ వస్త్రాలని కొనుగోలు చేయాలని ఉద్యమం చేసిన ఆగస్టు 7వ తేదీని ప్రధాని నరేంద్రమోదీ చేనేత దినోత్సవంగా ప్రకటించారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ప్రకటించ డంపై ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం గాంధీబొమ్మ సెంటర్ నుంచి వీఆర్సీ వరకు ర్యాలీ నిర్వహించి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి కలెక్టరేట్‌కు చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ తాళ్ల నరసింహస్వామి, చేనేత ఐక్య కార్యాచరణ కమిటీ జిల్లా ఉపాధ్యక్షుడు జానపాటి రామసుబ్బయ్య, గౌరవాధ్యక్షులడు చింతలపూడి పెంచలయ్య, టీడీపీ నాయకుడు గుత్తికొండ వెంకయ్య, వీవర్స్ ఎంప్లాయీస్ జిల్లా అధ్యక్షుడు సురేష్, పాల్గొన్నారు.

ఆస్తులకు ఆటో మ్యుటేషన్

నెల్లూరు (హరనాథపురం): స్థిరాస్తులకు సంబంధించిన అక్రమాలు, అవినీతి వ్యవహారాలకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం ఆటో మ్యుటేషన్ విధానాన్ని అమల్లోకి తెచ్చింది. రాష్ట్రంలోని 17 మున్సిపల్ కార్పొరేషన్లలో ఈ విధానం అమలు చేయాలని నిర్ణయించింది. నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ కూడా ఇందులో ఉంది. ఈ క్రమంలో నెల్లూరులోని జాయింట్ సబ్ రిజిస్ట్రార్ ఐ విజయ రాణి గురువారం తొలి ఆటో మ్యుటేషన్ రిజిస్ట్రేషన్ చేశారు. ఈ మేరకు ఆస్తిదారుకు రిజిస్ట్రేషన్ పత్రాన్ని అందచేశారు.

నెల్లూరులో తొలి రిజిస్ట్రేషన్



రిజిస్ట్రేషన్ చేసిన పత్రాన్ని ఆస్తిదారుకు ఇస్తున్న జాయింట్ సబ్ రిజిస్ట్రార్ విజయరాణి

వేగవంతంగా రిజిస్ట్రేషన్

ఆటో మ్యుటేషన్ పద్ధతిలో వేగవంతంగా ఆస్తుల రిజిస్ట్రేషన్ చేయడానికి అవకాశం ఉంది. ఇప్పటి వరకు ఆస్తులు కొనుగోలు చేసిన తరువాత వారి పేర్లపై హక్కులను బదలాయించటం ద్వారా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ముగి సేది. ఆ తరువాత మున్సిపల్ కార్పొరేషన్‌లో ఆస్తి పన్ను, కొళాయి పన్ను అసెస్ మెంట్లలో పేరు మార్పు కోసం స్థానిక సచివా లయంలో దరఖాస్తు చేసు కోవాలి. ఇందుకోసం ఆస్తి మార్కెట్ విలువలో ఒక శాతం డబ్బును మ్యు టేషన్ ఫీజుగా చలానా రూపంలో చెల్లించాల్సి ఉండేది. సచివాలయంలో డాక్యుమెంట్లు సమర్పించిన తర్వాత ఆర్ఐ, ఆర్‌వో లాగిన్లలో ప్రక్రియ పూర్తయి చివరికి కమిషనర్ లాగిన్‌కు చేరుతుంది. ఇందుకోసం రోజుల తరబడి కార్పొరేషన్ కార్యాలయం చుట్టూ తిరిగాల్సి ఉండేది. ఆటో మ్యుటేషన్ విధానం అమలుతో ఈ కష్టాలు తీరనున్నాయి. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఆస్తి బదలాయింపుతోనే అన్నీ ప్రక్రియలు ఆటోమేటిక్‌గా పూర్తవుతాయి.

కొత్తపద్ధతిలో రిజిస్ట్రేషన్ ఇలా...

రిజిస్ట్రేషన్ సమయంలోనే ఆస్తి విలువలో ఒక శాతం చలానా చెల్లిస్తే చాలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం లోనే ఆ మ్యుటేషన్ ప్రక్రియ పూర్తవుతుంది. ఆస్తి అమ్మకందారు, కొనుగోలు దారుల వేలి ముద్రలు తీసుకున్న వెంటనే వారి వివరాలు కంప్యూటర్‌లో వస్తాయి. ఆ తర్వాత రిజిస్ట్రేషన్‌తోపాటు మ్యుటేషన్ కూడా జరిగిపోతుంది.

ఈ-ఆఫీస్‌లో
చోర్.. చోర్!

- కలెక్టరేట్‌లో ఫైళ్లు భద్రమేనా!?
- ఉన్నతాధికారుల లాగిన్లలో దస్త్రాల తస్కరణ
- ఓ మహిళా అధికారి బాగోతం వెలుగులోకి..
- కలెక్టర్ సీరియస్.. షోకాజ్ నోటీసు జారీ

పాలనలో మరింత సౌలభ్యం కోసం ప్రభుత్వ కార్యాలయాల్లో ఈ ఆఫీస్ విధానం అమలులో ఉంది. ఒక అంశానికి చెందిన ఫైల్‌ను వ్యక్తిగతంగా కాకుండా అధికారుల లాగిన్లలోనే కంప్యూటర్ల ద్వారా మార్పు, చేర్పులు చేసుకోవచ్చు. కలెక్టరేట్‌లో ఈ విధానం వల్ల ఫైళ్లకు త్వరగా పరిష్కారం లభిస్తోంది. అయితే, డిప్యూటీ తహసీల్దారు హోదా కలిగిన ఓ మహిళా అధికారి తన స్వలాభం కోసం ఉన్నతాధికారుల లాగిన్‌లోని ఫైళ్లను వారికే తెలియకుండా మరో అధికారికి పంపుతున్నట్టు వెలుగు చూసింది. ఇది గ్రహించిన కలెక్టర్ ఆనంద్ ఆమెకు షోకాజ్ నోటీసు ఇవ్వాలని డీఆర్వోను ఆదేశించారు. వెలుగులోకి వచ్చింది ఈ ఒక్క సంఘటనే అయినా వెలుగులోకి రానివి ఎన్ని ఉన్నాయోననే అనుమానం అందరిలోనూ నెలకొంది.



నెల్లూరు (హరనాథపురం), ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : కలెక్టరేట్‌లో ఈ ఆఫీస్ విధానం అమలులో ఉంది. ఈ విధానం ద్వారా ఏ ఫైల్ అయినా ఉన్నతాధికారుల ఆమోదం కోసం కంప్యూటర్ల ద్వారా పంపవచ్చు. సంబంధిత క్లర్క్ నుంచి ఏఓకు, డీఆర్వోకు ఆ తరువాత జాయింట్ కలెక్టర్, చివరగా కలెక్టర్‌కు ఆ ఫైల్ చేరుతుంది. అయితే, డిప్యూటీ తహసీల్దారు హోదాలో పని చేస్తున్న ఓ మహిళా అధికారి ఉన్నతాధికారుల లాగిన్‌లో చొరబడి తనకు అవసరమైన ఫైల్‌ను తీసుకుంటున్నట్లు సమాచారం.

● అసలు కథ ఇదీ...

కలెక్టరేట్‌లో ప్రకాష్ సెక్యూరిటీ ఏజెన్సీ తరపున 11 మంది సెక్యూరిటీ గార్డులు పని చేస్తున్నారు. వీరిలో ఏడుగురు కలెక్టరేట్‌లో ఉండగా, ముగ్గురు జేసీ బంగ్లా వద్ద, ఒకరు పినాకినీ అతిథిగృహం వద్ద పని చేస్తున్నారు. ఈ బాధ్యతలు తన భర్తకు చెందిన ఏజెన్సీకి అప్పగించాలంటూ ఆ మహిళా అధికారి అధికారులపై ఒత్తిడి తెచ్చారు. నిబంధనల ప్రకారం సెక్యూరిటీ ఏజెన్సీని మార్చాల్సి ఉండగా ఇందుకు విరుద్ధంగా ఫైల్ నడిపినట్లు తెలిసింది. తన భర్తకు సంబంధించిన ఫైల్‌ను రకరకాలుగా ఆ అధికారిణి కలెక్టర్‌కు చేరేలా చేశారు. కలెక్టరేట్‌లో కొంతమంది ఉన్నతాధికారుల సహాయ సహకారాలతో ఆమె ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు సమాచారం.



● లాగిన్లలో చొరబడి..

తన భర్తకు చెందిన సెక్యూరిటీ సర్వీస్ ఫైల్‌ను కలెక్టరేట్‌లో సెక్యూరిటీ వివరాలు చూసే సీనియర్ అసిస్టెంట్ ద్వారా ఉన్నతాధికారులకు పంపాలి. ఆయన అనుమతితో ఏఓకు, డీఆర్వోకు కంప్యూటర్ ద్వారా ఫైల్ వెళ్లాలి. సీనియర్ అసిస్టెంట్ సలాఉద్దీన్ గతంలో పనిచేసిన డీఆర్వో ఉదయ భాస్కర్‌రావుకు ఆ ఫైల్ పంపారు. ఆ ఫైల్‌ను సీ-సెక్షన్‌లో పనిచేస్తున్న సదరు మహిళా అధికారి డీఆర్వో లాగిన్‌లో ఉన్న ఫైల్‌ను ఆయన అనుమతి లేకుండా తన కంప్యూటర్‌కు తెప్పించుకున్నారు. అదే ఫైల్ కలెక్టర్ కంప్యూటర్ లాగిన్‌కు వెళ్లింది. కలెక్టర్ ఆనంద్ తన లాగిన్‌లో ఉన్న ఆ ఫైల్‌ను చూసినట్లు సమాచారం. ఈ ఫైల్ విషయం దృష్టిలో పెట్టుకున్న కలెక్టర్ మళ్లీ ఆ ఫైల్‌ను పరిశీలించినప్పుడు ఆ ఫైల్ లాగిన్ నుంచి మాయమైంది. ఈ విషయమై ఆరా తీయగా సీనియర్ అసిస్టెంట్ సలావుద్దీన్ కలెక్టర్ లాగిన్ నుంచి ఆ ఫైల్‌ను తన లాగిన్‌కు తీసుకున్నట్లు గ్రహించారు. వెంటనే ఆయనపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ షోకాజ్ నోటీసు జారీ చేయాలని ప్రస్తుత డీఆర్వో హుస్సేన్ సాహెబ్‌ను ఆదేశించారు. షోకాజ్ నోటీసు అందుకున్న సలాఉద్దీన్ తనకేపాపం తెలియదని, సెక్యూరిటీ ఏజెన్సీని మార్చాలని, సీ-సెక్షన్‌లో ఉన్న డిప్యూటీ తహసీల్దారే ఇలా చేశారని అధికారుల వద్ద మొరపెట్టుకోవటంతో ఆ మహిళా అధికారి బాగోతం వెలుగులోకి వచ్చింది. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు ఆమెకు శుక్రవారం నోటీసు జారీ చేశారు.

షోకాజ్ నోటీసులు జారీ చేశాం

డిప్యూటీ తహసీల్దారు ప్రియాంక గతంలో పనిచేసిన డీఆర్వో ఉదయభాస్కర్‌రావు కంప్యూటర్ నుంచి ఆమె కంప్యూటర్ లాగిన్‌కు ఫైల్ తీసుకుంది. మళ్లీ డీఆర్వోకు పంపింది. ఈ విషయం తనకు తెలియకుండా జరిగిందని ఉదయభాస్కర్‌రావు చెప్పారు. సీనియర్ సహాయకుడు, ఫైల్ వ్యవహారం చూసిన సలావుద్దీన్ ఫైల్‌ను కలెక్టర్ లాగిన్ నుంచి, ఆయన కంప్యూటర్‌కు తిరిగి తీసుకున్నాడు. ఉన్నతాధికారుల అనుమతి లేకుండా అధికారులకు తెలియకుండా వారు అలా చేయడంతప్పు. వారికి షోకాజ్ నోటీసులు జారీ చేశాం. వివరణ కోరాం. వారు నోటీసులకు సమాధానం ఇవ్వగానే చర్యలు తీసుకుంటాం.

\- హుస్సేన్ సాహెబ్, జిల్లా రెవెన్యూ అధికారి

● ఇప్పటికే రెండుసార్లు సస్పెన్షన్

ఇదిలా ఉంటే సదరు మహిళా అధికారి కొడవలూరులో ఆర్ఐగా పనిచేస్తూ ఒకసారి, ఓజిలిలో ఆర్ఐగా పనిచేస్తూ రెండోసారి సస్పెండ్ అయ్యారు. ప్రస్తుతం దుత్తలూరులో రీసర్వే డీటీగా పనిచేస్తూ కలెక్టరేట్‌కు డిప్యూటేషన్‌పై వచ్చారు. ఇలాంటి దస్త్రాల వ్యవహారాలు కలెక్టరేట్‌లో ఎన్ని జరుగుతున్నాయోననే ఆందోళన ఉద్యోగుల నుంచి వ్యక్తం అవుతోంది.

చేనేత రంగానికి పూర్వవైభవం

కోవూరు, ఆగస్టు7 (ఆంధ్రజ్యోతి): చేనేత రంగానికి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారని టీడీపీ పార్లమెంటు కమిటీ ప్రధాన కార్యదర్శి చేజర్ల వేంకటేశ్వర్లురెడ్డి అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2019కి ముందు అమలు చేసిన పథకాలన్నింటినీ వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. ప్రస్తుతం చేనేత మగ్గాలకు రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ రాయితీలు ప్రకటించడంతో చేనేత కార్మికులు ఆనందంగా ఉన్నారని చెప్పారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9685
వెండి కిలో ధర	రూ. 118200
వెండి ఒక గ్రాము	రూ. 121.20

13 మంది రైతులకు రూ. 1.18 కోట్లు

- రైల్వే ఫ్లైఓవర్‌కు 4ఎకరాల భూ సేకరణ
- భూములను పరిశీలించిన ఆర్డీవో అనూష


భూములు కోల్పోయిన రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో నాగసంతోష అనూష

మనుబోలు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): చెర్లోపల్లి రైల్వేగేటు వద్ద ఏర్పాటు చేయబోయే ఫ్లైఓవర్‌కు 4ఎకరాల భూమిని సేకరించామని నెల్లూరు ఆర్డీవో నాగసంతోష అనూష తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం భూములు కోల్పోయిన రైతులనుంచి పత్రాలు సేకరించి పరిశీలించారు. ఈ క్రమంలో ఇద్దరు రైతులు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ చెర్లోపల్లి ఎల్‌సీ రైల్వే గేటు మూసివేసే క్రమంలో గ్రామస్తుల రాకపోకలకు ఆటంకం కలగకుండా ఫ్లైఓవర్ ఏర్పాటు కానుందన్నారు. ఇందుకు భూ సేకరణ చేసి ఇవ్వాలని రైల్వే శాఖ కోరిందన్నారు. గతేడాదిలోనే ఇందుకు కావాల్సిన 4 ఎకరాల భూములను గుర్తించామన్నారు. 13 మంది రైతులకు చెందిన భూములు తీసుకుంటామన్నారు. వారికి నష్టపరిహారం కింద సుమారుగా రూ. 1.18 కోట్లు అవుతుందని అంచనా వేశామన్నారు. అవార్డు విచారణలో ఇంకేదైనా అభ్యంతరాలు, ఇతర విషయాలు ప్రస్తావిస్తే వాటిపై విచారణ చేసి పూర్తి చేస్తామన్నారు. పొలాలకు ఒకరకంగా, ఇళ్లకు మరోరకంగా నష్టపరిహారం ఉంటుందన్నారు. ఇప్పుడున్న అంచనా మొత్తం పెరగవచ్చునన్నారు. రైతులకు నగదు జమ చేసేనాటికి లెక్కకట్టిన మొత్తానికి వడ్డీ కలిపి ఇస్తామన్నారు. అలాగే ఫ్లైఓవర్‌కు ఇరుపక్కల సర్వీసు రోడ్డు వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రమాదేవి, డీటీ ప్రదీప్, ఆర్ఐ. అరుణ్‌బాబు, వీఆర్వోలు నాగార్జున రెడ్డి, వెంకయ్య, శ్రీనువాసులు పాల్గొన్నారు.

● **బుచ్చిరెడ్డిపాళెం:** మండలంలోని బుచ్చి, దగదర్తి మార్గంలో రోడ్డు విస్తర ణకు సంబంధించిన భూ ములను ఆర్డీఓ అనూష గురువారం పరిశీలించా రు. బుచ్చి నుంచి దగదర్తి వరకు డబుల్ రోడ్డు నిర్మాణంలో భాగంగా బుచ్చి, చెన్నూరు మార్గంలో చేపట్టిన రోడ్డు విస్తరణకు పలువురు రైతులకు చెందిన కొంత భూమిని ప్రభుత్వం తీసుకుంది. బుచ్చి నుంచి కట్టుబడిపాళెం ప్రాంతంలో చేపట్టిన రోడ్డు విస్తరణకు మరికొందరు రైతుల నుంచి భూములను సేకరించారు. సంబంధిత రైతులకు పరిహారం చెల్లింపునకు సంబంధించి కట్టుబడిపాళెం వద్ద ల్యాండ్ అక్విజేషన్ భూములను ఆర్డీఓ పరిశీలించారు. పరిసర ప్రాంతాల్లోని భూముల ధరల వివరాలను రైతులతో సేకరించారు. అంతకుముందు ఆర్డీవో తహసీల్దారు కార్యాలయాన్ని సందర్శించి రికార్డులు పరిశీలించారు. ఆర్డీఓ వెంట స్థానిక తహసీల్దారు అంబటి వెంకటేశ్వర్లు, ల్యాండ్ అక్విజేషన్ తహసీల్దార్ రవీంద్రనాథ్, ఆర్ఐ శాంతిప్రియ, వీఆర్వోలు సుష్మా, వెంకటేశ్వర్లు, సర్వేయర్, రైతులు దయాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

సీపీఎం నిరసన


నిరసన తెలుపుతున్న సీపీఎం నేతలు

వెంకటాచలం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : వెంకటాచలం ఉప విద్యుత్ కేంద్రం ఎదుట గురువారం సీపీఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. 'అదానీ స్మార్ట్ మీటర్లు వద్దు- పాత మీటర్లే ముద్దు' అంటూ నినాదాలు చేశారు. అనంతరం విద్యుత్ ఏఈకి వినతి పత్రాన్ని అందజేశారు. సీపీఎం ఏరియా కమిటీ కన్వీనర్ తలారి దేవదానం, రైతు సంఘం నేతలు ఓడూరు వెంకటకృష్ణయ్య, షేక్ సిరాజ్, వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన తల్లిపాల వారోత్సవాలు


ర్యాలీలో పాల్గొన్న అంగన్‌వాడీ సిబ్బంది

రాపూరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): గత వారం రోజులుగా రాపూరు మండలంలో అంగన్‌వాడీ కేంద్రాలలో జరిగిన తల్లిపాల వారోత్సవాలు గురువారం ముగిశాయి. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట రాపూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి జి సునంత ఆధ్వర్యంలో తల్లిపాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్‌లు సౌజన్య, రాధిక, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ శోభాయాత్ర

పొదలకూరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని కేఆర్ నగర్ నుంచి గేట్ సెంటర్ వరకు హనుమాన్ శోభాయాత్రను గురువారం ఆంజనేయ భక్తులు ఘనంగా నిర్వహించారు. 15 అడుగుల ఎత్తు గల రాతి విగ్రహాన్ని మారుతీనగర్‌లోని వీర అభయాంజనేయస్వామి ఆలయం వీధి ప్రారంభంలో హనుమాన్ విగ్రహ ప్రతిష్ట చేశారు. డీజే, మేళాలతో అంగరంగ వైభవంగా యాత్ర సాగింది. కార్యక్రమంలో భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఫైన్ పోర్టిఫైడ్ బియ్యమే వాడండి

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మధ్యాహ్న భోజనం తయారీలో ఫైన్ పోర్టిఫైడ్ బియ్యం మాత్రమే వాడాలని ఎంఈఓ 2 పీవీ రత్నం రేబాల ప్రభుత్వ జడ్పీ హైస్కూలు ఇన్‌ఛార్జ్ హెచ్ఎం హరనాథ్‌కు సూచించారు. పురుగులు పట్టిన బియ్యాన్ని స్కూలు పక్కనే వున్న రైస్ మిల్లులో రీసైక్లింగ్ చేయించి ఆ బియ్యంతోనే అన్నం వండి విద్యార్థులకు పెడుతున్న వైనంపై గురువారం ఆంధ్రజ్యోతిలో 'రుచించని మధ్యాహ్న భోజనం' శీర్షికన కథనం ప్రచురితం కావడంతో ఎంఈఓ 2 పీవీ రత్నం స్పందించారు. గురువారం పాఠశాలను సందర్శించారు. మధ్యాహ్న భోజనంలో ఫైన్ ఫోర్టిఫైడ్ బియ్యం మాత్రమే వాడాలని ఆదేశాలు జారీ చేశారన్నారు.

ఉన్నతాధికారుల ఆదేశాలతోనే ..?

రేబాల హైస్కూలు హెచ్ఎం ఫణీష్ కుమార్‌ను డీఈఓ బాలా జీరావు హైస్కూల్‌లో స్టాకు ఉన్న రేషన్ బియ్యాన్ని రీసైక్లింగ్ చేసి మిడ్‌డే మీల్స్‌కు వాడడంపై సంజాయిషీ కోరగా.. తాను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే చేశానని పేర్కొన్నట్టు తెలిసింది. ఐతే ఈ విషయంపై ఎవరా హయ్యర్ అఫిషి యల్ అనేది స్థానికంగా తల్లి దండ్రుల్లో విమర్శలకు దారితీసింది. కాగా ఈ ఘటనపై విద్యా శాఖామంత్రి లోకేష్ బాబుకు ఫిర్యాదు చేయగా విచారణకు ఆదేశించినట్లు సమాచారం.

లేగ దూడల అందాల పోటీలు


బహుమతులు అందజేస్తున్న ఈవో

రాపూరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంక్రాంతిపల్లిలో గురువారం లేగ దూడల అందాల పోటీలు నిర్వహించారు. పాడి రైతులు తమ దూడలను ప్రదర్శించారు. పాడి రైతులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు చెన్ను భాస్కర్‌రెడ్డి, జిల్లా పశుగణాభివృద్ధి సంఘం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాసరావు, రాపూరు ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ అనీల్‌కుమార్, పశు వైద్యాధికారులు ప్రసాద్‌బాబు, సుప్రజ, రాజేష్ పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

త్వరలో చేనేత క్లస్టర్ ప్రారంభోత్సవం

ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి


నూలు వడుకుతున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

కోవూరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): త్వరలో పాటూరులో చేనేత క్లసర్‌కు ప్రారంభిస్తామని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని పాటూరులో గురువారం జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఏర్పాటైన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేనేతల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తోందన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన వాగ్దానాల్ని అమలు చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖామంత్రి లోకేశ్ నెరవేరుస్తున్నారని చెప్పారు. వారంలో ఒక రోజు చేనేత దుస్తుల్ని ధరించాలని కోరారు. పేద బంగారు కుటుంబాల్ని దత్తత తీసుకుని పీ4 లక్ష్యాన్ని నెరవేర్చాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పార్వతి, పెన్నాడెల్టా ఛైర్మన్ జెట్టి రాజగోపాలరెడ్డి, వేగూరు సర్పంచు అమరావతి, చేనేత సంఘం నాయకులు కేవీ శేషయ్య, పిచ్చుక మధుసూదనరావు, టీడీపీ నాయకులు ఇంతా మల్లారెడ్డి, గుత్తికొండ వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారుల రీజనల్ అధికారితో సోమిరెడ్డి భేటీ


అధికారికి వినతిపత్రం అందిస్తున్న సోమిరెడ్డి

నెల్లూరు (వైద్యం) ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : చీఫ్ సెక్రటరీ జాతీయ రహదారుల రీజనల్ అధికారి ఆర్కే సింగ్‌తో సర్వేపల్లి ఎమ్మెల్యే సోమి రెడ్డి చంద్రమోహన్‌రెడ్డి గురువారం భేటీ అయ్యారు. విజయవాడలో జరిగిన ఈ భేటీలో పలు సమస్యలను సింగ్ దృష్టికి తీసుకు వెళ్లారు. వినతిపత్రం అందించారు. సాగరమాలతో పాటు బద్వేలు రహదారుల నిర్మాణం కోసం సేకరించే భూములకు పరిహారం చెల్లింపులో రైతులకు జరిగే అన్యాయంపై చర్చించారు. ముత్తుకూరు మండలం ఈపూరు, వెంకన్నపాళెం, పంటపాళెం, వెంకటాచలం మండలంలోని కురిచెర్లపాడు రైతులకు పరిహారం చెల్లింపులో న్యాయం చేయాలని కోరారు. ప్రస్తుతం మార్కెట్ ధరలకు అనుగుణంగా పరిహారం చెల్లించాలన్నారు. అనంతరం అమరావతి సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వం చీఫ్ సెక్రటరీ విజయానంద్‌తో ప్రత్యేకంగా భేటీ అయిన సోమిరెడ్డి ముత్తుకూరు మండలం నేలటూరు పంచాయితీకి సంబంధించి పునరావాస కాలనీల నిర్మాణంపై చర్చించారు. మాదరాజు గూడూరు వద్ద నేలటూరు ప్రధాన గ్రామం కోసం చేపట్టిన ఆర్ అండ్ ఆర్ కాలనీ నిర్మాణ పనులను త్వరిత గతిన పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. వావిలేటిపాడు వద్ద నేలటూరు పాళెం ఆర్ అండ్ ఆర్ కాలనీ పనులు, నేలటూరు ఎస్సీ కాలనీ స్థల కేటాయింపు తదితర అంశాలపై చర్చించారు.

శభాష్.. స్వర్ణలతమ్మా!

- సొంత ఖర్చులతో తహసీల్దారు కార్యాలయానికి మరమ్మతులు
- డిప్యూటీ తహసీల్దారు స్వర్ణలతను అభినందించిన ప్రజలు


మరమ్మతులు చేస్తున్న బేల్దారులు

విడవలూరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): చాలా ఏళ్లుగా విడవలూరు తహసీల్దారు కార్యాలయం శిథిలావస్థకు చేరింది. పై కప్పు పెచ్చులూడుతోంది. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని అధికారులు, సిబ్బంది భయభయంగా కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నారు. భవనం శిథిలావస్థలో ఉందని మరమత్తులు చేయకుంటే ప్రమాదాలు జరుగుతాయని రెవెన్యూ అధికారులు జిల్లా అధికారులకు, స్థానిక ప్రజా ప్రతినిధు లకు పలుమార్లు విన్నవించుకున్నారు. అయినా ఎవరూ స్పందించకపోవటంతో ఇటీవల విడవలూరు డిప్యూటీ తహసీల్దారుగా బాధ్యతలు స్వీకరించిన స్వర్ణలత తహసీల్దారు కార్యాలయ దుస్థితిని చూసి చలించిపోయారు. 'ఇది మన కార్యాలయం... మనమే బాగుచేసుకుందాం' అంటూ ఆమె సొంత ఖర్చులతో తహసీల్దారు కార్యాలయానికి మరమ్మతులు చేయిస్తున్నారు. ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు చేయించాల్సిన మరమ్మతులను డిప్యూటీ తహసీల్దారు సొంత డబ్బుతో చేయిస్తుండటంతో ఆమె బాధ్యతాయుత కార్యాచరణ, నిజాయితీని మండల ప్రజలు అభినందించారు.

ఎమ్మెల్యే ప్రశాంతిని కలిసిన ఎంపీటీసీ

విడవలూరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): విడ వలూరు బిట్ 1, ఎంపీటీసీ ఉప ఎన్ని కల్లో ఏకగ్రీవంగా ఎన్ని కైన చలంచర్ల కామే శ్వరి స్థానిక నాయకులతో కలిసి గురువారం నెల్లూరులోని కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డిని తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్థానిక నాయకుల సహకారంతో ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈస్ట్రన్ ఛానల్ డీసీ ఛైర్మన్ పాశం శ్రీహరిరెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు ఏటూరి హరిరెడ్డి, కోవూరు మాజీ ఏఎంసీ ఛైర్మన్ పూండ్ల అచ్యుత్ రెడ్డి, ఐటీడీపీ రాష్ట్ర కార్యదర్శి సత్యవోలు సత్యంరెడ్డి నాయకులు కొమ్మిరెడ్డి మురళిరెడ్డి, ఓగు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సుద్దముక్కపై వరలక్ష్మీదేవి



మనుబోలు, ఆగస్టు 7 (ఆంధ్ర జ్యోతి): కళ అనేది ఆస్వాదించే హృదయాన్ని బట్టి ఉంటుందంటారు. కానీ చిత్రకళకు వస్తువు ఏదైనా గీసే చిత్రకారుడిని బట్టి ఉంటుందనేది వాస్తవం. సూక్ష్మ కళాకారుడు సోమా పద్మారత్నం శుక్ర వారం వరలక్ష్మీ వ్రతం సందర్భంగా గురు వారం చాక్ పీస్‌పై వరలక్ష్మీదేవి రూపాన్ని గీశారు. గంట వ్యవధిలోనే కార్వింగ్ చేసి వాటర్ కలర్స్ అద్ది అందంగా ప్రదర్శించారు. ఈ సందర్భంగా పద్మా రత్నం ప్రతిభను పలువురు కళాకారులు అభినందించారు.

రైతులు మాస్కులు ధరించాలి


రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

మనుబోలు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): రైతులు పురుగు మందులు, రసాయన ఎరువులు పిచికారీ చేసే సమయాల్లో మాస్కులు, కళ్లజోళ్లు వాడాలని మండల వ్యవసాయాధికారి వెంకటకృష్ణయ్య అన్నారు. జట్లకొండూరులో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ మాస్కులు, కళ్ళజోళ్ళు వాడకపోతే శ్వాసకోశ, నేత్ర సంబంధిత వ్యాధులు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో వీఏఏ శ్రీదేవి, రైతులు పాల్గొన్నారు.

ఆగస్టు 7.. నేతన్నలకు పండుగ రోజు

పద్మశాలి సంఘం గౌరవాధ్యక్షుడు చేపూరు చలమయ్య


సీనియర్ చేనేత కార్మికులను సత్కరిస్తున్న గౌరవాధ్యక్షుడు చలమయ్య, నాయకులు

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు7 (ఆంధ్ర జ్యోతి): చేనేత కార్మికు లందరికీ ఆగస్టు 7వ తేదీ పండుగరోజు అ ని, జాతీయ చేనేత ది నోత్సవం చేనేత వృత్తికి వన్నె తెచ్చిన రోజని విశ్రాంత ఉపాధ్యా యుడు, పద్మశాలీ సం ఘం గౌరవాధ్యక్షుడు చేపూరు చలమయ్య అన్నారు. గురువారం బుచ్చిరెడ్డిపాళెం పాత కాశీపాళెంలోని భద్రావతి సమేత శ్రీ భావనారుషీశ్వరస్వామి ఆలయంలో జాతీయ చేనేత దినోత్సవ వేడుకలను పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 11 మంది సీనియర్ చేనేత కార్మికులను శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. నేతన్నలకు కూడా ముడి సరుకులకు ప్రభుత్వ సబ్సిడీతో ఇచ్చి నేత కార్మికులను ఆదుకోవాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కాసా శ్రీనివాసులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు పోలిశెట్టి నరసయయ్య, సురేంద్ర బాబు, మల్లికార్జున, రాధయ్య, రత్నం, సుబ్బారావు చేనేతలు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో రోగనిరోధకశక్తి అధికం

మనుబోలు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): గర్భిణిలు పౌష్టికాహారం తీసుకుంటేనే ఆరోగ్యకరమైన శిశువుకు జన్మనిస్తారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఆదినారాయణమ్మ, ఉపాధ్యాయురాలు తులసి సూచించారు. కాగితాలపూరు దళితవాడలోని అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం అంతర్జాతీయ తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ముర్రుపాలు బిడ్డకు తాగిస్తే రోగనిరోధక శక్తి ఎక్కువగా ఉంటుందన్నారు. శిశువు ఎన్ని వ్యాధులు వచ్చినా తట్టుకునే శక్తి కలిగి ఉంటాడన్నారు. అనంతరం తల్లి శిశువుకు పాలు ఎలా పట్టాలో ప్రదర్శన రూపంలో తల్లులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు విజయమ్మ, గౌరి, సుబ్బరత్నమ్మ, రేవతి, ఏఎన్ఎం ప్రమీల, ఎంఎల్‌హెచ్‌పీ సుప్రజ తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా గొలగమూడి వెంకయ్యస్వామి ఆరాధన ఏర్పాట్లు

సమావేశంలో ఆర్డీవో అనూష


మాట్లాడుతున్న ఆర్డీవో అనూష

వెంకటాచలం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన గొలగమూడి భగవాన్ శ్రీ వెంకయ్య స్వామి 43వ ఆరాధనోత్సవాలను ఘనంగా నిర్వహించేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో చేపట్టాలని నెల్లూరు ఆర్డీవో అనూష అధికారులను ఆదేశించారు. గురువారం వెంకయ్య స్వామి ఆశ్రమ పరిపాలన కార్యాలయంలో ఆశ్రమ ఈఓ బాల సుబ్రహ్మణ్యంతో కలిసి ఆమె ఆరాధనోత్సవాల ఏర్పాట్లపై సమ న్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈనెల 18 నుంచి 24 వరకు జరగనున్న వెంకయ్యస్వామి ఆరాధనోత్సవాల ఏర్పా ట్లపై ముందస్తుగా సమీక్ష నిర్వహించి పలు సూచనలు, ఆదేశా లిచ్చారు. ఏడు రోజులపాటు జరిగే ఆరాధనోత్సవాలకు లక్షలాది మంది ప్రజలు, భక్తులు హాజరయ్యే అవకాశం ఉన్నందున అందుకు తగ్గ ఏర్పాట్లు చేయాల్సిందిగా సూచించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. వెంకయ్యస్వామి వారి దర్శనం, అన్నదాన కేంద్రాల వద్ద భక్తుల రద్దీని నియం త్రించడానికి కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు. నెల్లూరు నుంచి గొలగమూడికి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి వైద్యసేవలను అందించాలన్నారు. ఈఓ బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఆరాధనకు వచ్చే భక్తులకు ఆశ్రమం తరుపున అన్నదాన కార్యక్రమంతోపాటు వసతి, తాగునీటికి ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది జరగనున్న వెంకయ్యస్వామి వారి ఆరాధనోత్సవాలు ఘనంగా నిర్వహిస్తామ న్నారు. కార్యక్రమంలో నెల్లూరు రూరల్ డీఎస్పీ జీ శ్రీనివాస రావు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

C.R.I.M.E N.E.W.S

రైలు పట్టాల వద్ద గుర్తుతెలియని మృతదేహం


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

బిట్రగుంట, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): బిట్రగుంట రైల్వే సెక్షన్ పరిధిలోని తలమంచి- అల్లూరురోడ్డు స్టేషన్ల మధ్య 201/6-8 కిలోమీటర్ల వద్ద గుర్తుతెలియని పురుష (40) మృతదేహాన్ని గురువారం గుర్తించినట్లు కావలి జీఆర్పీ పోలీసులు తెలిపారు. మృతదేహం పడిఉన్న స్థితిని బట్టి గుర్తు తెలియని రైలులో నుంచి ప్రమాదవశాత్తు జారిపడి మృతిచెంది ఉంటాడని భావిస్తున్నా మన్నారు. బులుగు తెలుపు రంగుల చెక్స్ డిజైన్‌తో పూర్తిచేతుల చొక్కా, నలుపురంగు షార్ట్ ధరించి ఉన్నాడని వారు తెలిపారు. కుడిచేతిపై లవ్ సింబల్‌తో కూడిన టాటూ మార్కు ఉందన్నారు. అందులో ఐలవ్‌యూ అనే టాటూ ఉందని పేర్కొన్నారు. మృత దేహాన్ని కావలి ఏరియా వైద్యశాలకు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వరరావు తెలిపారు.

రెండు బైకులు ఢీకొని ఇద్దరికి తీవ్రగాయాలు


సంఘటనా స్థలంలో క్షతగాత్రుల వివరాలు తెలుసుకుంటున్న పోలీసులు

కావలి రూరల్ ఆగస్టు7(ఆంధ్రజ్యోతి): రెండు మోటారు బైకులు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు.ఈ సంఘటన కావలి ముసునూరు ట్రంక్‌రోడ్డులో బుధవారం అర్ధ రాత్రి చోటుచేసుకుంది. రూరల్ పోలీసుల కథనం మేరకు, ఉలవపాడు మండలం కరేడుకు చెందిన తిరువీధి దినేష్‌కుమార్ ముసునూరు నుంచి మోటారు బైకుపై కావలికి వస్తున్నాడు. అలాగే ముసునూరుకి చెందిన పాముంజి రఘువర్మ కావలి నుంచి ముసునూరు వెళ్తుండగా మార్గమధ్యంలో రెండు మోటారు బైకులు ఢీకొన్నాయి. ఈప్రమాదంలో తీవ్రంగా గాయపడినవారిని 108 వాహనంలో కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకి తరలించారు. ఈ మేరకు రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బోల్తాపడిన వ్యాన్‌ను ఢీకొన్న లారీ

- డ్రైవర్‌కు స్వల్ప గాయాలు


బోల్తాపడిన మినీ వ్యాను, లారీ

సంగం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): బోల్తాపడిన వ్యాన్‌ను లారీ ఢీకొనడంతో లారీ డ్రైవర్‌కు స్వల్ప గాయాలైన సంఘటన మండల పరిధిలోని ముంబాయి జాతీయ రహదారిపై పెరమన సమీపంలో గురువారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. నెల్లూరు నుంచి కిరాణా సరుకులు వేసుకుని మర్రిపాడుకు వెళ్తున్న మినీవ్యాన్ మార్గమధ్యంలో సంగం దాటిన తరువాత పెరమన క్రాస్ రోడ్డు సమీపంలో టైర్ పంచరై బోల్తా పడింది. ఇదే సమయంలో ఉదయగిరి నుంచి నెల్లూరు వైపు వేగంగా వెళ్తున్న లారీ బోల్తాపడిన మినీ వ్యాన్‌ను ఢీకొని రోడ్డు పక్కన ముళ్లపొదల్లోకి దూసుకుపోయింది. దీంతో లారీ డ్రైవర్ సంగప్పకు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఏటి పోరంబోకు ఆక్రమణకు యత్నం

- ఇరువర్గాల తోపులాట
- మహిళ ఆత్మహత్యాయత్నం

చేజర్ల, ఆగస్టు7 (ఆంధ్రజ్యోతి) : ఏటి పోరంబోకు కోసం ఇరువర్గాలు ఘర్షణ పడిన సంఘటన మండలంలోని మడిపల్లి గ్రామంలో గురువారం జరిగింది. మడపల్లిలోని సర్వే నెం.1255లో పెన్నానది పోరంబోకు భూమికి సంబంధించి అదే గ్రామానికి చెందిన వసంతమ్మ, చలమల సుబ్బారెడ్డి మధ్య కొంత కాలంగా వివాదం నడుస్తోంది. గత నెలలో అధికారులకు పరస్పరం ఫిర్యాదు చేసుకోగా, ఒక వర్గం కోర్టుకు కూడా వెళ్లింది. కోర్టు ఆదేశాల మేరకు ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు వివాదంలో ఉన్న భూమిలో ఎవరూ ప్రవేశించరాదని బోర్డులు ఏర్పాటు చేశారు. అయితే గురువారం ఆ భూమిని ఆక్రమించుకునేందుకు ఇరువర్గాలు ప్రయత్నించగా, తోపులాటల జరిగాయి. దీంతో వసంతమ్మ సమీపంలో ఉన్న పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. వెంటనే ఆమెను ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ ఘటనపై తహసీల్దారు మురళి మాట్లాడుతూ కోర్టు ఆదేశాలతో గత నెలలోనే వివాదాస్పద భూమిలో బోర్డులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అయితే, గురువారం జరిగిన ఘటన తనకు తెలియదని అన్నారు.

పిడుగుపాటుకు నాలుగు మేకల మృతి

ఉదయగిరి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్లపడియ గ్రామ ఎస్సీ కాలనీలో పిడుగుపాటుకు గురై నాలుగు మేకలు మృతిచెందగా, రెండు మేకలు తీవ్ర అస్వస్థతకు గురైన సంఘటన గురువారం రాత్రి చోటుచేసుకొంది. వివరాల మేరకు.. కాలనీకి చెందిన ఇత్తడి ఆశీర్వాదం తన మేకలను మేత కోసం అడవికి తోలుకెళ్లి ఇంటికొచ్చాడు. ఉరుములు, మెరుపులు కూడిన వర్షం కురిసింది. ఆ సమయంలో ఇంటి ఆరుబయట ఉన్న మేకలపై ఒక్కసారిగా పిడుగుపడడంతో నాలుగు మేకలు మృతిచెందగా, రెండు మేకలు తీవ్ర అస్వస్థతకు గురయ్యాయి. మేకలే జీవనాధారంగా జీవిస్తున్న తనకు అవి మృతిచెందడంతో సుమారు రూ.50 వేలు నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

రొయ్యకు శోకం

(5వ పేజీ తరువాయి)

ఎగుమతి సంస్థ బీఎంఆర్ సంస్థ ఛైర్మన్, రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు మంత్రులు, అధికారుల బృందాలతో సంక్షోభం నుంచి బయటపడే మార్గాలను అన్వేషిస్తున్నారు. భవిష్యత్తులో ఎదురయ్యే ఇలాంటి విపత్తులను శాశ్వతంగా ఎదుర్కొనే దిశగా స్థానిక మార్కెట్‌ను వృద్ధి చేసుకోవాలని ప్రాథమికంగా నిర్ణయం జరిగింది. దేశంలో స్థానికంగా రొయ్యల వినియోగం చాలా తక్కువగా ఉంది. లక్ష టన్నుల దిగుబడి వస్తే దేశం లోపల 10వేల టన్నులు కూడా తినడం లేదు. స్థానిక వినియోగం పెరిగేలా చేయడానికి అవసరమైన చర్యలకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	102
స్కిన్ చికెన్	190
స్కిన్‌లెస్	212

కోడిగుడ్ల ధర (100) : 490



బీసీ హాస్టళ్లలో ఫ్రెషర్స్ డే వేడుకలు

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి) : బీసీ సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థుల కోసం ఫ్రెషర్స్ డే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు పాల్గొనేలా అధికారులు చర్యలు చేపట్టారు. టీపీ గూడూరులోని బీసీ బాలుర వసతి గృహంలో గురువారం రాత్రి ఫ్రెషర్స్ డే కార్యక్రమం ఘనంగా జరిగింది. జిల్లా బీసీ సంక్షేమాధికారి వెంకట లక్ష్మమ్మ, నెలూరు సహాయ బీసీ సంక్షేమాధికారి శ్రీదేవి ఈ కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు పలు సూచనలు చేశారు. డీజే సౌండ్ మధ్య విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఆ హాస్టల్ హెచ్‌డబ్ల్యూవో నరసింహమూర్తి పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

తల్లిపాలకు మించిన ఔషధం లేదు

నెల్లూరురూరల్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి) : చిన్నారులకు తల్లిపాలను మించిన ఔషధం మరొకటి లేదని తల్లిపాల వారోత్సవాల్లో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు తెలిపారు. గురువారం వారోత్సవాలకు చివరి రోజు కావడంతో అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐసీడీఎస్, వైద్యఆరోగ్య శాఖ అధికారులు సంయుక్తంగా కార్యక్రమాలు నిర్వహించారు. 24వ డివిజన్ కల్లూరుపల్లిలో స్థానిక కార్పొరేటర్ అరవ శాంతి, ఐసీడీఎస్ సీడీపీవో అరుణ పాల్గొన్నారు. బాలింతలు, గర్భవతులు తల్లిపాల విశిష్టతపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ స్వరూప పాల్గొన్నారు. అల్లీపురం, సౌత్‌రాజుపాళెం ప్రాంతాల్లో జరిగిన వారోత్సవాల్లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వీ శంకుంతల, ములుముడిలో సూపర్‌వైజర్ విజయలక్ష్మి, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

వీఆర్ స్కూల్లో పేదలకే అడ్మిషన్

● డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్

నెల్లూరు (వైద్యం), ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి మంత్రి పొంగూరు నారాయణపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని నగర డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్ విమర్శించారు. గురువారం నగరంలోని ఆయన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. వీఆర్ హైస్కూల్లో పేద విద్యార్థులకే అడ్మిషన్ ఇచ్చారన్నారు. ఇందులో రాజకీయ ప్రమేయం లేదని, టీడీపీ వారికి ప్రాధాన్యత ఇచ్చారనటంలో వాస్తవం లేదన్నారు. కుసుమ హరిజనవాడ, జెండావీధి, ఖుద్దూస్ నగర్, మన్సూర్ నగర్, సంతపేట, కపాడిపాళెం తదితర ప్రాంతాల చుట్టుపక్కల ఉన్న పేద కుటుంబాల పిల్లలనే చేర్చుకున్నారని చెప్పారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్), ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి) : హాస్టల్ నుంచి ఇంటికి వెళ్లిన యువతి అదృశ్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు బోగోలు మండలానికి చెందిన ఓ యువతి నెల్లూరు నగరంలోని ఒక డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతోంది. ఏసీ కూరగాయల మార్కెట్ సమీపంలోని ప్రభుత్వ హాస్టల్‌లో ఆమె ఉంటోంది. ఈనెల 6న ఆమె బట్టలు తీసుకుని ఇంటికి వెళుతున్నానని చెప్పి, హాస్టల్ నుంచి బయలు దేరింది. ఈ విషయాన్ని హాస్టల్ సిబ్బంది యువతి తల్లికి ఫోన్‌చేసి చెప్పారు. తల్లి కుమార్తెకు ఫోన్ చేయగా ఫోన్ స్విచ్ ఆఫ్‌లో ఉంది. కుమార్తె ఇంటికి రాకపోవటంతో నెల్లూరుకు చేరుకుని గాలించింది. ఫలితం లేకపోవడంతో కుమార్తె అదృశ్యంపై చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు విచారిస్తున్నారు.

● బైక్ చోరీపై ..

బైక్ చోరీపై వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... నగరంలోని పద్మావతి సెంటర్‌కు చెందిన రవి ప్రసాద్ తడ తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్నారు. ప్రతి రోజూ ఆయన రైలులో తడకు వెళ్లి వచ్చేవారు. ఈనెల 3న సాయంత్రం వేదాయపాళెం రైల్వే స్టేషన్‌లో రైలు దిగారు. పార్కింగ్‌లో ఉన్న బైక్ తీసుకుని ఇంటికి బయలు దేరారు. గాంధీనగర్ రోడ్డులో ఒక దుకాణం వద్ద బైక్ పార్కు చేసి లోపలికి వెళ్లి వచ్చే లోపు బైక్‌ను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. బాధితుడు గురువారం వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు దర్యాప్తు చేస్తున్నారు.

సెప్టెంబరు నాటికి అమృత్ పథకం పూర్తి

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): సెప్టెంబరు నాటికి కావలిలో అమృత్ పథకం పూర్తవుతుందని కేంద్రగృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వశాఖ సహాయ మంత్రి తోఖాన్ సాహు చెప్పారు. గురువారం లోక్‌సభలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఏపీలో అమృత పథరాల అమలుపై అడిగిన ప్రశ్నకు ఆయన సమాధాన ఇచ్చారు. కావలిలో రెండు అమృత్ పథక ప్రాజెక్టులు అమలులో ఉన్నాయని, ఈ ఏడాది సెప్టెం బరు నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు మంత్రి వివరించారు.

మట్టి అక్రమ తరలింపు కేసులో కాకాణికి బెయిల్

నెల్లూరు (లీగల్),ఆగస్టు7 (ఆంధ్రజ్యోతి): కనుపూరు చెరువు మట్టిని అక్రమంగా తరలించారన్న కేసులో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి బెయిల్ మంజూరు చేస్తూ నెల్లూరు మొదటి తరగతి నాల్గవ అదనపు జ్యుడీషియల్ న్యాయాధికారి షేక్ నిషాద్ నాజ్ గురువారం ఉత్తర్వులిచ్చారు. షరతులతో కూడిన ఈ బెయిల్ పొందడానికి రూ.25 వేల చొప్పున ఇద్దరి పూచీకత్తు ఇవ్వాలని కూడా ఉత్తర్వులలో పేర్కొన్నారు. కాగా, వెంకటాచలం పోలీసులు ఈ కేసులో కాకాణిని ఏ1గా చేర్చి ఉన్న విషయం విదితమే.







ఫొటోలు : స్టాఫ్ ఫొటోగ్రాఫర్

ఛీవాజీ నగర్ !

నగరంలో పొదలకూరు రోడ్డులోని శివాజీ నగర్ కాలనీ మురుగు, వ్యర్థాలకు నిలయంగా మారింది. ఇక్కడి కాలువల్లో భారీగా చెత్త, గుర్రపు డెక్కాకు పేరుకుంది. వీటి వల్ల మురుగు పారుదల లేక దుర్వాసన వ్యాపిస్తోంది. ఈ కాలనీకి, ఎస్సీ కాలనీకి మధ్య ఉన్న కాలువ దాటాలంటే విద్యుత్ స్తంభాలే వంతెనలవుతున్నాయి. పసి పిల్లలు, మహిళలు ఆ కాలువ దాటుతూ ప్రమాదాలకు గురవుతు న్నారు. మురుగు వల్ల దోమల విజృంభణతో రోగాల బారినపడుతున్నారు. సుందర సింహపురి ప్రకటనలిచ్చే పాలకులు ఈ ప్రాంతాలపై దృష్టిపెట్టాల్సిన అవసరం ఉంది.

స్మార్ట్ మీటర్లను రద్దు చేయాల్సిందే!: సీపీఎం



విద్యుత్ కేంద్రం ఎదుట ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

నెల్లూరు రూరల్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి) : స్మార్టు, ప్రీపెయిడ్ విద్యుత్ మీటర్ల ఏర్పాటు నిర్ణయాన్ని ప్రభుత్వాలు రద్దు చేయాల్సిందేనని సీపీఎం నాయకులు స్పష్టం చేశారు. నెల్లూరు రూరల్లోని కొత్తూరు విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద 30, 31 డివిజన్లకు సంబంధించిన సీపీఎం శాఖల ఆధ్వర్యంలో గురువారం ధర్నా చేశారు. పార్టీ నాయకులు మాదాల వెంకటేశ్వర్లు, కొండా ప్రసాద్ మాట్లాడుతూ ఇప్పటి వరకు ప్రభుత్వం రూ. 15,485 కోట్లను సర్దుబాటు చార్జీల పేరిట వినియోగదారులపై భారం మెపిందని విమర్శించారు. స్మార్టు మీటర్ల ఏర్పాటుతో మరో 25 వేల కోట్ల భారం పడుతుందని చెప్పారు. ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకో వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పెంచలనరసయ్య, కట్టా సతీష్, కండే కోటేశ్వరరావు, బీ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఇస్కాన్ సిటీలో కాలువ పోరంబోకు ఆక్రమణ

● పిల్లర్లతో చకచకా శాశ్వత నిర్మాణం ● అడ్డుకున్న సిటీ ప్లానింగ్ అధికారులు



కాలువ పోరంబోకు స్థలంలో పిల్లర్ల నిర్మాణాన్ని పరిశీలిస్తున్న సిటీప్లానింగ్ అధికారులు

నెల్లూరు(సిటీ), ఆగస్టు 7,(ఆంధ్రజ్యోతి) : నెల్లూరులో భూ ఆక్రమణలు పెట్రేగిపోతున్నాయి. కొంచెం స్థలం కనిపిస్తే చాలు కబ్జా చేసేస్తున్నారు. ఈ కోవలోనే నగరంలోని ఇస్కాన్ సిటీ వద్ద కాలువ పోరంబోకు భూమిని ఆక్రమించారు. స్థానికంగా వాణిజ్య భవనం నిర్మిస్తున్న కొందరు ఆ స్థలం పక్కనే ఉన్న కాలువ పోరంబోకును కూడా వారి స్థలంలో కలుపుకుని శాశ్వత కట్టడాలకు శ్రీకారం చుట్టారు. దీనిని గతంలోనే అధికారులు అడ్డుకోవడంతో పనులు ఆపేశారు. గురువారం ఆ పనులను కొనసాగించడంతో సమాచారం అందుకున్న సిటీప్లానింగ్ అధికారులు మరోసారి అడ్డుకున్నారు. స్థల పత్రాలు తమకు చూపాలని, అనుమతి పొందిన మేరకు కట్టడాలు నిర్మించాలని సూచించారు. అయితే వాళ్లు వెళ్లిన కాసేపటికే పనులు కొనసాగించడం విశేషం. ఈ ప్రాంతంలో చిన్న స్థలం కూడా రూ.కోట్లు పలుకుతుండటంతో కబ్జాదారులు బరితెగిస్తున్నారు.

కొనసాగుతున్న కూల్చివేత

నగరంలోని జేమ్స్ గార్డెన్ వద్ద అనధికార కట్టడాలను గుర్తించిన కార్పొరేషన్ సిటీప్లానింగ్ అధికారులు వాటి కూల్చివేత పనులను గురువారం కొనసాగించారు. బుధవారం రంగంలోకి దిగిన ప్రత్యేక సిబ్బంది వరుసగా మూడు భవనాలను నేలమట్టం చేస్తున్నారు. ఇందులో భాగంగా భారీ యంత్రాలను రంగంలోకి దింపి కూల్చివేత పనులు కొనసాగిస్తు న్నారు. ఈ భవనాలకు నోటీసులు జారీ చేసి అధికారులు హెచ్చరించినా వాటి యజమానులు స్పందించకపోవడంతో కూల్చివేతకు పూనుకున్నారు.

విద్యార్థిని కుటుంబానికి ఉపాధ్యాయుల చేయూత



బాధితులకు నిత్యావసరాలు అందిస్తున్న ఉపాధ్యాయులు

నెల్లూరు(విద్య), ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని కోటమిట్ట సమీపంలో ఉన్న కృష్ణమందిరం నగరపాలక ప్రాథమిక పాఠశాల విద్యార్థిని లహరి కుటుంబానికి ఆ బడి ఉపాధ్యాయులు చేయూతనిచ్చారు. బాలిక కుటుంబం నివసించే ఇల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోవడంతో ఉపాధ్యాయులు రూ.18 వేలు నగదు, నిత్యావసర సరుకులు, ఇంటి సామాన్లు అందచేశారు. కార్యక్రమంలో రూరల్ ఎంఈవో-2 ఎస్‌డీ అబ్దుల్ హమీద్, హెచ్‌ఎం ఖాజారహంతుల్లా, ఉపాధ్యాయుడు గోవిందు, టీడీపీ నాయకుడు ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యాలయంలో చేనేత దినోత్సవం



సీఎం చంద్రబాబు, మంత్రి సబిత చిత్రపటాల వద్ద నాయకులు

నెల్లూరు (వైద్యం), ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం 11వ జాతీయ చేనేత దినోత్సవం జరిగింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి సబిత చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఉత్తమ చేనేత కళాకారులను సత్కరించారు. నాయకుడు పీఎల్ రావు మాట్లాడుతూ చేనేతల మగ్గానికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్, పవర్ మగ్గాలకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించటం శుభ పరిణామమన్నారు. అలాగే క్యాబినెట్‌లో నేతన్న భరోసా కోసం రూ.2500 ఇస్తామని పేర్కొనడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం రాష్ట్ర కన్వీనర్ తాళ్ల నరసింహస్వామి, పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ కంచి జ్ఞానేంద్ర, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ ఆశం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

శానిటేషన్ సిబ్బందిపై చర్యలు

● మార్కెట్ అపరిశుభ్రంగా ఉండటంతో నిర్ణయం



మార్కెట్ పరిసరాలను పరిశీలిస్తున్న కమిషనర్

నెల్లూరు(సిటీ), ఆగస్టు 7(ఆంధ్ర జ్యోతి) : నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి కూరగాయల మార్కెట్‌ను కార్పొరేషన్ కమిషనర్ నందన్ గురువారం ఆకస్మి కంగా తనిఖీ చేశారు. మార్కెట్ ప్రాంగణం అపరిశుభ్రంగా ఉండటం, జనావాసాల మధ్య పశువులు సంచరించడం గమనించిన ఆయన స్థానిక శానిటేషన్ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ఎంహెచ్‌వో కనకాద్రికి సూచించారు. మార్కెట్‌ను శుభ్రంగా ఉంచాలని, పశువులను గోశాలకు తరలించాలని ఆదేశించారు. మార్కెట్‌లో వ్యాపారుల సంఘం కూడా చొరవ తీసుకుని పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. అనంతరం జేసీ కార్తీక్‌తో కలిసి భగత్‌సింగ్ కాలనీ వద్ద పట్టాల పంపిణీ కార్యక్రమానికి స్థలాన్ని పరిశీలించారు. దొంతాలి వద్ద జిందాల్ కంపెనీ ఏర్పాటు చేయబోతున్న 12 మెగావాట్ల వేస్టు టు ఎనర్జీ ప్లాంటుకు సంబంధించి రూ. 6 కోట్ల బ్యాంకు గ్యారంటీ పత్రాలను ఆ కంపెనీ ప్రతినిధులు కమిషనర్‌కు ఇచ్చారు.

జోనల్ ఆర్చరీ పోటీలకు 'రత్నం' విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న జీఎం రామ్మూర్తి నాయుడు

నెల్లూరు(విద్య), ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : జోనల్ ఆర్చరీ పోటీలకు నగరంలోని డాక్టర్ కిషోర్స్ రోషిణీ రత్నం హైస్కూల్ విద్యార్థులు ఎంపికైన ట్లు ఆ విద్యాసంస్థల జీఎం రామ్మూర్తినాయుడు తెలిపారు. పాఠశాలలో గురువారం జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో తమ విద్యార్థులు పీ భావజ్ఞహంసిని, కే జనరీ, కే మోక్ష ప్రతిభ చాటి జోనల్ స్థాయికి ఎంపికయ్యారని చెప్పారు. ఈ కార్యక్రమంలో జూనియర్ మేనేజర్ అజయ్‌సింగ్, ప్రిన్సిపాల్ మణిమాల, సిబ్బంది పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో అన్నదానం



అన్నదానంలో సూపరింటెండెంట్ డాక్టర్ మాధవి, కో ఆర్డినేటర్ శ్రీనివాసులు తదితరులు

నెల్లూరు (వైద్యం), ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఉన్న నాగార్పమ్మ దేవస్థానం తొలి వార్షికోత్సవం సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు జరిగాయి. అనంతరం రోగుల సహాయకులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మాధవి, అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ కళారాణి, అభివృద్ధి కమిటీ కో ఆర్డినేటర్ మడపర్తి శ్రీనివాసులు, సభ్యుడు మొగరాల సురేష్, డీసీ మహేశ్వరరెడ్డి, శానిటరీ సూపర్‌వైజర్ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

వాకర్స్ ఆధ్వర్యంలో..

నెల్లూరు(విద్య), ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జనరల్ ఆసుపత్రి ప్రాంగణంలోని సత్యసాయి సేవా ట్రస్ట్‌లో గురువారం అన్నదానం చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు చింతల అమరేంద్రరెడ్డి మాట్లాడుతూ సంఘం ఉపాధ్యక్షుడు స్వర్ణ రమేష్‌బాబు తండ్రి నరసారావు వర్ధంతి సందర్భంగా రోగులకు, వారి సహాయకులకు అన్న ప్రసాద వితరణ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి పొన్నం రవిచంద్ర, గౌరవాధ్యక్షుడు మేకల నరేంద్రరెడ్డి, బలరామయ్య నాయుడు, రాఘవేంద్రశెట్టి తదితరులు పాల్గొన్నారు.

చేనేతకు రాయితీలు శుభపరిణామం

● సీపీఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య



సీపీఐ జిల్లా కార్యాలయం వద్ద చేనేత జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

నెల్లూరు (వైద్యం), ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : చేనేత కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం 200 యూనిట్ల విద్యుత్‌ను ఉచితంగా ఇస్తామని ప్రకటించటం శుభపరిణామమని సీపీఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య అన్నారు. గురువారం జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా పార్టీ జిల్లా కార్యాలయం వద్ద చేనేత జెండాను ఆవిష్కరించారు. అంకయ్య, చేనేత ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శేషయ్య మాట్లాడుతూ చేనేత ఉత్పత్తులపై జీఎస్టీని రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తామని ప్రకటించడం సంతోషంగా ఉందన్నారు. అదేవిధంగా చేనేత ఉత్పత్తులపై ఉన్న 11 రకాల రిజర్వేషన్ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని, చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో చేనేత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకట సురేష్, పముజుల చంద్రశేఖర్, బైన రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



లీగల్ సర్వీసెస్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న న్యాయాధికారి వాణి

సైనిక భవన్‌లో లీగల్ సర్వీసెస్ క్లినిక్ ప్రారంభం

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లా సైనిక సంక్షేమాధికారి కార్యాలయంలో లీగల్ సర్వీస్ క్లినిక్‌ను గురువారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి కే వాణి ప్రారంభించారు. ఈ క్లినిక్‌లో న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ప్యానెల్ లాయర్, పారా లీగల్ వలంటీర్‌ని నియమిస్తామని ఆమె తెలిపారు. వారు వారంలో ఒక రోజు అందుబాటులో ఉంటారని, వారి సేవలను మాజీ సైనికులు, వారి కుటుంబాలు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమాధికారి జీ హరికృష్ణ, మాజీ వింగ్ కమాండర్ శ్యాంప్రసాద్, కార్యాలయ సిబ్బంది, అసోసియేషన్ నాయకులు కళాధర్, రత్నయ్య తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య రానివ్వొద్దు

● నగర కమిషనర్ నందన్

నెల్లూరు(సిటీ), ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి) : నగరంలోని ప్రజలకు తాగునీటి సమస్య రానివ్వద్దని ఎన్‌ఎంసీ కమిషనర్ నందన్ అధికారులకు సూచించారు. గురువారం కార్పొరేషన్ కార్యాలయంలో టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డితో కలిసి సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. రూరల్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు తాగునీటి సమస్య ఉన్నట్లు ప్రజల నుంచి ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డికి ఫిర్యాదులు అందాయ ని తెలిపారు. ఆ సమస్యలను తక్షణం పరిష్కరించి తాగునీటి సరఫరాలో లోపాలు రానివ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఇంజనీరింగ్, పబ్లిక్‌హెల్త్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు కోడూరు కమలాకర్‌రెడ్డి, చక్రవర్ధన్‌రెడ్డి, మదన్‌కుమార్‌రెడ్డి, రఘు పాల్గొన్నారు.

సత్యసాయి జయంతి జీవో ప్రతుల చించివేత

నెల్లూరు (సాంస్కృతికం) ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : సత్యసాయిబాబా జయంతిని రాష్ట్ర పండుగగా జరపాలని ప్రభుత్వం విడుదల చేసిన జీవో 862 ప్రతులను గురువారం హేతువాద సంఘం నాయకులు చించివేశారు. ప్రెస్‌క్లబ్‌లో వారు విలేకరులతో మాట్లాడారు. పుట్టపర్తి సత్యసాయిబాబా శత జయంతిని ప్రభుత్వ పండుగగా జరపాలని జీవో తీసుకురావడం రాష్ట్ర ప్రజలను అవమానపరచడమేనన్నారు. ఇది రాజ్యాంగ విరుద్ధమని ఖండించారు. దేవుడు వ్యక్తిగతంగానే ఉండాలన్నారు. సత్యసాయి చిన్న చిన్న మాజిక్కులు నేర్చుకుని, వాటిని మహత్యాలని ప్రపంచ వ్యాప్తంగా ప్రచారం చేసుకుని వేల కోట్లకు పడగలెత్తారని ఆరోపించారు. అలాంటి వ్యక్తి జయంతిని రాష్ట్ర పండువగా నిర్వహించాలనే జీవోను చించి వేస్తున్నామని చెప్పారు ఈ సమావేశంలో భారత హేతువాద సంఘ అధ్యక్షుడు నార్నే వెంకట సుబ్బయ్య, కోశాధికారి రఘు, జిల్లా మాజీ అధ్యక్షుడు ఐ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

బైక్ చోరీపై కేసు నమోదు

నెల్లూరు(క్రైం) : బైక్ చోరీపై వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... నగరంలోని పద్మావతి సెంటర్‌కు చెందిన రవి ప్రసాద్ తడ తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్నారు. ప్రతి రోజూ ఆయన రైలులో తడకు వెళ్లి వచ్చేవారు. ఈనెల 3న సాయంత్రం వేదాయపాళెం రైల్వే స్టేషన్‌లో రైలు దిగారు. పార్కింగ్‌లో ఉన్న బైక్ తీసుకుని ఇంటికి బయలు దేరారు. గాంధీనగర్ రోడ్డులో ఒక దుకాణం వద్ద బైక్ పార్కు చేసి లోపలికి వెళ్లి వచ్చే లోపు బైక్‌ను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. బాధితుడు గురువారం వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు దర్యాప్తు చేస్తున్నారు.



డీజీకి పుష్పగుచ్ఛం ఇస్తున్న నాయకులు

అగ్నిమాపక శాఖ డీజీకి సత్కారం

నెల్లూరు(క్రైం), ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి) : అగ్నిమాపక శాఖ రాష్ట్ర డైరెక్టర్ జనరల్(డీజీ)గా బాధ్యతలు స్వీకరించిన పీ వెంకట రమణను ఆ శాఖ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కే చంద్రశేఖర్ విజయ వాడలో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందచేసి శాలువాతో సత్కరిం చారు.



కుంకుడాకుపై లక్ష్మీదేవి

వరలక్ష్మీ వ్రతాన్ని పురస్కరించుకుని మండలంలోని మహమ్మదాపురం గ్రామానికి చెందిన రిటైర్డ్ డ్రాయింగ్ మాస్టర్ పచ్చా పెంచలయ్య కుంకుడు ఆకుపై వరలక్ష్మీ దేవి సూక్ష్మ చిత్రాన్ని గీశారు. లక్ష్మీదేవిని పూజిస్తే అష్టైశ్వర్యాలు లభిస్తా యని భక్తుల విశ్వాసం. అందుకే ఆ తల్లి కరుణా కటాక్షాలు అందరి పైన ఉండాలని ఈ చిత్రాన్ని గీసినట్లు ఆయన తెలిపారు. పెంచలయ్య కుంచె నుంచి జాలువారిన ఈ చిత్రం కళాత్మకంగా - భక్తిప్రబోధకంగా ఉందని భక్తులు అభినందించారు.

- పొదలకూరు, (ఆంధ్రజ్యోతి)

విద్యార్థుల 'వృక్షాబంధన్'!

ప్రకృతి పరిరక్షణలో ప్రధాన భూమిక పోషించే చెట్లను రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొంటూ అనంతసాగరం మండలం చిలకల మర్రి ఉన్నత పాఠశాల విద్యార్థులు వినూత్న కార్యక్రమం చేపట్టారు. శనివారం రాఖీ పౌర్ణమి సందర్భంగా ముందస్తుగా గురువారం 'చెట్లకు రాఖీలు కడదాం.. ప్రకృతిని కాపాడుకుందాం.' అంటూ విద్యార్థులు చెట్లకు రాఖీ కట్టి ప్రతిజ్ఞ చేశారు. ఆ సందర్భంగా ఆ పాఠశాల హెచ్ఎం ప్రసాద్‌రెడ్డి మొక్కలు పెంచడంతో కలిగే ప్రయోజనాలు వివరించారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు

- అనంతసాగరం, (ఆంధ్రజ్యోతి)





మాలకొండ హుండీల ఆదాయం రూ. 72,15,189

వలేటివారిపాలెం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాల కొండ శ్రీమాల్యాద్రి లక్ష్మీనృసింహ స్వామికి 7 శనివారాలగానూ 20 హుండీల ద్వారా రూ72,15,189 ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమి షనర్ ఎస్. చంద్రశేఖర్ తెలిపారు. మాలకొండ ఆలయంలోని కల్యాణ మండపంలో అమరావతి శ్రీఅమరలింగేశ్వరుడి ఆలయ సహాయ కమిషనర్ కే. రేఖ పర్యవేక్షణలో గురువారం హుండీల లెక్కింపు జరిగింది. ఈ లెక్కింపులో నగదుతోపాటు 278 గ్రాములు బంగారం, 885 గ్రాములు వెండి కూడా వచ్చినట్లు ఆలయ డీసీ వివరించారు.

ఈ కలప ఇంతేనా!?

- హైవే నిర్మాణంలో తొలగించిన చెట్లు
- సేకరించిన కలప వేలం నిర్వహణలో అలసత్వం
- ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తున్నవైనం
- ప్రభుత్వ ఆదాయానికి గండి

ఉదయగిరి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : అటవీ శాఖాధికారుల నిర్లక్ష్యం ప్రభుత్వ ఆదాయానికి శాపంగా మారుతోంది. జాతీయ రహదారి నిర్మాణానికి సంబంధించి రిజర్వు ఫారెస్టులో తొలగించిన చెట్ల నుంచి వచ్చిన కలపకు వేలం నిర్వహించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఉదయగిరి అటవీ శాఖ పరిధిలోని సీతారామపురం వద్ద జాతీయ రహదారి (గ్రీన్‌ఫీల్డ్) నిర్మాణం జరుగుతోంది. ఈ రహదారి నిర్మాణం రిజర్వు ఫారెస్టు మీదుగా వెళుతుండటంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రిజర్వు ఫారెస్టులో ఉన్న వివిధ రకాల చెట్లను తొలగించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఇందుకుగాను ప్రభుత్వం కూలీలు, రవాణాకు సుమారు రూ.17.50 లక్షలు మంజూరు చేసింది. ఈ నేపథ్యంలో అధికారులు ఈ ఏడాది మార్చిలో చెట్లను నరికి సుమారు 300 టన్నుల కలపను టిప్పర్ల సహాయంతో ఉదయగిరి అటవీ శాఖ కార్యాలయ ప్రాంగణానికి తరలించి నిల్వ చేశారు. అయితే, 5 నెలలు కావస్తున్నా ఇంతవరకు అధికారులు వేలం నిర్వహించలేదు. దీంతో కలప ఎండకు ఎండు తూ, వానకు తడుస్తూ పురుగు పట్టి పుచ్చిపోతోంది. ప్రస్తు తం టన్ను కర్ర ధర రూ.3వేల నుంచి రూ.3,500 వరకు పలుకుతోంది. అప్పట్లోనే అధికారులు కలపకు వేలం నిర్వహించి ఉంటే ప్రభుత్వానికి ఆదాయం వచ్చి ఉండేది. ప్రస్తుతం కర్ర ఎండిపోయి, పురుగు పట్టడంతో బరువు తగ్గి ప్రభుత్వానికి నష్టం చేకూర్చింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి కలపకు వేలం నిర్వహిస్తే ప్రభుత్వానికి కాస్తయినా ఆదాయం చేకూరుతుందని పలువురు పేర్కొంటున్నారు.



ఉదయగిరి అటవీ శాఖ కార్యాలయంలో నిల్వ చేసిన కలప

ఉన్నతాధికారులకు నివేదించాం

మా కార్యాలయ ఆవరణలో నిల్వ ఉంచిన కలపకు వేలం వేసేందుకు గాను ఉన్నతాధికారులకు నివేదికలు పంపాం. తదుపరి ఆదేశాల ప్రకారం త్వరలో వేలం నిర్వహిస్తాం.

- బీఎస్ కుమారరాజా,
అటవీ శాఖాధికారి,
ఉదయగిరి

కొండాపురంలో
ప్రభుత్వ భూముల ఆక్రమణ

- ఆపై పక్కా భవనాల నిర్మాణం, పట్టించుకోని అధికారులు
- భూముల ధరలు పెరగడమే ఇందుకు కారణం
- ఫిర్యాదుచేస్తేనే కదులుతున్న యంత్రాంగం

కొండాపురం, ఆగస్టు7(ఆంధ్రజ్యోతి): ఆక్రమణలకు హద్దులు లేవంటూ మండలంలోని ప్రభుత్వ భూములను బడాబాబులు ఆక్రమించుకుంటున్నారు. అంతేకాక కంచె వేసుకుని, పక్కా నిర్మాణాలు కూడా చేపడుతున్నారు. వ్యవసాయానికి పనికి వచ్చే భూముల్లో సాగు చేస్తున్నారు. ఇదంతా తెలిసినా పంచాయతీ పాలకులు, అధికారులు పట్టించుకోవడంలేదని మండలవాసులు అంటున్నారు.

ధరల పెరుగుదలే కారణం

భూముల ధరలు విపరీతంగా పెరుగుతుండటంతో ఆక్రమణలు ఎక్కువయ్యాయి. దీంతో ఖాళీగా ఉన్న సర్కారు భూములపై అక్రమార్కుల కన్నుపడింది. విలువయిన ఖాళీ స్థలాల్లో గద్దల్లా వాలిపోతున్నారు. ఇలా ఆక్రమించుకుంటూ పోతే రానున్న రోజుల్లో ప్రభుత్వ భూమే ఉండదు. మండలంలోని 19 పంచాయతీల్లోనూ భూ ఆక్రమణలు జరుగుతున్నాయి. గ్రామస్థులు ఫిర్యాదుచేస్తేనే అధికారులు కదులుతున్నారేతప్ప లేకుంటే తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. మండలంలోని గానుగపెంట పంచాయతీలో ఖాళీగా ఉన్న వాగులు, మేత పోరంబోకు, మందబయలు భూములను ఎకరాలకు ఎకరాలను బడాబాబులు ఆక్రమించుకుంటున్నారు.ఆ గ్రామంలో 2150 ఎకరాల వరకు ప్రభుత్వ భూమి ఉండగా, అందులో అటవీ పోరంబోకు 1500, మాగాణి సుమారు 250, అసైన్డ్ భూమి సుమారు 390 ఎకరాల వరకు ఉంది. ఒక్క గానుగపెంటలోనే దాదాపు ఐదు ఎకరాల వరకు ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురయినట్లు గ్రామస్థులు తహసీల్దార్‌కు ఫిర్యాదుచేశారు.



గానుగపెంట పంచాయతీలోని ప్రభుత్వ స్థలంలో నిర్మించిన కట్టడాలు

అన్నీ గ్రామాల్లోనూ ఆక్రమణలే..

ఇలా మండలంలోని అన్నీ గ్రామాల్లోనూ 100 ఎకరాల వరకు ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురయినట్లు ఆరోపణలు వస్తున్నాయి. నేకునాంపేట పంచాయతీలో కుంట భూమిని పక్కనే ఉన్న రైతు కుంటను పూడ్చడానికి ప్రయత్నిస్తుంటే గ్రామస్థులు అడ్డుకొని రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. అలాగే సాయిపేటలో మందబయలు భూమిని ఆక్రమించి కట్టడాలు చేస్తుంటే గ్రామస్థులు సబ్‌కలెక్టరుకు ఫిర్యాదుచేశారు. పరిశీలించిన ఆమె సర్వేచేసి కట్టడాలను తొలగించాలని ఆదేశించినా ఫలితంలేదు. ఈవిషయంపై తహసీల్దార్ సురేష్‌బాబును వివరణకోరగా ప్రభుత్వ భూములు ఆక్రమణపై ఫిర్యాదులు చేస్తే వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. గానుగపెంట పంచాయతీలో యజమాని తన పొలం పక్కనే ఉన్న సర్వే నంబరు 18లో పోరంబోకు భూమిలో సుమారు 2 ఎకరాలు ఆక్రమించుకొన్నారు. నేడు మార్కెట్లో దాని విలువ సుమారు రూ. 50 లక్షల వరకు ఉంటుందని, రెవెన్యూ అధికారులకు గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. రెవెన్యూ అధికారులు సర్వేచేసి సదరు భూమిని ఖాళీ చేయమని అక్రమణదారుడికి చెప్పినా ఫలితం లేకపోయింది.

ఆ ప్రాంతాలకు
ఉపశమనం కలిగేనా!?

- అశాస్త్రీయంగా నాడు జిల్లాల విభజన
- కందుకూరు, గూడూరు ప్రాంతాలకు అన్యాయం
- పాత జిల్లాల్లో కలిపేందుకు మంత్రులతో ప్రత్యేక కమిటీ
- రెండుప్రాంతాల్లోనూత చిగురిస్తున్న ఆశలు

నెల్లూరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలు, డివిజన్లు, మండలాల పునర్విభజనను చేపట్టేందుకు ప్రభుత్వం మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేయడంతో కందుకూరు, గూడూరు ప్రాంతవాసుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. 1970కు ముందు వరకూ కందుకూరుతోపాటు కనిగిరి, దర్శి, పొదిలి ప్రాంతాలు నెల్లూరులోనే ఉన్నాయి. అయితే ఒంగోలుకు చుట్టూ ఉన్న ప్రాంతాలు తమను ప్రత్యేక జిల్లా కిందకు తీసుకురావాలని డిమాండ్లు చేశాయి. జిల్లా కేంద్రం చాలా దూరంలో ఉండటంతో తమకు పాలనా పరంగా అన్యాయం జరుగుతోందంటూ నాడు ప్రజలు ఆందోళనలు చేశారు. ఆ క్రమంలోనే నెల్లూరు, గుంటూరు, కర్నూలు జిల్లాల్లోని కొన్ని ప్రాంతాలను వేరు చేసి ప్రకాశం జిల్లాగా 1970లో ఏర్పాటు చేశారు. అప్పటినుంచి కందుకూరు ప్రాంతానికి ఒంగోలుతో మంచి అనుబంధం ఏర్పడింది. అయితే ఎక్కడైనా అభివృద్ధి చెందే కొద్దీ పరిపాలనను ప్రజలకు మరింత చేరువ చేస్తుంటారు. కానీ వైసీపీ ప్రభుత్వంలో మాత్రం అందుకు భిన్నంగా పాలన సాగింది. ఎప్పుడో 52 ఏళ్ల క్రితం నెల్లూరు నుంచి విడిపోయిన కందుకూరును మళ్లీ తిరిగి నెల్లూరులోకి తీసుకొచ్చారు. కందుకూరు నుంచి నెల్లూరుకు 120 కిలోమీటర్ల దూరం. అక్కడ నుంచి ప్రజలు పనులపై జిల్లా కేంద్రానికి రావాలంటే ఒక పూట పడుతోంది. రెండు, మూడు బస్సులు మారాల్సిన పరిస్థితి. అదే ఒంగోలుకు కేవలం 45 కిలోమీటర్లు మాత్రమే.



కుందుకూరు పట్టణం

పాలనా పరిస్థితులు

గూడూరు, కందుకూరు ప్రాంతాలు రెండు జిల్లాల కేంద్రాలకు సుదూర దూరంలో ఉన్నాయి. దీంతో జిల్లా అడ్మినిస్ట్రేషన్ పరంగా చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. జిల్లా స్థాయి అధికారులు ఆయా ప్రాంతాలపై ఎక్కువగా దృష్టి పెట్టలేకపోతున్నారు. నెల్లూరు నుంచి కందుకూరుకు అధికారులు వెళ్లిరావాలన్నా, అక్కడి నుంచి ఉద్యోగులు నెల్లూరుకు వచ్చి వెళ్లాలన్నా అవస్థలు పడుతున్నారు. 2022లో జిల్లాల విభజన సమయంలో గూడూరును నెల్లూరు జిల్లాలోనే కొనసాగించాలని అప్పటి కలెక్టర్ ప్రతిపాదించారు. కానీ ప్రభుత్వ స్థాయిలో ఈ ప్రతిపాదనను పరిగణలోకి తీసుకోలేదు. ఇప్పుడు కూడా అధికారులు, ఉద్యోగులు కందుకూరును ప్రకాశం జిల్లాలోకి మార్చి, గూడూరును నెల్లూరు జిల్లాలోకి తీసుకురావడం మంచి దన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.

- నెల్లూరు, ఆంధ్రజ్యోతి

గూడూరు ప్రాంతం

గూడూరు ప్రాంతం మొదటి నుంచీ నెల్లూరు జిల్లాలోనే భాగమై ఉంది. భౌగోళికంగా చూసుకున్నా, సంప్రదాయాల పరంగా చూసుకున్నా సారూప్యత ఒకేలా ఉంటుంది. నెల్లూరుకు 30 కిలోమీటర్ల దూరంలోనే ఉండే ప్రాంతం కావడంతో ఎక్కువగా నెల్లూరుతో సంబంధాలు ఉన్నాయి. మానవ, ఆర్థిక, వ్యాపార, రాజకీయ సంబంధాలు నెల్లూరు, గూడూరు మధ్య బలంగా ఉన్నాయి. ఇంతటి బలమైన సంబంధాలున్న ప్రాంతాన్ని అక్కడి ప్రజల మనోభావాలకు విరుద్ధంగా తిరుపతి జిల్లాలో కలిపారు. గూడూరు నుంచి తిరుపతికి సుమారు 100 కిలోమీటర్ల దూరం ఉంటుంది. ముఖ్యంగా కోట, వాకాడు ప్రాంతాల ప్రజలు తిరుపతికి వెళ్లాలంటే నానా అవస్థలు పడాలి. తమను తిరుపతిలో కలపొద్దని, నెల్లూరులోనే కొనసాగించాలంటూ మొదటి నుంచీ అక్కడి ప్రజలు కోరుతున్నారు. ఇప్పుడు కూడా అక్కడ ఆందోళనలు జరుగుతున్నాయి. గూడూరు డివిజన్ తిరుపతి జిల్లాలోకి వెళడంతో ఆ ప్రభావం పక్కన ఉండే సైదాపురం, రాపూరు, మనుబోలు మండలాలపై పడింది.



13న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి రాక

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ఈ నెల 13న జిల్లాలో పర్యటించనున్నారని పార్టీ జిల్లా అధ్యక్షుడు సీపారెడ్డి వంశీధర్‌రెడ్డి తెలిపారు. బీజేపీ జిల్లా కార్యాలయంలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఇటీవల ఎన్నికైన మాధవ్ అన్ని జిల్లాల్లో పర్యటిస్తున్నారని, ఈ క్రమంలో నెల్లూరుకు వస్తున్నట్లు చెప్పారు. 13వతేదీ ఉదయం వేదాయపాళెం సెంటర్‌లో చాయ్ పే చర్చ కార్యక్రమంలో పాల్గొంటారని, అనంతరం ఆత్మకూరు బస్టాండ్ వద్దనున్న అమరజీవి పొట్టిశ్రీరాములు విగ్రహానికి నివాళి అర్పిస్తారని తెలిపారు. వీఆర్సీ మైదానం నుంచి కస్తూర్బా కళాక్షేత్రం వరకు జరిగే ర్యాలీలో పాల్గొంటారని, ఆ తర్వాత జిల్లా విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశంలో పాల్గొని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేస్తారని వెల్లడించారు. మధ్యాహ్నం మీడియాతో చిట్‌చాట్ కార్యక్రమం నిర్వహించి సాయంత్రం 5 గంటలకు చిన్నబజార్‌లో స్వర్ణకారులతో సమావేశం అవుతారని తెలిపారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడి పర్యటనను నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని కోరారు.

మార్గదర్శి, బంగారు కుటుంబాల ఎంపిక వేగవంతం

సీఎస్‌తో కలెక్టర్ ఆనంద్

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పీ-4 కార్యక్రమం ద్వారా మార్గదర్శి, బంగారు కుటుంబాలను ఎంపిక చేసేందుకు చర్యలు వేగవంతం చేశామని కలెక్టర్ ఆనంద్ తెలిపారు. గురువారం అమరావతి సచివాలయం నుంచి స్వర్ణాంధ్ర పీ-4పై ప్రభుత్వ ప్రధాన కార్య దర్శి విజయానంద్ జిల్లా కలె క్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించా రు. నెల్లూరులోని కలెక్టరేట్ శంకరన్ హాలు నుంచి కలెక్టర్ ఆనంద్ పాల్గొన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 18,870 బంగారు కుటుంబాలు, సుమారు 5వేల మార్గదర్శులను ఎంపిక చేసినట్లు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 30వేల బంగారు కుటుంబాలను ఎంపిక చేయటమే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కార్తీక్ కూడా పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్, పక్కన జేసీ కార్తీక్

ఉత్సాహంగా జిల్లాస్థాయి క్రీడాపోటీలు

నెల్లూరు(విద్య), ఆగస్టు 7 (ఆంధ్ర జ్యోతి) : జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో గురువారం జిల్లాస్థాయి క్రీడాపోటీలు ప్రారంభమయ్యాయి. జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో అథ్లెటిక్స్, ఆర్చరీ, వెయిట్ లిఫ్టింగ్, బాక్సింగ్, కబడ్డీ పోటీలు నిర్వహించారు. బాల, బాలికలు ఉత్సా హంగా పాల్గొన్నారు. ఈ పోటీలను ప్రారంభించిన డీఎస్‌డీవో యతిరాజ్ మాట్లాడుతూ నాలుగు రోజులు జరిగే ఈ పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులను జోనల్ పోటీలకు, అక్కడ విజయం సాధించిన వారిని రాష్ట్ర పోటీలకు పంపిస్తామని చెప్పారు.



బాక్సింగ్ పోటీలను ప్రారంభిస్తున్న డీఎస్‌డీవో యతిరాజ్

రూ.10.25 కోట్లతో బిలకూట క్షేత్రం అభివృద్ధి

బిట్రగుంట, ఆగస్టు 7 (ఆంధ్ర జ్యోతి): బోగోలు మండలం కొండ బిట్రగుంట ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో రూ.10.25 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి తెలిపారు. గురువారం ఆయన నిలిచిపోయిన శ్రీవారి పుష్కరిణి పనులను పరిశీలించారు. అనంతరం కోనేటికి చుట్టూ రక్షణ వలయం, ఆలయ మహాప్రాకార నిర్మాణంపై ఈవో రాధాకృష్ణ, విశ్రాంతి ఇంజనీరు గోపీకృష్ణతో చర్చించారు. ఆలయా నికి దక్షిణ దిక్కున వేదపాఠశాల నిర్మాణానికి సంబంధిం చిన స్థలాన్ని కూడా పరిశీలిం చారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. కోనేటి పనులను ఎంపీ వేమిరెడ్డి దంపతులు రూ.2 కోట్ల సొంత నిధులతో చేపట్టనున్నట్లు చెప్పారు. స్వామి, అమ్మవార్లను దర్శించేం దుకు వచ్చే ప్రముఖు లు విశ్రాంతి తీసుకునేం దుకుగాను అతిథి గృహాల నిర్మాణానికి దేవదాయశాఖ ఆనం రామనారాయణరెడ్డి రూ. 2 కోట్లు విడుదల చేయించారని తెలిపారు. దక్షిణ గాలిగోపుర నిర్మాణానికి రూ. 2.65 కోట్లను టీటీడీ మం జూరు చేయగా, త్వరలో టెండర్లు పిలువను న్నట్లు వివరించారు. మండలానికి చెందిన ప్రవాస భారతీయులు బచ్చు కృష్ణకుమార్- సంధ్య దంపతులు రెండు కోట్లతో పడమర గాలిగోపుర నిర్మాణం చేసేందుకు ముందుకు వచ్చారని చెప్పారు. ఈ నెల 10న నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి చేతుల మీదుగా పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయను న్నట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ బీద రవిచంద్ర తదితరులు హాజరు కానున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు ఎం.నాగేశ్వరరావు, కే.మధు బాబు, ఆర్.విజయ్‌కుమార్, సీహెచ్.వెంకటే శ్వర్లు కే.వెంకటేశ్వర్ల రెడ్డి, రంగయ్య, మహేష్ రెడ్డి, సుధీర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



శ్రీవారి ఆలయ మహాప్రాకారంపై మాట్లాడుతున్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి

చేనేత రంగానికి ప్రత్యేక స్థానం

- కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం
- డీఆర్వో హుస్సేన్ సాహెబ్

నెల్లూరు(వ్యవసాయం), ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): దేశంలో చేనేత రంగానికి ప్రత్యేక స్థానం ఉందని జిల్లా రెవెన్యూ అధికారి(డీఆర్వో) హుస్సేన్ సాహెబ్ అన్నారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని గురువారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ మన చేనేతలు తయారుచేసిన వస్త్రాలు దేశవిదేశాల్లో ఖ్యాతిని గడించాయని చెప్పారు. అయితే ప్రాశ్చాత్య వస్తువుల మోజులో పడి మన దేశ సంపదను మర్చిపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. చేనేత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యమిస్తోందని చెప్పారు. ప్రతిఒక్కరూ చేనేత వస్త్రాలు ధరించడం, చేతన కళను బతికించుకోవడం ఒక బాధ్యతగా భావించాలని పిలుపుని చ్చారు. ఈ కార్యక్రమానికి ముందు కలెక్టరేట్ ప్రాంగణంలో చేనేత వస్త్రాల ప్రదర్శనను డీఆర్వో ప్రారంభించారు. చేనేత, జౌళిశాఖ ఏడీ శ్రీనివాసరెడ్డి, జిల్లా పరిశ్రమలశాఖ అధికారి మారుతీ ప్రసాద్, ఎల్‌డీఎం మణిశేఖర్, డీసీవో గుర్రప్ప, రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ సుధాకర్, చేనేత కార్మిక సంఘాల నాయకులు బుధవరపు బాలాజీ, కడిమి వెంకట శేషయ్య, సజ్జా వెంకట సురేష్, పముజుల శంకరయ్య తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా పలువురు చేనేత కార్మికులు, కార్మిక సంఘాల నాయకులను సన్మానించారు.



కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన చేనేత వస్త్రాల ప్రదర్శనను తిలకిస్తున్న డీఆర్వో హుస్సేన్‌సాహెబ్, పక్కన చేనేత సంఘాల నాయకులు

ఐఆర్ ప్రకటించాలి

నెల్లూరు(విద్య) : ప్రభుత్వం పీఆర్సీ కమిటీని వేసి ఐఆర్‌ను ప్రకటించాలని బీటీఏ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు వేణుగోపాల్ కోరారు. నెల్లూరులోని పలు పాఠశాలల్లో గురువారం బీటీఏ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఉపాధ్యాయ, ఉద్యోగులకు ఇచ్చిన హామీ ప్రకారం వెంటనే పీఆర్సీని అమలు చేయాలని, బకాయిలకు నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సంఘం జిల్లా కార్యదర్శి మాస ప్రసాద్ మాట్లాడుతూ ఉపాధ్యా యులకు ఓపీఎస్ అమలు చేయాలన్నారు. సమస్యలపై త్వరలో సంఘాల న్నీ కలిపి ఉమ్మడి పోరాటాలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి ఆదినారాయణ, నాయకులు చెన్న కేశవులు, సంపత్‌కుమా ర్, రాజశేఖర్, సుజాత, రాంబాబు, మహేంద్ర పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల వినియోగం ప్రాణాంతకం : సీఐ

ఆత్మకూరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : మాదక ద్రవ్యాల వినియోగం ప్రాణాం తకం అని, యువత వీటి జోలికి వెళ్లకుండా ఉజ్వల భవితకు బాటలు వేసు కోవాలని ఆత్మకూరు సీఐ జి గంగాధర్ సూచించారు. స్థానిక ఆంధ్ర ఇంజనీరింగ్ కాలేజీలో గురువారం మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శివకృష్ణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9685
వెండి కిలో ధర	రూ. 118200
వెండి ఒక గ్రాము	రూ. 121.20

నిబంధనలకు విరుద్ధంగా చేపల చెరువుల సాగు

● అనుమతులు లేకుండా వాగు నీటి వినియోగం ● పశువులకు నీరు దొరక్క పాడిరైతుల అవస్థలు ● పట్టించుకోని అధికారులు

అనంతసాగరం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాతదేవరాయపల్లి వద్ద వాగు వెంబడి నిబంధనలకు విరుద్ధంగా చేపల చెరువులు సాగుచేస్తూ అనుమతులు లేకుండా వాగు నీటిని వాడుకుంటున్నా అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇనగలూరు నుంచి ఆత్మకూరు పరిధిలోని బట్టేపాడు వరకు ఈవాగు విస్తరించి ఉంది. అక్రమంగా వాగులోకి మోటార్లు ఏర్పాటుచేసి చేపల గుంటలకు నీరు తోడేస్తున్నారు. దీంతో పశువులకు నీరు దొరక్క ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. అధికారులు స్పందించి వాగులో అక్రమంగా నీటి వాడకం, నిబంధనలకు విరుద్ధంగా సాగు చేస్తున్న చేపల గుంటల యజమానులపై చర్యలు తీసుకోవాలని పాడిరైతులు కోరుతున్నారు.


పీడీపల్లి వద్ద వాగుజలాలతో సాగుచేస్తున్న చేపల గుంట



అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీల భర్తీకి చర్యలు

● పి. సునీలత, సీడీపీవో

ఆత్మకూరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటున్నామని సీడీపీవో పి సునీలత తెలిపారు.

? ఏఏ అంగన్‌వాడీ కేంద్రాల్లో పోస్టులు ఖాళీ ఉన్నాయి.

! ఏఎస్‌పేట మండలంలోని కాకర్ల పాడు, వందిపాడు, చేజర్ల మండలంలోని పాడేరు, నాగులవెల్లటూరు కేంద్రాల్లో అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఆత్మకూరు మండలంలోని బి చిరువెళ్ల (మెయిన్), నాగులపాడు, వాశిలి (ఎస్టీ), మున్సిపాల్టీ పరిధిలోని జ్యోతినగర్, పేరారెడ్డిపల్లి, వందూరుగుంట-2, ఏఎస్‌పేట మండలంలోని అనుమసముద్రం-1, హసనాపురం, శ్రీకొలను-2, అక్బరాబాద్, సంగం మండలంలోని వంగల్లు(మెయిన్), వీర్లగుడిపాడు, సంగం బండారుమిట్ట, తరుణవాయి (బీసీ), మర్రిపాడు-2, చేజర్ల మండలంలోని గొల్లపల్లి-2 అంగన్‌వాడీ కేంద్రాల్లో హెల్పర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

? అర్హతలు ఏమిటి.

! అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. 21 సంవత్సరాలు నిండి 35 సంవత్సరాల లోపు ఉన్న స్థానిక వివాహిత మహిళలు అయి ఉండాలి. 10వ తరగతి ఉత్తీర్ణులైన వారు లేనట్లయితే 8వ తరగతి వారు అర్హులు. పూర్తి వివరాలకు సీడీపీవో కార్యాలయంలో సంప్రదించవచ్చు.

? ఎప్పటిలోగా దరఖాస్తు చేసుకోవచ్చు.

! ఈనెల 5 నుంచి 26వ తేదీ సాయంత్రంలోపు ఆత్మకూరులోని సీడీపీవో, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చు.

న్యూస్ బాక్స్

రవీంద్రనాథ్ ఠాగూర్‌కు ఘన నివాళి


రవీంద్రనాథ్ ఠాగూర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

మర్రిపాడు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక గ్రంథాలయంలో గురువారం రవీంద్రనాథ్ ఠాగూరు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి నారాయణరావు, టీడీపీ నాయకులు మద్దిపాటి శ్రీనివాసులు నాయుడు, వెంకటేశ్వర్లు, రాములు పాల్గొన్నారు.

ఘనంగా బీపీ మండల్ జయంతి వేడుకలు

ఆత్మకూరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వైఈపీప కార్యాలయంలో గురువారం బిపి మండల్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా యాదవ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గుర్రం నాగేశ్వరరావు యాదవ్ మాట్లాడుతూ బిపి మండల్ కృషి వలన కేంద్ర, రాష్ట్ర ఉద్యోగాల్లో బీసీలకు 27 శాతం రిజర్వేషన్లు కల్పించ బడ్డాయని తెలిపారు. ఈకార్యక్రమంలో వైఈపీప యూత్ ప్రెసిడెంట్ కటారి సుధాకర్ యాదవ్, డివిజన్ అధ్యక్షుడు దేవరాల వెంకటరమణ యాదవ్, జిల్లా కార్యదర్శి గాలిబోయిన అయ్యన్నయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన

వింజమూరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): గ్రామంలో ఆయిల్ పామ్ మెగా ప్లాంటేషన్ డ్రైవ్ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమం ఈనెల 15వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. స్థానిక కొంకల రామచంద్రారెడ్డి పొలంలో నిర్వహించిన కార్యక్రమానికి జిల్లా ఉద్యాన అధికారి ఎంవీ సుబ్బారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ గణపం బాలకృష్ణారెడ్డి, సర్పంచ్ నల్లగొండ సృజన, ఎంపీఓ వాసు, ఉదయగిరి ఉద్యాన అధికారి జయశ్రీ, కంపెనీ ఏజీఎం సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాల ప్రారంభం


పెన్నానది జలాల కోసం బయలుదేరిన గ్రామస్థులు

సంగం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెరమనలో నూతనంగా నిర్మించిన అన్నపూర్ణాదేవి సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో గురువారం నుంచి విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా ఆలయంలో ప్రతిష్ఠా సంకల్పం, పుణ్యాహవచనం, గణపతి పూజ, రక్షాబంధనం తదితర పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలు మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ పెన్నానది జలాలు తీసుకు వచ్చారు. భక్తులు పూజల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

దుర్వ్యసనాలకు విద్యార్థులు దూరంగా ఉండాలి : సీఐ



సదస్సులో మాట్లాడుతున్న సీఐ వేమారెడ్డి

సంగం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు దుర్వ్యసనాలకు దూరంగా ఉండాలని సీఐ వేమారెడ్డి సూచించారు. గురువారం ఆయన స్థానిక నేతాజీ జూనియర్ కళాశాల విద్యార్థులకు డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే నష్టాలను వివరించారు. వాహనాలు నడిపేటప్పుడు సెల్‌ఫోన్ మాట్లాడడం, అతివేగంగా నడపడం ప్రమాదకరమన్నారు. కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రాజేష్, కళాశాల ప్రిన్సిపాల్, కరస్పాండెంట్ మదార్‌భాష, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు బ్యాటరీ ట్రైసైకిళ్ల పంపిణీ


బ్యాటరీ ట్రైసైకిల్‌ను అందిస్తున్న జనసేన నాయకులు

ఏఎస్ పేట, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): విపిఆర్ ఫౌండేషన్ సహకారంతో జనసేన పార్టీ నాయకుల ఆధ్వర్యంలో గురువారం ఏఎస్ పేట, అనుసముద్రం గ్రామాల్లోని ముగ్గురు దివ్యాంగులకు బ్యాటరీ ట్రై ట్రైసైకిళ్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండల అధ్యక్షుడు సయ్యద్ అక్బర్, నియోజకవర్గ యువత అధ్యక్షుడు దాడి భానుకిరణ్, ఆత్మకూరు రూరల్ అధ్యక్షుడు ప్రతిపాటి ప్రవీణ్, నాయకులు వంశీ, ఫిరోజ్‌బాషా, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

క్విజ్ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

ఉదయగిరి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక మేకపాటి రాజమోహన్‌రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన షేక్ మహ్మద్‌జావీద్ అనే విద్యార్థి జోనల్ స్థాయిలో నిర్వహించిన క్విజ్ పోటీల్లో ప్రతిభ చాటాడు. ఈనెల 11న జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. దీంతో గురువారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎల్ నారాయణస్వామి, వైస్ ప్రిన్సిపాల్, అధ్యాపకులు విక్రమ్, వెంకటేష్‌లు మహ్మద్‌జావీద్‌ను అభినందించి బహుమతి అందచేశారు.

చెట్టుపై మమకారం


ఉదయగిరి పోలీస్‌స్టేషన్ ఆవరణలో నిర్మాణాల మధ్య ఉన్న టేకు చెట్టు

ఉదయగిరి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ఒక మొక్క మానుగా మారాలంటే సంవత్సరాలు పడుతుంది. నరికేయాలంటే నిమిషాల వ్యవధి చాలు. పర్యావరణానికి పచ్చని చెట్లు చేసే మేలు తెలిసిన వారెవ్వరూ నరకరు. కాపాడేందుకు ప్రయత్నిస్తారు. అందుకు ఉదాహరణగా ఉదయగిరి పోలీసు అధికారులు నిలిచారు. పోలీస్‌స్టేషన్ ఆవరణలో 15 ఏళ్ల కిందట నాటిన టేకు మొక్క ప్రస్తుతం మానైంది. ఇటీవల అధికారులు స్టేషన్‌లో ఆధునికీకరణ పనులు చేపట్టారు. గదుల నిర్మాణానికి ఆ మాను అడ్డుగా ఉన్నా దానిని తొలగించకుండా అలాగే గది, షెడ్ నిర్మాణాన్ని చేపట్టారు. దీంతో మానుపై తమకున్న మమకారాన్ని చాటుకున్నారు.

రొయ్యకు శోకం

(5వ పేజీ తరువాయి) ఎగుమతి సంస్థ బీఎంఆర్ సంస్థ ఛైర్మన్, రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు మంత్రులు, అధికారుల బృందాలతో సంక్షోభం నుంచి బయటపడే మార్గాలను అన్వేషిస్తున్నారు. భవిష్యత్తులో ఎదురయ్యే ఇలాంటి విపత్తులను శాశ్వతంగా ఎదుర్కొనే దిశగా స్థానిక మార్కెట్‌ను వృద్ధి చేసుకోవాలని ప్రాథమికంగా నిర్ణయం జరిగింది. దేశంలో స్థానికంగా రొయ్యల వినియోగం చాలా తక్కువగా ఉంది. లక్ష టన్నుల దిగుబడి వస్తే దేశం లోపల 10వేల టన్నులు కూడా తినడం లేదు. స్థానిక వినియోగం పెరిగేలా చేయడానికి అవసరమైన చర్యలకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

వైభవంగా మహా కుంభాభిషేక మహోత్సవం


అలఘునాథుడి ఆలయంలో ప్రత్యేక పూజలో పాల్గొన్న ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దంపతులు, తదితరులు

ఆత్మకూరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీదేవి భూదేవి సమేత అలఘునాథస్వామి ఆలయంలో పుష్కర మహోత్సవ మహా కుంభాభిషేకం గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆయన సతీమణి కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, నిత్యాన్నదాత కంచి పరమేశ్వరరెడ్డి తదితరులు స్వామి వారి శిఖరంపై ఏర్పాటుచేసిన కలిశంపై భక్తులతో కలిసి గంగాజలంతో అభిషేకించారు. అనంతరం అలఘునాథస్వామికి మహా కుంభాభిషేకం నిర్వహించి దివ్య కల్యాణ మహోత్సవం నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు నిత్యాన్నదాత కంచి పరమేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ గావించారు. సాయంత్రం దేవేరుల గ్రామోత్సవం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కాటంరెడ్డి రవీంద్రారెడ్డి దంపతులు, వేద పండితులు కంభాలూరు మధుసూదనశర్మ, ఇనుపకుతిక నాగభూషణం, ఆలయ అర్చకులు విశ్వనాథం శ్రీనివాసశర్మ, ఆలయ కమిటీ నిర్వాహకులు కెవి శేషారెడ్డి, కుడుముల సుధాకర్‌రెడ్డి, వందిపాటి సుధాకర్ రెడ్డి, జిల్లా విశ్వహిందూ పరిషత్ జిల్లా ఉపాధ్యక్షుడు సోమవరపు యానాదిరెడ్డి, పలువురు పట్టణ ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు.

వీఆర్‌ఏలకు పేస్కేల్ అమలు చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు లచ్చయ్య

ఉదయగిరి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): గ్రామ రెవెన్యూ సహాయకులకు పేస్కేల్ అమలుచేయాలని వీఆర్‌ఏల సంఘం జిల్లా అధ్యక్షుడు లచ్చయ్య డిమాండ్ చేశారు. గురువారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో మండలంలోని వీఆర్‌ఏలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన వీఆర్‌ఏలకు వీఆర్వోలుగా పదోన్నతి కల్పించడంతోపాటు నామినీలను వీఆర్‌ఏలుగా గుర్తించాలన్నారు. కార్యాలయంలో అదనపు డ్యూటీలను రద్దు చేయాలన్నారు. అనంతరం మండల నూతన కమిటీని ఎంపికచేశారు. మండల గౌరవాధ్యక్షుడిగా రాచూరి దుర్గయ్య, అధ్యక్షుడిగా షేక్ ఫరీద్, ఉపాధ్యక్షుడిగా షేక్ హజరత్, ప్రధాన కార్యదర్శిగా హుస్సేన్‌బాషా, కోశాధికారిగా వెంగయ్యను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు నారాయణ, బాలు, ప్రధాన కార్యదర్శి ఓబులేసు, వీఆర్‌ఏలు తదితరులు పాల్గొన్నారు.

అదనపు తరగతి గదుల నిర్మాణ పనుల పరిశీలన


సిబ్బందికి సూచనలిస్తున్న సమగ్ర శిక్ష ఏపీసీ వెంకటసుబ్బయ్య

ఉదయగిరి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను గురువారం సమగ్ర శిక్ష జిల్లా అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ పీ వెంకటసుబ్బయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఉన్న త పాఠశాలను ఆగస్టు 15న నూతన భవనాల్లోకి మార్చడంతోపాటు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు సైతం అక్కడే నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అందులో భాగంగా అదనపు తరగతి గదుల పనులు 13వ తేదీ నాటికి పూర్తయ్యేలా చర్యలు చేపడుతున్నామన్నారు. విద్యార్థి మిత్ర కిట్లకు సంబంధించి విద్యార్థుల బయోమెట్రిక్ అథెంటిఫికేషన్ నూరు శాతం పూర్తిచేయాలన్నారు. కిట్లు అవసరమైన వారు తెలియచేయాలన్నారు. అనంతరం సిబ్బందికి తగు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఈవో-2 తోట శ్రీనివాసులు, సీఆర్‌ఎంటీలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉరుములు, మెరుపులతో వర్షబీభత్సం

● రోడ్లు జలమయం


ఉదయగిరిలో రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపు నీరు

ఉదయగిరి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి, వరికుంటపాడు మండలాల్లోని పలు గ్రామాల్లో గురువారం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. మధ్యాహ్నం వరకు ఎండ వేడిమి ప్రతాపం చూపించినప్పటికీ ఆపై ఆకాశంలో కమ్ముకున్న మేఘాలతో ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. వర్షానికి తోడు ఉరుములు, మెరుపులు బీభత్సం సృష్టించడంతో ప్రజలు బెంబేలెత్తిపోయారు. మెట్ట పంటలకు వర్షం సానుకూలంగా మారుతుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా పలు గ్రామాల్లో రహదారులు, నివాసాల సముదాయాల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో రాకపోకలు సాగించే ప్రజలు, వాహనదారులు ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వచ్చింది.

దూప దీప నైవేద్యానికి భావనాబుషి ఆలయం ఎంపిక


దూపదీప నైవేద్యం పథకం కింద మంజూరైన నగదును పూజారికి అందచేస్తున్న టీడీపీ నాయకులు

సంగం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తలుపూరుపాడులో ఉన్న భావనాబుషి ఆలయం దేవదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి కృషితో దూపదీప నైవేద్యం పథకానికి ఎంపికైంది. ఈ పథకం కింద ఆలయ పూజారికి ప్రతినెలా రూ. 10వేల ఆర్థిక సాయం అందుతుంది. అందులో భాగంగా మంజూరైన నగదును స్థానిక టీడీపీ నాయకులు ఖాదర్ బాష, షేక్ బాబులు మంత్రి తరపున పూజారి పెంచలయ్యకు ఉత్తర్వుల కాపీని అందచేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.

సూర్య ఘర్ పథకంపై అవగాహన సదస్సు

ఆత్మకూరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అర్బన్ ప్రభుత్వ వైద్యశాల ఆవరణలో గురువారం విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో సూర్య ఘర్ పథకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్‌శాఖ డీఈఈ భానునాయక్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సూర్య ఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్‌శాఖ ఏడీఈ చిన్నస్వామినాయక్, పట్టణ ఏఈ జమీలాబేగం తదితరులు పాల్గొన్నారు.

C.R.I.M.E N.E.W.S

రైలు పట్టాల వద్ద గుర్తుతెలియని మృతదేహం


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

బిట్రగుంట, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): బిట్రగుంట రైల్వే సెక్షన్ పరిధిలోని తలమంచి- అల్లూరురోడ్డు స్టేషన్ల మధ్య 201/6-8 కిలోమీటర్ల వద్ద గుర్తుతెలియని పురుష (40) మృతదేహాన్ని గురువారం గుర్తించినట్లు కావలి జీఆర్పీ పోలీసులు తెలిపారు. మృతదేహం పడిఉన్న స్థితిని బట్టి గుర్తు తెలియని రైలులో నుంచి ప్రమాదవశాత్తు జారిపడి మృతిచెంది ఉంటాడని భావిస్తున్నా మన్నారు. బులుగు తెలుపు రంగుల చెక్స్ డిజైన్‌తో పూర్తిచేతుల చొక్కా, నలుపురంగు షార్ట్ ధరించి ఉన్నాడని వారు తెలిపారు. కుడిచేతిపై లవ్ సింబల్‌తో కూడిన టాటూ మార్కు ఉందన్నారు. అందులో ఐలవ్‌యూ అనే టాటూ ఉందని పేర్కొన్నారు. మృత దేహాన్ని కావలి ఏరియా వైద్యశాలకు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వరరావు తెలిపారు.

రెండు బైకులు ఢీకొని ఇద్దరికి తీవ్రగాయాలు


సంఘటనా స్థలంలో క్షతగాత్రుల వివరాలు తెలుసుకుంటున్న పోలీసులు

కావలి రూరల్ ఆగస్టు7(ఆంధ్రజ్యోతి): రెండు మోటారు బైకులు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు.ఈ సంఘటన కావలి ముసునూరు ట్రంక్‌రోడ్డులో బుధవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. రూరల్ పోలీసుల కథనం మేరకు, ఉలవపాడు మండలం కరేడుకు చెందిన తిరువీధి దినేష్‌కుమార్ ముసునూరు నుంచి మోటారు బైకుపై కావలికి వస్తున్నాడు. అలాగే ముసునూరుకి చెందిన పామంజి రఘువర్మ కావలి నుంచి ముసునూరు వెళ్తుండగా మార్గమధ్యంలో రెండు మోటారు బైకులు ఢీకొన్నాయి. ఈప్రమాదంలో తీవ్రంగా గాయపడినవారిని 108 వాహనంలో కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకి తరలించారు. ఈ మేరకు రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బోల్తాపడిన వ్యాన్‌ను ఢీకొన్న లారీ

● డ్రైవర్‌కు స్వల్ప గాయాలు


బోల్తాపడిన మినీ వ్యాను, లారీ

సంగం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): బోల్తాపడిన వ్యాన్‌ను లారీ ఢీకొనడంతో లారీ డ్రైవర్‌కు స్వల్ప గాయాలైన సంఘటన మండల పరిధిలోని ముంబాయి జాతీయ రహదారిపై పెరమన సమీపంలో గురువారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. నెల్లూరు నుంచి కిరాణా సరుకులు వేసుకుని మర్రిపాడుకు వెళ్తున్న మినీవ్యాన్ మార్గమధ్యంలో సంగం దాటిన తరువాత పెరమన క్రాస్ రోడ్డు సమీపంలో టైర్ పంచరై బోల్తా పడింది. ఇదే సమయంలో ఉదయగిరి నుంచి నెల్లూరు వైపు వేగంగా వెళ్తున్న లారీ బోల్తాపడిన మినీ వ్యాన్‌ను ఢీకొని రోడ్డు పక్కన ముళ్లపొదల్లోకి దూసుకుపోయింది. దీంతో లారీ డ్రైవర్ సంగప్పకు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఏటి పోరంబోకు ఆక్రమణకు యత్నం

● ఇరువర్గాల తోపులాట

● మహిళ ఆత్మహత్యాయత్నం

చేజర్ల, ఆగస్టు7 (ఆంధ్రజ్యోతి) : ఏటి పోరంబోకు కోసం ఇరువర్గాలు ఘర్షణ పడిన సంఘటన మండలంలోని మడిపల్లి గ్రామంలో గురువారం జరిగింది. మడపల్లిలోని సర్వే నెం.1255లో పెన్నానది పోరంబోకు భూమికి సంబంధించి అదే గ్రామానికి చెందిన వసంతమ్మ, చలమల సుబ్బారెడ్డి మధ్య కొంత కాలంగా వివాదం నడుస్తోంది. గత నెలలో అధికారులకు పరస్పరం ఫిర్యాదు చేసుకోగా, ఒక వర్గం కోర్టుకు కూడా వెళ్లింది. కోర్టు ఆదేశాల మేరకు ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు వివాదంలో ఉన్న భూమిలో ఎవరూ ప్రవేశించరాదని బోర్డులు ఏర్పాటు చేశారు. అయితే గురువారం ఆ భూమిని ఆక్రమించుకునేందుకు ఇరువర్గాలు ప్రయత్నించగా, తోపులాటల జరిగాయి. దీంతో వసంతమ్మ సమీపంలో ఉన్న పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. వెంటనే ఆమెను ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ ఘటనపై తహసీల్దారు మురళి మాట్లాడుతూ కోర్టు ఆదేశాలతో గత నెలలోనే వివాదాస్పద భూమిలో బోర్డులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అయితే, గురువారం జరిగిన ఘటన తనకు తెలియదని అన్నారు.

పిడుగుపాటుకు నాలుగు మేకల మృతి


మృతి చెందిన మేకలు

ఉదయగిరి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్లపడియ గ్రామ ఎస్సీ కాలనీలో పిడుగుపాటుకు గురై నాలుగు మేకలు మృతిచెందగా, రెండు మేకలు తీవ్ర అస్వస్థతకు గురైన సంఘటన గురువారం రాత్రి చోటుచేసుకొంది. వివరాల మేరకు.. కాలనీకి చెందిన ఇత్తడి ఆశీర్వాదం తన మేకలను మేత కోసం అడవికి తోలుకెళ్లి ఇంటికొచ్చాడు. ఉరుములు, మెరుపులు కూడిన వర్షం కురసింది. ఆ సమయంలో ఇంటి ఆరుబయట ఉన్న మేకలపై ఒక్కసారిగా పిడుగుపడడంతో నాలుగు మేకలు మృతిచెందగా, రెండు మేకలు తీవ్ర అస్వస్థతకు గురయ్యాయి. మేకలే జీవనాధారంగా జీవిస్తున్న తనకు అవి మృతిచెందడంతో సుమారు రూ.50 వేలు నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	102
స్కిన్ చికెన్	190
స్కిన్‌లెస్	212

కోడిగుడ్ల ధర (100): 490

నాణ్యమైన ఉత్పత్తులను వినియోగించండి

అల్లూరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): పాల ఉత్పత్తుల్లో నాణ్యమైన వాటిని ఎంచుకొని వినియోగించుకోవాలని విజయ డెయిరీ ఛైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి అన్నారు. పట్టణ పరిధిలో విజయ డెయిరీ ఉత్పత్తుల కేంద్రాన్ని ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ సంస్థ అయిన విజయ డెయిరీలో తయారయ్యే పాల ఉత్పత్తులు సహజంగా ఉంటాయని, వాటిని వినియోగిస్తే ఎలాంటి ఆరోగ్య సమస్యలు ఉండవని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎండీ కృష్ణమోహన్, డైరెక్టర్ ఎస్.దశరథరామిరెడ్డి, సిబ్బంది పఠాన్ అబ్దుల్, శ్రీహరి ఈశ్వరయ్య, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



డెయిరీ ప్రారంభోత్సవంలో ఛైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి

న్యూస్ బాక్స్

సెప్టెంబరు నాటికి అమృత్ పథకం పూర్తి

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): సెప్టెంబరు నాటికి కావలిలో అమృత్ పథకం పూర్తవుతుందని కేంద్రగృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వశాఖ సహాయ మంత్రి తోఖాన్‌సాహు చెప్పారు. గురువారం లోక్‌సభలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఏపీలో అమృత పథరాల అమలుపై అడిగిన ప్రశ్నకు ఆయన సమాధాన ఇచ్చారు. కావలిలో రెండు అమృత్ పథక ప్రాజెక్టులు అమలులో ఉన్నాయని, ఈ ఏడాది సెప్టెంబరు నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు మంత్రి వివరించారు.

నేడు సీఎం చిత్రపటానికి పాలభిషేకం

కావలి, ఆగస్టు7(ఆంధ్రజ్యోతి): సెలూన్లకు ఉచిత విద్యుత్‌ను 150 నుంచి 200 యూనిట్లకు పెంచటం హర్షణీయమని నాయీ బ్రాహ్మణ సేవాసంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పుటూరి బాలగురుస్వామి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా నాయీ బ్రాహ్మణులు సీఎంకు కృతజ్ఞత తెలుపుతూ శుక్రవారం సీఎం చిత్రపటానికి పాలభిషేకం చేయాలని ఆయన పిలుపు నిచ్చారు.

169 పొగాకు బేళ్ల తిరస్కరణ

కలిగిరి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): స్థానిక పొగాకు వేలం కేంద్రానికి గురువారం రైతులు మొత్తం 396పొగాకు బేళ్లు అమ్మకానికి తీసుకువచ్చారు. వేలంలో 11కంపెనీ ప్రతినిధులు పాల్గొని 227బేళ్లు కొనుగోలు చేశారు. నోబిడ్-150, సీఆర్-10, జంపింగ్‌లాట్స్-9 కారణాలతో 169బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.150, సగటు ధర రూ.206.18గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి శివకుమార్ తెలిపారు.

ఆహార పదార్థాల తనిఖీలు చేపట్టాలి

కావలి(టౌన్),ఆగస్టు7(ఆంధ్రజ్యోతి) ఆహార పదార్థాలను తనిఖీ చేయాలని జిల్లా ఎస్సీఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు ఐ. సాయిప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. రోజురోజుకు ఆహార పదార్థాలుగా నాసిరకంగా, కల్తీమయం అవుతున్నాయన్నారు. అంతేకాక నాణ్యత కొరవడి ప్రజల ఆరోగ్యం దెబ్బతింటుందన్నారు. ఫుడ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ల పర్యవేక్షణ కొరవడిందని, తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవాలన్నారు. తనిఖీలు నిర్వహించినప్పుడే విక్రయదారులు నాణ్యతా, ప్రమాణాలు, శుభ్రత పాటిస్తారని ఆయన పేర్కొన్నారు. వినియోగదారులు హక్కులు తెలుసుకుని వాటిని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

బీసీ హాస్టల్‌లో ఫ్రెషర్స్ డే వేడుకలు



హాస్టల్ విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేస్తున్న సహాయ సంక్షేమాధికారి షేక్ జబ్బార్

వలేటివారిపాలెం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక బీసీ హాస్టల్‌లో గురువారం సాయంత్రం వెల్ఫేర్ ఆఫీసర్ మాల్యాద్రి అధ్యక్షతన ఫ్రెషర్స్‌డే వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డివిజన్ బీసీ సహాయ సంక్షేమాధికారి షేక్ జబ్బార్ మాట్లాడుతూ సీనియర్ విద్యార్థులు కొత్తగా చేరే విద్యార్థులకు తోడునీడగా ఉండాలన్నారు. అనంతరం సావిత్రి సోలార్ కంపెనీ ప్రతినిధులు విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వార్డెన్ మాల్యాద్రి, ట్యూటర్ దాసరి తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు

సూపర్‌సిక్స్ పథకాల పేరిట మోసం

వలేటివారిపాలెం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు సూపర్‌సిక్స్ పథకాల పేరిట అధికారంలోకి వచ్చి ఏడాదైనా ఏ ఒక్క పథకం కూడా పూర్తిస్థాయిలో అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారని మండల వైసీపీ అధ్యక్షుడు అనుమోల లక్ష్మీనరసింహం విమర్శించారు. మండలంలోని చుండిలో బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా వైసీపీ నాయకులు ఇంటింటికి వెళ్లి సూపర్‌సిక్స్ పథకాల క్యూఆర్ కోడ్‌స్కాన్‌తో కూడిన కరపత్రాలను చూపిస్తూ వివరించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు గుత్తా గోపి పొట్టేళ్ల క్రిష్ణయ్య, ఇరపని సతీష్, ఇరపని అంజయ్య, కామినేని నరసింహం, చప్పిడి రాధాకృష్ణ పాల్గొన్నారు.

కేజీబీవీలో వేగంగా నిర్మాణ పనులు

● త్వరలోనే తీరనున్న తరగతి గదుల సమస్య ● అందుబాటులోకి రానున్న డార్మెంటరీ



కేజీబీవీలో జరుగుతున్న డార్మెంటరీ, అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు

లింగసముద్రం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): గ్రామ పరిధిలోని జంపాలవారిపాలెం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ) ప్రాంగణంలో డార్మెంటరీ, అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. సమగ్రశిక్ష నిధులు సుమారు రూ.1.25 కోట్లతో రెండునెలల కిందట అధికారులు ఈ పనులను ప్రారంభించారు.ప్రస్తుతం పిల్లర్లు వేసి, ఫ్లింత్ బీమ్ వేసేందుకు గోడ నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా సమగ్ర శిక్ష ఏఈఈ ఎన్ మస్తానయ్య మాట్లాడుతూ ఈ నిధులతో గ్రౌండ్‌ఫ్లోర్‌లో మూడు అదనపు తరగతి గదులు, టాయిలెట్లు, మొదటి అంతస్తులో డార్మెంటరీ గదులు, టాయిలెట్లను నిర్మిస్తామన్నారు. ఈ పనులను ఏడాదిలోగా పూర్తి చేయాల్సి ఉందని చెప్పారు.కానీ గడువుకు ముందే పనులు పూర్తి చేస్తామని చెప్పారు.

● అనుమతుల కోసం అంచనాలు

గత ప్రభుత్వ హయాంలో ఇదే ప్రాంగణంలో నాడు-నేడు-2 పథకం కింద ఇంటర్ విద్యార్థినులకు ప్రారంభించిన తరగతి గదుల నిర్మాణ పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. అయితే అధికారులు రూ.30 లక్షలతోగ్రౌండ్‌ఫ్లోర్‌లోని 4 గదులను అసంపూర్తిగా నిర్మించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో వీటిని పూర్తి చేసేందుకు అనుమతుల కోసం అంచనాలను రాష్ట్ర ఉన్నతాధికారులకు పంపారు. అనుమతులు వచ్చిన వెంటనే పనులు చేపడతామని ఏఈఈ తెలిపారు.

ఏరియా ఆసుపత్రిలో ఎమ్మెల్యే తనిఖీ

● డయాలసిస్ సెంటర్ పనితీరుపై అసంతృప్తి



కందుకూరు ఏరియా ఆసుపత్రిలో రోగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): స్థానిక ఏరియా ఆసుపత్రిని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్పటల్‌లోని ఔట్‌పేషెంట్ విభాగం, అత్యవసర విభాగం, జనరల్ వార్డులు, ప్రసూతివిభాగాలను పరిశీలించిన ఆయన అక్కడి రోగులతో మాట్లాడారు. వారికి అందుతున్న చికిత్స, మందుల లభ్యత, ఆహార నాణ్యత, పరిశుభ్రత తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. వైద్యుల హాజరుపట్టికలను, రికార్డులను పరిశీలించి అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. వైద్యులు ఎవరైనా ఎట్టిపరిస్థితుల్లో బయటి మెడికల్ షాపులకు మందులకు రాస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

● సిబ్బంది లేకపోవడంపై ఆగ్రహం

డయాలసిస్ సెంటర్‌లో పేషెంట్లకి తగినట్లుగా సిబ్బంది లేకపోవటంపై అక్కడి మేనేజరుపై ఎమ్మెల్యే తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. డయాలసిస్ సెంటర్‌కు షాట్ టైమింగ్ ప్రకారం వైద్యసేవలు అందటంలేదని కొందరు రోగులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తంచేశారు. డయాలసిస్ పేషెంట్లకి సరైన చికిత్స అందించేలా చూడాలని ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. సమయపాలన పాటించని వైద్యాధికారులు, ఆసుపత్రి సిబ్బందిపై చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో హాస్పటల్ సూపరింటెండెంట్ శకుంతల, వైద్యాధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● ఎమ్మెల్యే ఇంటూరికి కృతజ్ఞతలు

లింగసముద్రం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చినపవనిలో గల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ధూపదీప నైవేద్యాలకు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ప్రభుత్వం నుంచి ప్రతి నెల రూ.10 వేలు మంజూరయ్యేలా చర్యలు తీసుకున్నారు.దీంతో గురువారం సాయంత్రం ఆలయ అర్చకులు వీ. రమణాచార్యులు, ఆలయ కమిటీ సభ్యులు, టీడీపీ నాయకులు ఎమ్మెల్యే నాగేశ్వరరావును కందుకూరులోని టీడీపీ కార్యాలయంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా వారు నాగేశ్వరరావును శాలువా కప్పి, పూలమాలతో సన్మానించారు.

డిగ్రీకళాశాల అధ్యాపకుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న అధ్యాపకులు

కందుకూరు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు గురువారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అధ్యాపకసంఘాల నాయకులు మాట్లాడుతూ అన్ని విభాగాలలో బదిలీలు నిర్వహించిన ప్రభుత్వం తమ విభాగంలో మాత్రం బదిలీలు నిర్వహించలేదని, తక్షణం అధ్యాపకుల బదిలీల ప్రక్రియ చేపట్టాలని కోరారు. గత ప్రభుత్వంలో ఎయిడెడ్ అధ్యాపకులను ప్రభుత్వ కళాశాలల్లో నియమిస్తూ ప్రభుత్వం ఇచ్చిన జీవో 42ను రద్దుచేయాలని, ఇతర రాష్ట్రాల్లో ఉన్నవిధంగా తమను అసిస్టెంట్ ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, ప్రొఫెసర్లుగా గుర్తించాలని, ఎంతో కాలంగా అపరిష్కృతంగా ఉన్న ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తక్షణచర్యలు చేపట్టకుంటే ఈనెల 18న విజయవాడలో మహాధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకసంఘాల నాయకులు వీ. రాజగోపాలబాబు, ఎస్. తిరుపతిస్వామి, బీ. కమలబాబు, ఎన్వీ శ్రీహరి, ఏడుకొండలు నరేంద్ర తదితరులు పాల్గొన్నారు. ఈ నిరసనకు బోధనేతర సిబ్బంది డీ. రాంబాబు నేతృత్వంలో సంఘీభావం తెలిపారు.

చేనేతకు రాయితీలు శుభపరిణామం : సీపీఐ

నెల్లూరు (వైద్యం), ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : చేనేత కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం 200 యూనిట్ల విద్యుత్‌ను ఉచితంగా ఇస్తామని ప్రకటించటం శుభపరిణామమని సీపీఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య అన్నారు. గురువారం జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా పార్టీ జిల్లా కార్యాలయం వద్ద చేనేత జెండాను ఆవిష్కరించారు. అంకయ్య, చేనేత ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శేషయ్య మాట్లాడుతూ చేనేత ఉత్పత్తులపై జీఎస్టీని రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తామని ప్రకటించడం సంతోషంగా ఉందన్నారు. అదేవిధంగా చేనేత ఉత్పత్తులపై ఉన్న 11 రకాల రిజర్వేషన్ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని, చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో చేనేత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకట సురేష్, పముజుల చంద్రశేఖర్, బైన రాజశేఖర్ పాల్గొన్నారు.

టీడీపీ కార్యాలయంలో చేనేత దినోత్సవం

నెల్లూరు (వైద్యం), ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ జిల్లా కార్యాలయంలో గురువారం 11వ జాతీయ చేనేత దినోత్సవం జరిగింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి సవిత చిత్రపటాలకు పాలభిషేకం చేశారు. ఉత్తమ చేనేత కళాకారులను సత్కరించారు. నాయకుడు పీఎల్ రావు మాట్లాడుతూ చేనేతల మగ్గానికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్, పవర్ మగ్గాలకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించటం శుభపరిణామమన్నారు. అలాగే క్యాబినెట్‌లో నేతన్న భరోసా కోసం రూ.2500 ఇస్తామని పేర్కొనడం ఆనందంగా ఉందన్నారు.

వినాయక చవితి ఉత్సవాల పోస్టర్లు ఆవిష్కరణ



వినాయక చవితి ఉత్సవాల పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యులు

కావలి,ఆగస్టు7(ఆంధ్రజ్యోతి): భగత్‌సింగ్ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 27 నుంచి సెప్టెంబరు2 వరకు కావలి బ్రిడ్జి సెంటర్‌లో నిర్వహించనున్న వినాయకచవితి ఉత్సవాల పోస్టర్లను గురువారం ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి ఆయన నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో చవితి ఉత్సవాలను నిర్వహించాలని తెలిపారు. ఈ కర్యాక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు సిద్దూ, కండ్లగుంట మధుబాబు నాయుడు, ఇస్కా విక్రమరెడ్డి, దేవరకొండ శ్రీనివాసులు, ఆలా శ్రీనివాసులు, బాబీ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులు అంకితభావంతో పనిచేయాలి



సన్మానం అందుకున్న బదిలీపై వెళుతున్న సచివాలయ సిబ్బంది

కలిగిరి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెలగపాడు సచివాలయంలో పనిచేస్తూ బదిలీపై ఇతర మండలాలకు వెళ్లిన ఉద్యోగులకు స్థానిక సచివాలయంలో గురువారం సన్మానించారు. ఈ సందర్భంగా వెలగపాడు, కావలిముస్తాపురం సర్పంచులు దేవనబోయిన వెంకటసుబ్బయ్య, పోలవరపు సుబ్బానాయుడు మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ ప్రారంభమైన తరువాత సచివాలయ సిబ్బంది ప్రభుత్వ పథకాలు అమలులోను, గ్రామాలభివృద్ధిలో సమర్థవంతంగా విధులు నిర్వహించారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయం సీనియర్, జూనియర్ సహాయకులు గోపీనాథ్, శ్రీనివాస్ దీక్షితులు, పంచాయతీ కార్యదర్శి తనూజ, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన తల్లిపాల వారోత్సవాలు



వీవీ పాలెం : తల్లిపాలపై అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ సునీత

వలేటివారిపాలెం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెర్లోపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు గురువారం ముగిశాయి. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ సునీత మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు ముర్రుపాలు పట్టిస్తే మొదటి టీకాలాగా పనిచేస్తుందని తెలిపారు. శిశువుకు కావాల్సిన పోషకాలు లభిస్తాయని తెలిపారు. అంతేకాక జీర్ణక్రియను సులభతరం చేస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ స్కూల్ టీచరు వసుంధర, అంగన్‌వాడీ కార్యకర్తలు రమ, భారతి, మనోహర, హైమ, తదితరులు పాల్గొన్నారు.

● **కొండాపురం :** ఐసీడీ ఎస్ ఆధ్వర్యంలో జరుగుతున్న తల్లిపాల వారో త్సవాలు గురువారం ముగిశాయి. సాయిపేట (మెయిన్) అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన కా ర్యక్రమంలో పాల్గొన్న స్థానిక ఆరోగ్య ఉపకేం ద్రం ఎమ్ఎల్‌హెచ్‌పీ మార్గరెట్ మాట్లాడుతూ తల్లి పాలు బిడ్డకు ఎంతో శ్రేయస్కరమన్నారు. అనంతరం ఆమె గర్భిణీలకు పౌష్టికాహారాన్ని అందచేశారు. ఈకార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త మమత, ఆశా కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు,

● **బిట్రగుంట :** పసిబి డ్డలకు తల్లిపాలు ఎంతో శ్రేష్టమని కావలి ఐసీడీఎస్ సీడీపీవో సౌజన్య అన్నారు. బోగోలు మండలం ఏబీకండ్రికలో తల్లిపాల వారోత్సవాల ముగింపు కార్యక్రమం గురువారం జరిగింది. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు ధనమ్మ, ప్రశాంతి, సుశీల, లక్ష్మీకాంతమ్మ, ఎంఎస్‌కే ప్రియాంక, ఏఎన్ఎం సలోమి పాల్గొన్నారు.

ఉచిత ప్రయాణానికి పటిష్ట ఏర్పాట్లు



కావలి డిపో ఆవరణాన్ని పరిశీలిస్తున్న డీసీటీ మేనేజరు రమేష్ తదితరులు

కావలి, ఆగస్టు7(ఆంధ్రజ్యోతి): మహిళల ఉచిత బస్సు ప్రయాణానికి పటిష్ట ఏర్పాట్లు చేపడుతున్నట్లు ఆర్టీసీ డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ (డీసీటీ) మేనేజరు ఆర్. రమేష్ తెలిపారు. కావలి డిపోను గురువారం ఆయన సందర్శించి డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌ల సిబ్బందితో గేట్ మీటింగ్ నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ మహిళల ఉచిత బస్సుప్రయాణ పథకం విజయవంతం కావాలంటే డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌ల పాత్ర ముఖ్యమన్నారు. ఈ పథకం ప్రారంభమయ్యాక కండక్టర్, డ్రైవర్ ప్రయాణికులతో సానుకూలంగా స్పందించి, ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలన్నారు. అలాగే మెకానిక్‌లు బస్సుల లోపాలను గమనించి మంచి కండిషన్‌లతో సర్వీస్‌లను అందించాలన్నారు. అనంతరం బస్టాండ్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిపోమేనేజరు ఆదినారాయణ, అసిస్టెంట్ మేనేజరు ఎం. కల్పనారెడ్డి, అసిస్టెంట్ ఇంజనీర్ ఎస్‌కే ఖాజామొహిద్దీన్, ట్రాఫిక్ సూపరింటెండెంట్ ఎం. రామకృష్ణ పాల్గొన్నారు.

● **కందుకూరు, (ఆంధ్రజ్యోతి):** స్థానిక ఆర్టీసీ డిపోలో డిప్యూటీ సీటీఎం కె.రమేష్ గురువారం తనిఖీలు నిర్వహించారు. ఆర్టీసీ అధికారులు, కార్మికులతో గేటు మీటింగు ఏర్పాటు చేసి ఈనెల 15 నుంచి మహిళాస్త్రీశక్తి పథకం ప్రారంభం కానున్న తరుణంలో తీసుకోవాల్సిన జాగ్రత్తపై సలహాలు ఇచ్చారు. మహిళల రద్దీని దృష్టిలో ఉంచుకుని వారికి సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఎం శ్రీనివాసరావు, ఏఎం శివప్రసాద్, ఎంఎఫ్ రాజ్యలక్ష్మి, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ప్రేమించినందుకు కక్ష సాధింపులా!?

దళిత గ్రామంపై అగ్రకులాల దాడి అమానుషం

అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు



పాతబస్టాండు కూడలిలో నిరసన వ్యక్తం చేస్తున్న దళితులు

అల్లూరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : అగ్రకులానికి చెందిన ఓ యువతిని నిజాయితీగా ప్రేమించి పెళ్లిచేసుకున్న పాపానికి వారి దౌర్జన్యానికి దళిత గ్రామమే బలైందని అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్లు సాల్మన్‌రాజు అన్నారు. ఈ ఘటనకు నిరసనగా అల్లూరు పాతబస్టాండు కూడలిలో గురువారం దళితులతో కలసి నిరసన చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బోగోలు మండలం తెల్లగుంట పంచాయతీ దళితవాడపై అదే మండలం సిద్దనపాలెంకు చెందిన అగ్రకులాలవారు ఈనెల 2న ఎవరూ లేని సమయంలో గ్రామంలోకి ప్రవేశించి ఇళ్లపై దాడులు చేసి మహిళలు, పిల్లలు అనికూడా చూడకుండా దాడులు చేయడం దారుణమన్నారు. ఇటువంటి దాడులు చేసినా పోలీసులు కేసు కట్టకుండా నీరుగార్చే కుట్ర చేశారని, తామంతా ఏకతాటిపై నిలవడంతో కేసు నమోదు చేశారని అన్నారు. కులవివక్ష లేకుండా రాజ్యాంగబద్ధంగా బాధితులకు న్యాయం చేయాలని తామంతా కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పప్పు సుధాకర్, గంగపట్నం సతీష్, దర్శిగుంట వాసు, కాకాని ప్రభాకర్, పంగులూరు సుధాకర్, కర్రా మల్లికార్జున, ఇమ్మానియేలు తదితరులు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ తరగతుల ప్రారంభం



పూజలో పాల్గొన్న కరస్పాండెంట్, ప్రిన్సిపాల్, అధ్యాపకులు

కందుకూరు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని కృషిచేస్తే.. మేము వారిని సాంకేతికంగా కమ్యూనికేషన్ స్కిల్స్‌తో, ప్రాక్టికల్ నాలెడ్జ్‌తో తగిన నైపుణ్యాలతో తీర్చిదిద్దుతామని ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్ కంచర్ల విజయ్‌శ్రీనివాస్ పేర్కొన్నారు. కళాశాలలో ఫస్ట్‌ఇయర్ ఇంజనీరింగ్ తరగతులను గురువారం పూజా కార్యక్రమంతో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి భవిష్యత్తును బలంగా తీర్చిదిద్దటమే లక్ష్యంగా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవటం జరుగుతుందన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ రవికుమార్ మాట్లాడుతూ ఇంజనీరింగ్ విద్యార్థి కళాశాలలో అడుగుపెట్టిన మొదటిరోజే మార్గదర్శకంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వీ. హరిబాబు, సూరియాషిహాబ్, డీ. కొండలరావు, జీ. సురేష్, జే. సింగయ్య, శర్మ, జీ. ప్రసాద్, శైలేష్‌కుమార్, షరీఫ్, ఆశామాధవి, హిమబిందు, సులోచన తదితరులు పాల్గొన్నారు.

ఈ రోడ్డుపై ప్రయాణం నరకం!




వలేటివారిపాలెం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): వలేటివారిపాలెం నుంచి లింగసముద్రం మండలం ముక్తేశ్వరం గ్రామానికి వెళ్లే మట్టిరోడ్డు అధ్వానంగా ఉంది. రోడ్డుకు రెండు వైపులా చిల్లచెట్లు పెరిగాయి. వర్షాలు కురవడంతో ఈ రోడ్డుపై ట్రాక్టర్లు, ఇతర వాహనాలు తిరగడంతో పెద్ద గోతులు ఏర్పడ్డాయి. ఈ గోతులతో ద్విచక్ర వాహనదారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. అయినా మరమ్మతులు కూడా చేయలేదు. లింగసముద్రం మండలం బంగారక్కపాలెం, ముక్తేశ్వరం, విశ్వనాథపురం, మాలకొండ్రాయుడుపాలెం, వీఆర్‌కోట, కళ్లవళ్ల తదితర గ్రామాలకు నిత్యం ఈ రోడ్డుపై పదుల సంఖ్యలో వాహనాలు తిరుగుతుంటాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేయించాలని పలువురు వాహనదారులు కోరుతున్నారు.

ఎండిన చెట్టు కూల్చకుంటే ముప్పే



వలేటివారిపాలెం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ కార్యాలయం పక్కనే వేపచెట్టు ఎండిపోయి కూలిపోయేలా ఉంది. కార్యాలయానికి వివిధ పనులపై వచ్చే ప్రజలు ఆ చెట్టు కింద నిల్చుంటారు. ఆ సమయంలో కూలి ప్రమాదం జరిగే అవకాశం ఉంది. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రమాదం జరగకముందే ఆ చెట్టును తొలగించాలి.



తిరుపతిలో మళ్లీ పడగవిప్పిన అరాచకం



లాఠీ దెబ్బలు తట్టుకోలేక విలవిలలాడుతున్న పవన్



తిరుపతిలో అరాచక భూతం మళ్లీ నిద్రలేచింది. కాస్త ప్రశాంత వాతావరణం ఏర్పడుతోంది అనుకునేలోగానే విచ్చలవిడి దాడులకు తెగబడుతున్నారు. దబాయింపులు.. దౌర్జన్యాలు.. హింసాత్మక సంఘటలూ పెచ్చుపెరుగుతున్నాయి. గురువారం సోషల్ మీడియాలో వైరల్ అయిన దృశ్యాలు నగర ప్రజలను భయకంపితులను చేశాయి. బకాయి ఉన్నాడంటూ ఒక దళిత యువకుడిని పోలీసులు వాడే ఫైబర్ లాఠీతో విచక్షారహితంగా కొడుతున్న దృశ్యాలు చూసిన వారి ఒళ్లు జలదరించింది.

తిరుపతి (నేరవిభాగం), ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): కాళ్లతో తన్నారు. ఫైబర్ లాఠీతో చితకబాదారు. దుష్ట క్రరతో విచక్షణారహితంగా కొట్టారు. ఒళ్లంతా రక్తమైనా, అన్నా.. వదలంటూ కాళ్ల పట్టుకున్నా, కనికరించలేదు. వైరల్ అయిన ఈ దాడి దృశ్యాలు పోలీసులకు చేరడంతో రంగంలోకి దిగారు. మరోవైపు బాధితుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. తిరుపతి పోలీసుల కథనం మేరకు.. చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలం మొరవపల్లికి చెందిన నీలం జయరాజ్ కుమారుడు పవన్‌కుమార్ తిరుపతిలోని ఓ రెసిడెన్సీలో రిసెప్షనిస్టు. తిరుపతి వైసీపీ సోషల్ మీడియా విభాగం అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి కారు డ్రైవర్ అయిన అనిల్‌కుమార్‌రెడ్డి శ్రీనివాసం ఎదురుగా ఎస్వీపీ బైక్ రెంటల్స్ పేరిట ద్విచక్ర వాహనాలను అద్దెకు ఇస్తున్నాడు. నెల కిందట పవన్‌కుమార్ డియో హోండా బైక్‌ను అద్దెకు తీసుకున్నాడు. దాదాపు 20 రోజులుగా బాడుగ చెల్లించలేదు. ఈ క్రమంలో స్విమ్స్ వద్ద ఉన్న పవన్, అతడి స్నేహితుడిని అనిల్ అనుచరుడు, మరో బైక్ రెంటల్ యజమాని జగదీశ్వర రెడ్డి అలియాస్ జగ్గూ, అజయ్‌కుమార్ బుధవారం మధ్యాహ్నం అనిల్‌కుమార్ రెడ్డి కార్యాలయానికి తీసుకొచ్చారు. అంతలో పాకాలకు చెందిన.. కొర్లగుంటలో ఉంటూ ఫైనాన్సు, సెటిల్‌మెంట్లు చేస్తున్న వైసీపీ నేత దినేష్ అక్కడకు చేరుకున్నాడు. ఫైబర్ లాఠీతో పవన్‌ను విచక్షణా రహితంగా దినేష్ కొట్టాడు. ఒళ్లు రక్తంతో కమిలిపోయి అన్నా.. కొట్టొద్దు.. కొట్టొద్దు అంటున్నా విడిచిపెట్టలేదు. చిత్రహింసలకు గురిచేశాడు. అనిల్‌కుమార్ రెడ్డి కూడా లాఠీతో చితకబాదాడు. ఈ ఘటనను పవన్ స్నేహితుడు వీడియోలు తీసి గ్రూపుల్లో వైరల్ చేశారు. ఈ వీడియోలను నీలం జయరాంకు అనిల్ పంపి.. మీ కుమారుడు మాకు డబ్బులివ్వాలని చెప్పడంతో తాను వచ్చి ఇస్తానని ఆయన చెప్పారు. అక్కడ్నుంచి పవన్‌కుమార్‌ను పంపేశారు.



ఈస్ట్ పోలీసు స్టేషన్‌లో అనిల్‌రెడ్డి

పలు సెక్షన్ల కింద కేసులు: డీఎస్పీ

నిందితులు అనిల్‌కుమార్ రెడ్డి, దినేష్, జగదీశ్వర రెడ్డిను అదుపులోకి తీసుకుని కిడ్నాప్, హత్యాయత్నం, ఎస్సీ ఎస్టీ, చిత్రహింసలకు గురి చేయడం వంటి సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్లు తిరుపతి డీఎస్పీ భక్తవత్సలం గురువారం చెప్పారు. వీరిపై రౌడీ షీట్ ఓపన్ చేస్తామన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారెవరైనా వదలి పెట్టేది లేదన్నారు. ఈ దాడి ఘటనలో నిందితులైన వైసీపీ నాయకులపై కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి వంగలపూడి అనిత పోలీసులను ఆదేశించారు. ఈ ఘటన వెనుక సూత్రధారులను వదలిపెట్టేది లేదన్నారు.

పవన్ ఎక్కడ?

ఈ ఘటన తర్వాత పవన్ కనిపించలేదు. ఆయన మొబైల్ ఆన్ చేసి.. తర్వాత ఆఫ్ చేస్తున్నారు. ఇతడి కోసం సీఐ రామయ్య, సిబ్బంది గాలించారు. కల్లూరు మండలం ఇస్త్రాకులపల్లె వద్ద స్నేహితుడు జానకిరామ్‌తో పవన్ ఉన్నట్లు గుర్తించి వెళ్లారు. అప్పటికే పవన్ వెళ్లిపోగా, జానకిరామ్‌ను మాత్రం గురువారం రాత్రి తిరుపతికి తీసుకొచ్చారు.

అదుపులో ముగ్గురు నిందితులు

కాగా, వైరల్ అయిన వీడియోలు పోలీసులకూ చేరాయి. నిందితులను పట్టుకునేందుకు డీఎస్పీ భక్తవత్సలం నేతృత్వంలో వర్సిటీ సీఐ రామయ్య, ఈస్ట్ ఎస్‌ఐ గిరిబాబు, ఈస్ట్ హెడ్ కానిస్టేబుల్ జ్యోతినాథ్, సిబ్బందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. పద్మావతి పురంలో ఉన్న అనిల్‌ను అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల హెచ్చరికలతో బుధవారం అర్ధరాత్రి జగదీశ్వరరెడ్డి ఈస్ట్ స్టేషన్‌లో లొంగిపోయాడు. వీరిని విచారించాక దినేష్, అజయ్‌కుమార్ కూడా ఉన్నట్లు తెలిసింది. గురువారం సాయంత్రం దినేష్‌ను చింతలచేను బస్టాపు వద్ద అదుపులోకి తీసుకున్నారు. ఈ ముగ్గురు పోలీసుల అదుపులో ఉండగా, అజయ్‌కుమార్ పరారయ్యాడు. వున్నారు. బాధితుడి తండ్రి జయరాజ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రూ.5 లక్షలు ఇవ్వకుంటే శవాన్ని పంపిస్తాం

- నిందితులు బెదిరించారంటూ పవన్ తల్లి ఆవేదన



సునీత

'మీ కొడుకు మావద్ద బైక్ రెంటల్‌కు తీసుకుని డబ్బులు ఇవ్వలేదు. అతడిని కొట్టిన వీడియోలు మీకు పంపాము. రూ.5 లక్షలు సాయంత్రానికంతా (బుధవారం) పంపకుంటే మీ కొడుకు కిడ్నీ తీసుకుని, శవాన్ని ఇంటికి పంపిస్తామని మాకు రెండు, మూడు నెంబర్ల నుంచి ఫోన్ చేశారు. మేము భయపడి పోయి మా కొడుకుని కాపాడాలంటూ తిరుపతి పోలీసులకు ఫిర్యాదు చేశాం' అంటూ పవన్ తల్లి సునీత గురువారం ఈస్ట్ పోలీసు స్టేషన్ వద్ద ఆవేదన వ్యక్తంచేశారు. 'తప్పు చేస్తే పోలీసులకు ఫిర్యాదు చేయాలి. అంతేకానీ రక్తం వచ్చేట్లు లాఠీతో కొట్టడానికి వీళ్లెవరు? బాగా కొట్టి.. ఇప్పుడు కనిపించకుండా చేశారు. వెంటనే నిందతులను అరెస్టు చేసి నా బిడ్డను కాపాడాలి' అంటూ ప్రాధేయపడ్డారు. ఆమెకు మద్దతుగా అంబేడ్కర్ సంఘం జిల్లా నాయకులు ధనశేఖర్, రమేష్, సమతా సైనిక దళ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు చిరంజీవి, ఎస్సీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ప్రసాదరావు తదితరులు ధర్నా చేశారు.

ఆగని వైసీపీ అరాచకాలు



తిరుపతి, తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): అధికారంలో ఉన్నప్పుడే కాదు.. ఇప్పుడూ తిరుపతిలో వైసీపీ అరాచకాలు ఆగలేదు. కొన్ని ఘటనలు చూస్తే..

ఎన్నికల ప్రచారంలో ప్రశ్నించాడని..

వారం కిందట తిరుమల బైపాస్ రోడ్డులో నడుచుకుంటూ వస్తున్న చందు(19)ను ఎర్రమిట్టకు చెందిన వైసీపీ నేత రాజీ, మరో 17 మందితో కలసి బాటిల్ పగలగొట్టి పొడిచేశారు. వైసీపీ అభ్యర్థి అభినయ్ ఎన్నికల ప్రచారానికి వచ్చినప్పుడు 'ఆయన తిరుపతికి ఏమి చేశాడు?' అని చందు వ్యాఖ్యానించినట్లు వైసీపీ నాయకుల దృష్టికి వచ్చినట్టు సమాచారం. దీంతో వారం క్రితం తిరుపతికి వచ్చిన చందుపై గంజాయి బ్యాచ్‌ను వేసుకుని దారుణంగా పొడిచారు. కుటుంబీకులు రుయాస్పత్రికి తీసుకెళ్లి మెడికో లీగల్ కేసుగా నమోదు చేయించారు. ఓ వైసీపీ కార్పొరేటర్ ఒత్తిడితో అలిపిరి పోలీస్ స్టేషన్‌లోని ఓ ఎస్‌ఐ కేసు నమోదు చేయడానికి ఆసక్తి చూపలేదన్న ఆరోపణ వచ్చింది. దీనిపై బాధితులు గట్టిగా పట్టుబట్టడంతో పిటీ కేసు పెట్టి వదిలేశారని తెలిసింది. దీనిపై బాధితులు ఎస్పీ కార్యాలయంతో పాటు, మానవహక్కుల కమిషన్‌కు కూడా ఫిర్యాదు చేసేందుకు సిద్ధమైనట్టు సమాచారం.

సెటిల్మెంట్ల చైతన్య:

అభినయ్ ప్రధాన అనుచరుడు, ఎస్టీవీనగర్‌కు చెందిన చైతన్యకుమార్ యాదవ్ గత నెలలో చింతలచేను వద్ద ఓ కార్ డెకార్స్‌కు సంబంధించి దుకాణం ఇచ్చేయాలంటూ దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. లీలామహల్ రోడ్డులో కృష్ణ కాంప్లెక్సులో ఓ గది అద్దెకు తీసుకుని బాడుగ చెల్లించలేదు. ఖాళీ చేయలేదు. దీంతో గది యజమాని రూము ఖాళీచేసి ఇతరులకు బాడుగకు ఇచ్చారు. దీంతో చైతన్య వెళ్ళి కార్యాలయంలోని అద్దాలు, పర్నిచర్ ధ్వంసం చేశాడు. ఈ రెండు ఘటనల్లో కేసులు నమోదయ్యాయి. వైసీపీ హయాంలో సూపర్ పోలీస్‌గా ఇతడు వ్యవహరించాడన్న ప్రచారం ఉంది. ఉన్నత స్థాయి అధికారులు సైతం చైతన్య చెప్పిందే చేయాలన్న ఆదేశాలు వైసీపీ నేతలు ఇచ్చారన్న విమర్శలున్నాయి. ఇప్పుడూ కొందరి పోలీసుల సహకారంతోనే సెటిల్మెంట్లు చేస్తున్నాడన్న ప్రచారం జరుగుతోంది.

అనిల్ రెడ్డికి ఇలాంటివి కొత్తేమి కాదు : పవన్‌పై అమానుషంగా దాడికి పాల్పడిన ఘటనకు కారణమైన అనిల్‌రెడ్డి ఇటీవల 14వ డివిజన్లో టీడీపీ జెండా పైన వైసీపీ జెండా కట్టి రాజకీయ విద్వేషాలు రెచ్చగొట్టారు. దీనిపై టీడీపీ నేతలు పోలీసులకు ఫిర్యాదుచేసినా ప్రయోజనం కనిపించలేదు.

రౌడీల ఆగడాలు సాగనివ్వం: ఎస్పీ

తిరుపతిలో రౌడీల ఆగడాలు సాగనివ్వబోమని ఎస్పీ హర్షవర్ధనరాజు హెచ్చరించారు. పవన్‌పై దాడి చేసిన వారిని శిక్షిస్తామన్నారు. హోంమంత్రి ఆదేశాల మేరకు ఘటన జరిగిన వెంటనే నిందితులను అదుపులోకి తీసుకున్నామన్నారు.

నవోదయలో ప్రవేశాలకు ఆన్‌లైన్ దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(విద్య), ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): జవహర్ నవోదయ విద్యాలయాల్లో 9, 11 తరగతుల్లో 2026-27 సంవత్సరానికి ప్రవేశాలు పొందేందుకుగాను ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి కేవీఎన్ కుమార్ గురువారం తెలిపారు. 9వ తరగతిలో ప్రవేశం పొందగోరు విద్యార్థి జిల్లాలో ఏదేని ప్రభుత్వ గుర్తింపు కలిగిన పాఠశాలలో 2025-26 విద్యాసంవత్సరంలో 8వ తరగతి చదువుతూ ఉండాలని, 2011 మే ఒకటి నుంచి జూలై 31 మధ్య జన్మించిన వారై ఉండాలని పేర్కొన్నారు. 11వ తరగతిలో ప్రవేశం పొందగోరు విద్యార్థులు 2009 జూన్ ఒకటి నుంచి 2011 జూలై 31 మధ్య కాలంలో జన్మించి, 2025-26 విద్యా సంవత్సరంలో జిల్లాలో ఏదేని ప్రభుత్వ గుర్తింపు కలిగిన పాఠశాలలో 10వ తరగతి చదువుతూ ఉండాలని సూచించారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు 2025 సెప్టెంబరు 23వ తేదీలోపు ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 2026 ఫిబ్రవరి 7వ తేదీన పరీక్ష ఉంటుందని తెలిపారు. www.navodaya.gov.in వెబ్‌సైట్ ద్వారా మరిన్ని వివరాలు తెలుసుకోవచ్చని చెప్పారు.

4 ఆలయాల ట్రస్టుబోర్డుల నియామకానికి నోటిఫికేషన్

తిరుపతి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నాలుగు ప్రధాన ఆలయాల ట్రస్టుబోర్డుల నియామకానికి రాష్ట్ర ప్రభుత్వం గురువారం నోటిఫికేషన్ జారీ చేసింది. రూ.కోటి నుంచీ రూ.5 కోట్ల నడుమ వార్షికాదాయం కలిగిన 56 ఆలయాలకు పాలకమండళ్లను నియమించేందుకు నోటిఫికేషన్ జారీ చేసింది. ఇందులో జిల్లాకు చెందిన ఆలయాలు నాలుగున్నాయి. తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ, చిల్లకూరు మండలం తూర్పు కనుపూరులోని ముత్యాలమ్మ, తమ్మినపట్నం కోదండరామాలయంతో పాటు సురుటిపల్లిలోని పల్లికొండేశ్వరస్వామి ఆలయాల పాలకమండళ్ల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానించింది. 20 రోజుల్లోపు ఆసక్తి అర్హత ఉన్నవారు దరఖాస్తులను ఆయా ఆలయాల కార్య నిర్వహణాధికారులకు అందజేయాల్సి ఉంటుంది. .

శ్రీకాళహస్తి 'హరిత' ప్రైవేటీకరణకు అనుమతి

తిరుపతి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి శివార్లలోని ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు చెందిన హరితా హోటల్ నిర్వహణను ప్రైవేటు వ్యక్తులు లేదా సంస్థలకు అప్పగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతించింది. కొత్త టూరిజం పాలసీకి అనుగుణంగా రాష్ట్రవ్యాప్తంగా 22 ఏపీటీడీసీ హోటళ్ళు, రిసార్టుల నిర్వహణను ప్రైవేటు వ్యక్తులు, సంస్థలకు అప్పగించేందుకు ఆ శాఖ చేసిన ప్రతిపాదనను ఇటీవల మంత్రిమండలి ఆమోదించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో 25 గదులున్న శ్రీకాళహస్తి హరితా హోటల్ నిర్వహణ ప్రైవేటు సంస్థలచేతికి వెళ్ళనుంది.

కె.శ్రీనివాస్‌కు నేడు


కేఎన్ జయమ్మ స్ఫూర్తి పురస్కారం



ఆంధ్రజ్యోతి మాజీ సంపాదకులు, ఉపన్యాసకులు, సామాజిక సాహిత్య విశ్లేషకులు డాక్టర్ కె.శ్రీనివాస్‌కు కేఎన్ జయమ్మ స్ఫూర్తి పురస్కారాన్ని నేడు ప్రదానం చేయనున్నట్లు రచయిత పలమనేరు బాలాజి ఓ ప్రకటనలో తెలిపారు. పలమనేరు సమీపం మదనపల్లె రహదారిలోని లయన్స్‌క్లబ్ వేదికగా శుక్రవారం మధ్యాహ్నం 2గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో ఆయనకు జ్ఞాపికతో పాటు రూ.25వేలను అందజేయడం జరుగుతుందన్నారు. జర్నలిస్టుగా నాలుగు దశాబ్దాలకు పైగా కె.శ్రీనివాస్ రాసిన కథనాలు, సంపాదకీయాలు, చేసిన ఇంటర్వ్యూలు, సమకాలీన ప్రపంచ చరిత్రను కొత్తకోణంలో చూపిస్తాయన్నారు. తెల్లారని తెలంగాణ, బుల్డోజర్ సందర్భాలు, శ్రీనివాస్ సంపాదకీయాలు, తెలంగాణలో సాహిత్య వికాసం, జూన్ 2, అనేక సందర్భాలు, కొత్త వంతెన, సంభాషణ.... ఇలా తెలుగు ప్రపంచానికి అవసరమైన అన్ని సందర్భాలలో విలువైన ఎన్నో పుస్తకాలను ఆయన వెలువరించారన్నారు.తాపీ ధర్మారావు స్మారక పురస్కారం, సి.వై. చింతామణి అవార్డు, ఎన్.ఆర్. చందూర్ అవార్డు, డి. శ్రీపాదరావు అవార్డు, మాదల వీరభద్రరావు స్మారక పురస్కారం, దేవులపల్లి రామానుజ రావు స్మారక సాహిత్య పురస్కారం,ముప్పాళ్ల పద్మావతి రంగయ్య పురస్కారం,అరుణ్ సాగర్ విశిష్ట పాత్రికేయ పురస్కారం, ప్రపంచ తెలుగు సమాఖ్య వారి బీఎస్ఆర్ కృష్ణ స్మారక పురస్కారం-2016.. మొదలైన పురస్కారా లను తన రచనలకు కె. శ్రీనివాస్ ఇదివరకు పొందారని ఆయన వివరించారు.

- గంగవరం, ఆంధ్రజ్యోతి

సర్వదర్శనానికి 12 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో ఓ షెడ్డులో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

మంగళవారం హుండీ ఆదాయం: రూ.4.15 కోట్లు

బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 71,144

తలనీలాలు సమర్పించినవారు: 28,889

ఒంపులు తిరుగుతూ సాగే ఏరు.. నిశ్చలంగా నీళ్లు.. ఏటికి అటూఇటూ ఒత్తుగా పెరిగిన మడచెట్లు.. వాలుతూ ఎగురుతూ పక్షులు.. ఏటినీటిలో పడవలు.. వలలు విసురుతూ మత్స్యకారులు.. కేరళ తరహా అందమైన దృశ్యం తిరుపతి జిల్లా చిల్లకూరు మండలంలో కనిపిస్తుంది. కండలేరు క్రీక్‌గా పిలిచే ఈ ఉప్పుటేరు జీవ వైవిధ్యానికి, మత్స్యకారుల జీవనోపాధికి నెలవు. పర్యాటకులకు కనువిందు. కాకపోతే అందుకు తగిన ఏర్పాట్లను ప్రభుత్వం ఈ ప్రాంతంలో చేయాల్సి ఉంది.

- గూడూరు, ఆంధ్రజ్యోతి



మన సుందర్బన్ ఈ ఉప్పుటేరు



ఉప్పుటేరులో గిరిజనుల చేపల వేట



కండలేరు ఏరియల్ వ్యూ



వేటకోసం పడవలు

36 కిలోమీటర్లు విస్తరించిన కండలేరు క్రీక్

గుమ్మళదిబ్బ సముద్ర ముఖద్వారం నుంచి తిప్పగుంటపాళెం వరకు 36 కిలోమీటర్ల వెనుకకు సముద్రపు ఉప్పునీరు ప్రవహిస్తుంది. అదే సమయంలో వెంకటగిరి కైవల్యానది నుంచి వచ్చే మంచినీటి ప్రవాహం గూడూరు మీదుగా చల్లకాలువ, పంబలేరుకు చేరుతుంది. గూడూరు మండలంలోని మిట్టాత్మకూరు ప్రాంతాల నుంచీ, రాపూరు కండలేరు జలాశయం నుంచీ వచ్చే జలాలు పంబలేరువాగుకు చేరుకుంటాయి. ఇవి మనుబోలు మండలం వెంకన్నపాళెం గ్రామం గుండా ప్రవహిస్తాయి. వీటికి మనుబోలు మీదుగా వచ్చే వరదనీరు కూడా జత అయ్యి చిల్లకూరు మండలం తిప్పగుంటపాళెం వద్ద ఉన్న కండలేరుక్రీక్‌లో కలుస్తాయి. ఇక్కడ ఒక చెక్‌డ్యాంను నిర్మించారు. ఈ చెక్‌డ్యాం వరకు అటు ఉప్పునీరు (బ్యాక్‌వాటర్) వస్తుంది. ఇటు మంచినీరు ఈ చెక్‌డ్యామ్‌ను దాటుకుని కండలేరు క్రీక్‌లోకి ప్రవహిస్తోంది. ఈ క్రీక్ ద్వారా గుమ్మళ్లదిబ్బ ప్రాంతంలోని సముద్రంలో జలాలు కలుస్తాయి. దీంతో కండలేరు క్రీక్ ఉప్పుటేరుగా ప్రసిద్ధి చెందింది.

ఉప్పుటేరు ప్రత్యేకత ఇదీ..

కండలేరు ఉప్పుటేరు ప్రత్యేకత ఏమిటంటే ఇటు మంచినీరూ, అటు ఉప్పునీరూ కలవడం. సముద్రంలో లాగా లవణశాతం ఎక్కువ ఉండదు. మధ్యస్తంగా 10 పీపీటీ నుంచి 30 పీపీటీ లోపు మాత్రమే ఈ ఏటిలో ఉంటుంది. దీంతో చేపలు, రొయ్యలు, పీతలు సమృద్ధిగా పెరుగుతాయి. ఈ జలాలు మడ అడవుల పెరుగుదలకు దోహదపడుతాయి. అందుకే ఉప్పుటేరు వెంబడి మడ అడవులు విస్తరించి ఉంటాయి. ఇవి తీరప్రాంతాల కోతను నిలువరిస్తుంటాయి. చేపలు, రొయ్యలు వదిలే లార్వాలు(గుడ్లు) నీటి ప్రవాహంలో కొట్టుకు పోకుండా మడ చెట్లకు చుట్టుకుని ఉంటాయి. అక్కడే పిగిలి, చేపలు, రొయ్యల వృద్ధికి దోహదపడతాయి. ఈ తరహా ముఖద్వారాలు మన దేశంలోని సుందర్బన్ (పశ్చిమ బెంగాల్), గోదావరి (ఆంధ్రప్రదేశ్), కావేరి (తమిళనాడు), మండోవి (గోవా) ప్రాంతాలలో ఉన్నాయి.

అపార మత్స్య సంపద

ఈ క్రీక్‌వెంబడి తిప్పగుంటపాళెం, చేడిమాల, బెస్తపాళెం, అంకులపాటూరు, రామారెడ్డిపాళెం, ఏరూరు, మోమిడి, వరగలి, లింగవరం, తమ్మినపట్నం, గుమ్మళ్లదిబ్బ గ్రామాలున్నాయి. ఈ ప్రాంతంలోని మత్స్యకారులు పడవల్లో ఈ క్రీక్ ద్వారానే గుమ్మళదిబ్బ సమీపంలోని సముద్రంలోకి వేటకు వెళుతుంటారు. తీర గ్రామాల్లోని గిరిజనులు మాత్రం ఉప్పుటేరులోనే చేపలు, రొయ్యలను పట్టుకుని జీవనోపాధి పొందుతున్నారు. ఉప్పుటేరులో రొయ్యలు, పీతలతో పాటు కోడివాయ, వంజరం, చందువ రకం చేపలు దొరుకుతుంటాయి. దీంతోపాటూ క్రీక్ వెంబడి సుమారు రెండు వేల ఎకరాలకు పైగా రొయ్యల చెరువులు ఏర్పడ్డాయి. ఇక్కడ పెరిగే రొయ్యలను అంతర్జాతీయ మార్కెట్‌కు ఎగుమతి చేస్తుంటారు.



మడ అడవులు



ఉప్పుటేరు వెంబడి సాగవుతున్న రొయ్యల చెరువులు



తిప్పగుంటపాళెం చెక్‌డ్యాం



కండలేరు ఉప్పుటేరు

డక్కిలి జడ్పీటీసీ రాజేశ్వరి మృతి



కలిమిలి రాజేశ్వరి (ఫైల్‌ఫొటో)

డక్కిలి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): డక్కిలి జడ్పీటీసీ సభ్యురాలు కలిమిలి రాజేశ్వరి(42) గురువారం మృతి చెందారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె బెంగళూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. ఆమె మృతదేహన్ని వెంకటగిరి పట్టణంలోని విశ్వోదయ కాలేజీ సమీపంలో ఉన్న స్వగృహంలో ప్రజల సందర్శనార్థం ఉంచారు. శుక్రవారం ఉదయం ఆమె స్వగ్రామమైన డక్కిలి మండలం చాపలపల్లి గ్రామానికి తీసుకెళ్తారు. మధ్యాహ్నం 3 గంటలకు అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు. సీనియర్ నేత కలిమిలి రాంప్రసాద్ రెడ్డి సతీమణి అయిన రాజేశ్వరి 2013లో చాపలపల్లి పంచాయతీ సర్పంచ్‌గా ఏకగ్రీవంగా గెలుపొందారు. 2021 స్థానిక సంస్థల ఎన్నికల్లో జడ్పీటీసీ అత్యధిక మెజార్టీతో విజయం సాధించారు. తన భర్త రాంప్రసాద్‌రెడ్డి సహకారంతో మండలానికి ఒక్కో అంబులెన్సు సొంత డబ్బుతో కొనుగోలు చేసి ప్రజల సౌకర్యార్థం వినియోగించారు. చాపలపల్లిలో రామాలయం నిర్మించడంతో పాటు గ్రామాన్ని ఎంతో అభివృద్ధి చేశారు.

కొయ్యబొమ్మల శిక్షణా శిబిరం

శ్రీకాళహస్తి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొత్తపేటలో గల కళాసృష్టి కార్యాలయంలో ఢిల్లీకి చెందిన చేనేత జౌళిశాఖ సహకారంతో రెండు నెలలపాటు కొయ్యబొమ్మల తయారీపై శిక్షణ ఇవ్వనున్నట్లు కళాసృష్టి స్వచ్ఛంద సేవా సంస్థ కార్యదర్శి డాక్టర్ గుమ్మడిపూడి దశరథాచారి తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ శిక్షణకు కొయ్యబొమ్మల కళాకారులు మాత్రమే అర్హులని గుర్తుచేశారు. అభ్యర్థులకు చేనేత జౌళిశాఖ నుంచి గుర్తింపు పొందిన హస్తకళల కార్డు ఉండాలని తెలియజేశారు. 18 నుంచి 35 సంవత్సరాలలోపు వయసు కలిగి ఉండాలని పేర్కొన్నారు. శిక్షణ కాలంలో జీతభత్యాలు అందజేస్తామని వివరించారు. చేనేత జౌళిశాఖ సర్టిఫికెట్లు ఇస్తారని వెల్లడించారు. ఆసక్తి గల కళాకారులు పట్టణంలోని కార్యాలయంలో దరఖాస్తులను పొందవచ్చని తెలియజేశారు.

రెండు ద్విచక్ర వాహనాల ఢీ

ముగ్గురికి తీవ్రగాయాలు







ప్రమాదంలో గాయపడ్డ యువకులు

కేవీబీపురం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని మఠం గ్రామం వద్ద గురువారం రాత్రి 9 గంటల సమయంలో రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన ఒక వ్యక్తి నింద్ర మండలం కావనూరుకు చెందిన వారుగా తెలిసింది. మరో ఇద్దరి వివరాలు తెలియాల్సి ఉంది. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు 108లో శ్రీకాళహస్తిలోని ఆస్పత్రికి తరలించారు ఎస్ఐ, పోలీసులు వెళ్లే సరికే అక్కడి ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అయితే ముగ్గురి పరిస్థితి విషమంగా ఉందని అంటున్నారు. పోలీసులు మాత్రం సంఘటనస్థలంలో ప్రమాదానికి గురైన ద్విచక్ర వాహనాలను స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేష్, ఏఎస్ఐ ఇమాన్యుయేల్ తెలిపారు.

నేడు అమ్మవారి ఆలయంలో వరలక్ష్మీ వ్రతం

- ఏర్పాట్లు పూర్తి చేసిన టీటీడీ
- వ్రతానికి 500 టిక్కెట్ల జారీ







భక్తురాలికి వ్రతం టికెట్ అందజేస్తున్న డిప్యూటీ ఈవో హరీందర్‌నాథ్ - టిక్కెట్ల కోసం బారులు తీరిన భక్తులు - సిద్ధమైన ఆస్థాన మండపం

తిరుచానూరు. ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): పద్మావతి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో శుక్రవారం ఉదయం10 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు వైభవంగా వరలక్ష్మి వ్రతం నిర్వహించడానికి టీటీడీ అన్ని ఏర్పాట్లూ చేసింది. ఆస్థానమండపం వేదికగా జరిగే వ్రతానికి గంట ముందుగా టిక్కెట్లు పొందిన భక్తులను అనుమతించనున్నట్లు విజిలెన్సు అధికారులు తెలిపారు. ఆన్‌లైన్, కరెంటు బుకింగ్, సిఫార్సు లెటర్ల ద్వారా 500 టిక్కెట్లు విక్రయించనున్నారు. వ్రతంలో వెయ్యి మంది పాల్గొనే అవకాశం ఉంది. ఉదయం అమ్మవారికి వస్త్రాలంకరణ సేవ మినహా అన్ని ఆర్జిత సేవలను రద్దుచేసినట్లు టీటీడీ తెలియజేసింది. సర్వదర్శనంలోనే అమ్మవారిని దర్శించుకోవాల్సి ఉంటుంది. గేట్ నెంబరు 4(పాతపోలీస్‌స్టేషన్) నుంచి భక్తులను అనుమతించనున్నారు. ఇందుకోసం అక్కడ జర్మన్‌షెడ్లు, క్యూలైన్లు ఏర్పాటు చేశారు. సాయంత్రం మాడవీధుల్లో పద్మావతి అమ్మవారు స్వర్ణరథంపై ఊరేగి భక్తులను కటాక్షించనున్నారు. ఈ సందర్భంగా ఆలయంతో పాటు మాడవీధులు, ఆస్థాన మండపాలన్ని సర్వాంగసుందరంగా ముస్తాబు చేశారు. విద్యుత్ దీపాలంకరణ చేశారు. గురువారం ఉదయం కుంకుమార్చన కౌంటర్‌లో 150 వ్రతం టిక్కెట్లను టీటీడీ అధికారులు విక్రయించారు. అరగంట వ్యవధిలోనే టిక్కెట్లు అయిపోయాయి. టిక్కెట్లు దొరకని భక్తులు నిరాశగా వెనుదిరిగారు.

చేనేతకు ప్రభుత్వం చేయూత



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

వెంకటగిరి టౌన్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోందని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. వెంకటగిరిలోని పద్మశాలి కల్యాణ మండపంలో గురువారం జరిగిన జాతీయ చేనేత దినోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం చేనేత కార్మికుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. జిల్లాలో నేటి నుంచి చేనేత కార్మికులకు 200 యూనిట్లు, పవర్ లూం కార్మికులకు 500 యూనిట్ల విద్యుత్‌ను ఉచితంగా ఇస్తోందన్నారు. జిల్లాలో దాదాపు 29 ప్రాథమిక చేనేత సహకార సంఘాలుండగా వెంకటగిరిలోనే ఏడు సంఘాలు చురుగ్గా పనిచేస్తున్నాయన్నారు. 42వేల మందికి చేనేత కార్మికులకు రూ. 41లక్షల మేర రుణాలు మంజూరు చేశామన్నారు. జాతీయ స్థాయి ఎగ్జిబిషన్లలతో వెంకటగిరి చేనేత ఉత్పత్తులు తమదైన ముద్ర వేసుకుంటున్నాయన్నారు. ఈ ప్రాంతానికి చెందిన లక్కా శ్రీనివాసులు సంత్‌కబీర్ పురస్కారం అందుకోవడం గర్వకారణమన్నారు. ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ మాట్లాడుతూ చేనేతల సమస్యలు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చొరవ తీసుకుంటామన్నారు. అనంతరం రూ.60లక్షల మేర ముద్ర వీవర్స్ చెక్కును అందజేశారు. హ్యాండ్లూం ఏడీ రమేష్, ఎల్‌డీఎం గుంటూర్ రవికుమార్, రాష్ట్ర పద్మశాలి కార్పొరేష్ డైరెక్టర్ గంగాధర్, ఏఎంసీ చైర్మన్ విశ్వనాథం, లక్ష్మీపతి, సత్యనారాయణ, పులికల్లు రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. కాగా చేనేత దినోత్సవం సందర్భంగా పట్టణంలోని క్రాస్ రోడ్డు వద్ద నిర్వహించిన ర్యాలీలో కలెక్టర్ వెంకటేశ్వర్ పాల్గొన్నారు.

తెలుగు తమ్ముళ్ల డిష్యుం.. డిష్యుం..







నాయుడుపేట/తడ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేటలో గురువారం జరిగిన సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ సంస్థాగత ఎన్నికల సందర్భంగా గురువారం ఓజిలి మండల తెలుగు తమ్ముళ్లు ఘర్షణ పడ్డారు. ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, నియోజకవర్గ పరిశీలకుడు శివప్రసాద్ ఎదుటే గొడవకు దిగారు. ఓజిలి మండల అధ్యక్ష స్థానానికి గున్నం మధుసూదనరెడ్డి, బి.విజయకుమార్ నాయుడు, కంకణాల సత్యవరప్రసాద్‌రావు, పాడి వెంకటసుబ్బయ్య పోటీలో నిలిచారు. మధుసూదనరెడ్డికే అధ్యక్ష పదవి ఇవ్వాలంటూ యల్లా సుధాకర్, వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు చెప్పగా.. విజయకుమార్ నాయుడు వర్గం వ్యతిరేకించింది. పార్టీ కోసం కష్టపడి, కేసులు పెట్టించుకున్నామని, మధ్యలో వలసొచ్చిన నాయకులకు ఆ పదవి ఇవ్వరాదంటూ అభ్యంతరం చెప్పడంతో ఘర్షణ మొదలైంది. ఒకరినొకరు తిట్టుకుంటూ, తోసుకుంటూ, కొట్టుకున్నారు. పోలీసులు రంగ ప్రవేశం చేయడంతో ఈ ఘర్షణకు తెరపడింది. పెళ్లకూరు, నాయుడుపేట, నాయుడుపేట రూరల్ అధ్యక్ష, కార్యదర్శుల ఎంపికలో భాగంగా పోటీ పడే నాయకుల వివరాల సేకరణ ప్రశాంతంగా జరిగింది.

మద్యం తాగి విధులకు హాజరైన టీచర్ అంకయ్య సస్పెన్షన్

తిరుపతి(విద్య),ఆగస్టు7(ఆంధ్రజ్యోతి): బాలాయపల్లెమండలం జయంపు ప్రాథమిక పాఠశాలలో సెకండరీగ్రేడ్ టీచర్ చిన్న అంకయ్య సస్పెండయ్యారు. రోజూ మద్యం తాగి విధులకు హాజరవుతుండడం.. 4,5తరగతుల విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని నిర్ధారణ కావడంతో సస్పెండ్ చేస్తున్నట్లు డీఈవో కేవీఎన్ కుమార్ గురువారం పేర్కొన్నారు.ఎంఈవో ప్రాథమిక విచారణ జరిపి నివేదించారన్నారు. ఈక్రమంలోనే చిన్న అంకయ్యను సస్పెండ్ చేశామని ఒక ప్రకటనలో వివరించారు.

శ్రీకాళహస్తిలోనూ సర్వం సిద్ధం





బ్రహ్మగుడి ఆలయం వద్ద ఏర్పాట్లు - పసుపు, కుంకుమ తదితరాలను సిద్ధం చేస్తున్న ఆలయ అధికారులు

శ్రీకాళహస్తి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): శ్రీకాహస్తీశ్వరాలయ ప్రాంగణంలోని బ్రహ్మగుడి వద్ద శుక్రవారం వరలక్ష్మి వ్రతం నిర్వహించడానికి అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వ్రతం జరగనుంది. వ్రతంలో పాల్గొనే మహిళలకు ఇచ్చే వాయినాలను అధికారులు, సిబ్బంది సిద్ధం చేస్తున్నారు.

తిరుపతిలో ఎస్టీ విద్యార్థులకు రీజనల్ స్టడీ సర్కిల్

తిరుపతి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): పోటీ పరీక్షలకు హాజరయ్యే గిరిజన విద్యార్థులకు శుభవార్త. వీరి కోసం ఏపీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో తిరుపతిలో రీజనల్ స్టడీ సర్కిల్ ఏర్పాటుకానుంది. ఇందుకు ప్రభుత్వం అనుమతించింది. గతేడాది ఆగస్టులో ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా సీఎం చంద్రబాబు స్టడీ సర్కిల్ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ఈక్రమంలోనే విజయవాడతోపాటు తిరుపతిలో రీజనల్ సెంటర్ల ఏర్పాటుకు గురువారం ప్రభుత్వం గురువారంఉత్తర్వులు జారీ చేసింది. వీటి నిర్వహణకు రూ. 4.22 కోట్లు మంజూరు చేస్తూ రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి ముదావత్ .నాయక్ ఉత్తర్వులు జారీ చేశారు.

తిరుమలలో రేపు శ్రావణ పౌర్ణమి గరుడసేవ

తిరుమల, ఆగస్టు7(ఆంధ్రజ్యోతి): శ్రావణ పౌర్ణమి సందర్భంగా తిరుమలలో శనివారం గరుడసేవ నిర్వహించనున్నారు. శ్రీమలయప్పస్వామి గరుడునిపై కొలువుదీరి మాడవీధుల్లో ఊరేగి భక్తులకు దర్శనమివ్వనున్నారు. సెప్టెంబరు 24న మొదలయ్యే బ్రహ్మోత్సవాల్లో 28న గరుడసేవ ఉంటుంది. దీనికి ట్రయల్‌రన్‌గా శనివారం గరుడసేవను భావిస్తారు. లోటుపాట్లను గుర్తించి బ్రహ్మోత్సవాల్లో ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోనున్నారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

బీజేపీ సారథ్య సభను విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న నరేంద్రరెడ్డి

గూడూరు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ఈనెల 12వ తేదీన బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న బీజేపీ సారథ్యం సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు నరేంద్రరెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కలసికట్టుగా పని చేయాలన్నారు. ఎన్డీయే ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాని సూచించారు. కార్యక్రమంలో దయాకర్, ఆరికట్ల బాలకృష్ణమ నాయుడు, బిందురెడ్డి, ప్రభాకర్, శ్రీనివాసులు, బాలకృష్ణ, నిరంజన్ పాల్గొన్నారు.

తల్లిపాలు ఎంతో శ్రేష్ఠమైనవి



బాలింతలకు పౌష్టికాహారాన్ని అందజేస్తున్న మట్టం శ్రావణి

గూడూరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): బిడ్డకు తల్లిపాలుఎంతో శ్రేష్ఠమైనవని తిరుపతి పార్లమెంటు తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి అన్నారు. గురువారం మండలంలోని చెన్నూరు గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. బాలింతలకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చంటిబిడ్డలకు తల్లిపాలను ఇవ్వడం వల్ల వారిలో రోగనిరోధకశక్తి పెరిగి ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు శ్యామల, అంగన్‌వాడీ సిబ్బంది శివజ్యోతి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా స్థానిక ఏరియా ఆస్పత్రిలో ఆంధ్ర మహిళామండలి, ఇన్నర్ వీల్‌క్లబ్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించి, బాలింతలకు పౌష్టికారాన్ని అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ రోహిణి, మాధురి, విష్ణువందన, మైథిలి, స్నేహలత తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు యూనిఫాం అందజేత



యూనిఫాం అందుకున్న పారిశుధ్య కార్మికులతో ఎన్ఆర్ఐలు, విశ్రాంత ఉద్యోగులు, రోటరీక్లబ్ సభ్యులు

నాయుడుపేట, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట మున్సిపాలిటీలోని 155 మంది పారిశుధ్య కార్మికులకు నంద జగదీష్ వర్ధంతి సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులైన ఎన్ఆర్ఐలు విజయప్రభ, శ్రీనివాసులురెడ్డి దంపతులు, సీహెచ్ సీతామహాలక్ష్మి సహకారంతో రాష్ట్ర విశ్రాంత ఉద్యోగ సంఘ నాయకులు, రోటరీ క్లబ్ సభ్యులు మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లా యూనిఫాం అందజేశారు. అలాగే రోటరీక్లబ్ అధ్యక్షుడు, ట్రినిటీ ఆస్పత్రి సీఈవో ఆదవరం నాగూరయ్య మరో 52 మందికి యూనిఫాం అందజేశారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగ సంఘ అధ్యక్షుడు ఉదయకుమార్, బట్టా సుబ్రహ్మణ్యం, మునగాల కృష్ణారావు, కాలేషా, రామచంద్రారెడ్డి, చంద్రశేఖర్, హెచ్ సుబ్రహ్మణ్యం, శశిధర్, సాయిబాబా, ప్రమీలమ్మ, గోపీనాథ్, రామ మోహన్, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆదిశంకర కళాశాలలో అవగాహన సదస్సు



విద్యార్థులతో మాట్లాడుతున్న శకుంతల

గూడూరు అర్బన్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆదిశంకర డీమ్డ్ యూనివర్సిటీలో గురువారం అధ్యాపకులు, విద్యార్థులకు 'భవిష్యత్తును నిర్మించే సంభాషణలు' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా హైదరాబాదుకు చెందిన ఫౌండర్స్ ల్యాబ్ సీఈవో శకుంతల మాట్లాడుతూ నేటి వేగవంతమైన సాంకేతిక, సామాజిక మార్పుల కాలంలో భవిష్యత్తును నిర్ణయించే సంభాషణలు అనేవి సమాజ అభివృద్ధికి మూలస్తంభాలుగా మారుతున్నాయన్నారు. పరిష్కారాల పునాది సంభాషణ లేనన్నారు. ఒక మంచి సంభాషణ, ఒక సమస్యను పరిష్కరించే మార్గాన్ని చూపుతుందన్నారు. నిర్ణయాత్మక సంభాషణలు భవిష్యత్తును ఆశాజనకంగా మలచడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాజయ్య, ధనుంజయ, వేణుగోపాల్, ప్రణయ్‌కుమార్, ఏవో రామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం



గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

సూళ్లూరుపేట, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో దేవాంగుల ఆధ్వర్యంలో గురువారం జాతీయ చేనేత దినోత్సవం నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండు వద్దనున్న మహాత్మ గాంధీ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళుల ర్పించారు. కార్యక్రమంలో బుద్ధి విజయలక్ష్మి సూరిబాబు, బండారు ఈశ్వరయ్య, పి.విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గూడూరు: స్థానిక ఎస్కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ చేనేత దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ శివప్రసాద్ మాట్లాడుతూ చేనేత రంగం గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ముఖ్యమైన మద్దతును అందిస్తుందన్నారు. సంప్రదాయ వస్త్రధారణలో వచ్చిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో మైమూన్, శ్రీనివాసులు, నారాయణరాజు, శైలజ, డాక్టర్ పీర్‌కుమార్, కోటేశ్వరరావు, రవిరాజు తదితరులు పాల్గొన్నారు.

అదుపుతప్పిన కారు

తడ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని అవతలి రోడ్డు వైపు దూసుకెళ్లింది. గురువారం సాయంత్రం శ్రీసిటీ నుంచి సూళ్లూరుపేటకు వెళ్తున్న కారు చేనిగుంట జాతీయ రహదారి వద్ద అదుపుతప్పింది. డివైడర్‌ను ఢీకొని చెన్నై రహదారి వైపు దూసుకువెళ్లింది. ఈ ప్రమాదంలో కారు ముందుభాగం దెబ్బతినగా, అందులో ప్రయాణిస్తున్న వారికి ఎటువంటి గాయాలు కాలేదు. అదే సమయంలో చెన్నై వైపు వెళ్లే రోడ్డుపై ఎటువంటి వాహనాలు రాకపోవడంతో ప్రమాదం తప్పింది. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు అందలేదు.

రోడ్డు ప్రమాదంలో టీడీపీ నేత మృతి



రమణయ్య (ఫైల్‌ఫొటో)

కోట, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): బైక్‌ను గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో టీడీపీ నేత మృతి చెందిన ఘటన గురువారం రాత్రి చిట్టేడు వద్ద జరిగింది. కోట మండలం మద్దాలి గ్రామానికి చెందిన కాకాణి రమణయ్య(55) పొలంలో పనికి కూలీలను మాట్లాడేందుకు చిట్టేడుకు బైక్‌లో బయలుదేరారు. చిట్టేడు వద్దకు చేరుకునే సమయంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో రమణయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పవన్ కుమార్ చెప్పారు.

టీడీపీలో కష్టపడే వారికి సముచితస్థానం: విజయశ్రీ



సూళ్లూరుపేట సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయశ్రీ, పక్కన పరిశీలకుడు శివప్రసాద్, టీడీపీ నాయకుడు సుధాకర్ రెడ్డి

సూళ్లూరుపేట, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): టీడీపీలో కష్టపడి పనిచేసేవారికి సముచితస్థానం లభిస్తుందని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. గురువారం సూళ్లూరుపేటలోని రైల్వేగేటు వద్దనున్న టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, నియోజకవర్గ పరిశీలకుడు శివప్రసాద్ సమక్షంలో సూళ్లూరుపేట, తడ, దొరవారిసత్రం మండలాల సంస్థాగత ఎన్నికలు నిర్వహించారు. ముందుగా తడ మండలం నాయకులతో సమావేశమయ్యారు. మండలం అధ్యక్షులుగా పూడి శెల్వం, నీలకంఠం పేర్లు, కార్యదర్శులుగా బొమ్మన్ జయ రామయ్య, చెల్లయ్య, తొప్పాని మల్లికార్జున్ పేర్లను ప్రతిపాదించారు. అదేవిధంగా దొరవారిసత్రం మండలం అధ్యక్షులుగా వేమసాని శ్రీనివాసులు నాయుడు, వంకా సుధాకర్ యాదవ్, నందిపాటి భాస్కర్‌లను, కార్యదర్శులుగా పి.మనోహర్‌రెడ్డి, సంచి విజయకుమార్, వేమసాని నాగేంద్ర నాయుడు పేర్లను ప్రతిపాదించారు. అలాగే సూళ్లూరుపేట మండల అధ్యక్షులుగా కరకంబేటి సుబ్రహ్మణ్యం కొక్కు శంకరయ్య, పాకం వెంకసుబ్బయ్య, దువ్వూరు మురళీరెడ్డి, పర్వతరెడ్డి చంద్రారెడ్డి, బూరగ జానకిరామయ్య, తోట వెంకట్రాయులు, కార్యదర్శులుగా సత్యవేటి ముత్యం ప్రసాద్, గోవిందు సురేష్, వెట్టి అక్కులయ్య, అక్కరపాక మణికంఠ, మెళ్లకంట వీరయ్య పేర్లను ప్రతిపాదించారు. అనంతరం సూళ్లూరుపేట పట్టణ అధ్యక్ష పదవికి పచ్చవ మాధవనాయుడు, ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, కార్యదర్శులుగా మేడా సాయి నారాయణ, ఎస్.సురేష్ నాయుడు, అబ్దుల్ నవాబ్, ఎస్కే అక్బర్ భాషా, ఎస్కే ఆలీభాయ్ పేర్లను ప్రతిపాదించడం జరిగింది. వీరందరి పేర్లను అధిష్టానానికి పంపి ఐవీఆర్ కాల్స్‌లో 70 శాతం పైగా ఓటింగ్ వచ్చిన వారిని నియమించడం జరుగుతుందని ఎమ్మెల్యే విజయశ్రీ పేర్కొన్నారు. సమావేశంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేట టౌన్: పట్టణంలోని శ్రీనివాస ఫంక్షన్‌హాల్‌లో నాయుడుపేట, పెళ్లకూరు, తడ సంస్థాగత ఎన్నికలు జరిగాయి. నాయుడుపేట పట్టణ అధ్యక్షులుగా కందలకృష్ణారెడ్డి, షేక్ రఫీ, మండల అధ్యక్షులుగా కామిరెడ్డి అశోక్‌రెడ్డి, సన్నారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పేర్లను ప్రతిపాదించారు. అలాగే ప్రధాన కార్యదర్శుల పదవులకు పలువురు దరఖాస్తులు సమర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పల్లమాల రామిరెడ్డి, శ్రీరామ్‌ప్రసాద్, కట్టా రమణారెడ్డి, కరుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక యాజమాన్య పద్ధతులపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఆత్మ పీడీ మురళి

కోట, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): రైతులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పంటలు సాగు చేస్తే అధిక దిగుబడి వస్తుందని నెల్లూరు వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) పీడీ మురళీ అన్నారు. మండల పరిధిలోని గూడలి, తిన్నెలపూడి గ్రామాల్లో గురువారం ఆత్మ అధికారుల ఆధ్వర్యంలో నూతన వరి వంగడాలపై క్షేత్ర ప్రదర్శన జరిగింది. రైతులకు సాంకేతిక యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. ప్రతి సీజన్‌లో వరి పండించడం వల్ల అధిక లాభాలు పొందలేరని, వాటి స్థానంలో మొక్కజొన్న వంటి ప్రత్యామ్నాయ పంటలు సాగు చేస్తే అదనపు ఆదాయం పొందవచ్చన్నారు. రైతులు సేంద్రియ వ్యవసాయ పద్ధతులపై అవగాహన కలిగి ఉండటమే కాకుండా మార్కెటింగ్ సదుపాయాలపై దృష్టి పెడితే మరింత లాభాలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఏవో సుచేంద్ర ప్రసాద్, వ్యవసాయ విస్తరణాధికారి సాయికుమార్, తదితరులు పాల్గొన్నారు.

సింగిల్ విండోలకు నూతన అధ్యక్షుల నియామకం



రామచంద్రయ్య నాయుడు, రమణారెడ్డి, సురేంద్ర, రాజా, జనార్దనరెడ్డి, చైతన్య, భాస్కర నాయుడు

డక్కిలి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): డక్కిలి మండలంలో ఏడు సింగిల్ విండోలకు అధ్యక్షులను నియమిస్తూ గురువారం ప్రభుత్వం ఉత్తర్వు జారీ చేసింది. మాధవాయపాళెం సొసైటీ అధ్యక్షుడిగా మాజీ జడ్పీటీసీ ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు, డక్కిలి సొసైటీ అధ్యక్షుడిగా వెలికంటి రమణారెడ్డి, దగ్గవోలు సొసైటీ అధ్యక్షుడిగా పాతనాలపాడు గ్రామానికి చెందిన ఈతముక్కల సురేంద్ర, లింగముద్రం సొసైటీ అధ్యక్షుడిగా నాగులపాడు గ్రామానికి చెందిన రంగినేని రాజా, మోపూరు సొసైటీ అధ్యక్షుడిగా పులి జనార్దనరెడ్డి, అల్తూరుపాడు సొసైటీ అధ్యక్షుడిగా చైతన్య, గొల్లపల్లి సొసైటీ అధ్యక్షుడిగా నర్రావుల భాస్కర నాయుడు ను నియమితులయ్యారు. తమను సింగిల్ విండోల అధ్యక్షులుగా నియమించడానికి కృషి చూసిన ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు.

ఇసుక, గ్రావెల్ మాఫియా ఆపకపోతే ఆందోళన

సూళ్లూరుపేట, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ఇసుక, గ్రావెల్ దోపిడీ జరుగుతుంటే అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని మాజీ కిలివేటి సంజీవయ్య ప్రశ్నించారు. గురువారం ఆయన వైసీపీ నాయకులతో కలిసి ఇసుక, గ్రావెల్ అక్రమ రవాణాపై ఆర్డీవో కిరణ్మయితో మాట్లాడారు. నాయుడుపేట, దొరవారిసత్రం, సూళ్లూరుపేటలో పట్టపగలే గ్రావెల్, ఇసుకను ఇష్టానుసారంగా తవ్వేసి తమిళనాడుకు తరలిస్తుంటే రెవెన్యూ, పోలీసు అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చినా ఎందుకు చర్యలు తీసుకోవడం ప్రశ్నించారు. పది రోజుల్లో మాఫియాను అరికట్టేందుకు చర్యలు తీసుకోకపోతే ప్రజలతో కలిసి ఆందోళనకు దిగుతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ అల్లూరు అనిల్‌రెడ్డి, వైసీపీ నాయకులు జెట్టి వేణుయాదవ్, చిలకా యుగంధర్, కలికి మాధవ రెడ్డి, మునస్వామి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామి ఆలయ కమిటీ చైర్‌పర్సన్‌గా అర్చన



చిల్లకూరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కలవకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయ కమిటీ చైర్‌పర్సన్‌గా అర్చన నియమితులయ్యారు. చైర్‌పర్సన్‌తో పాటు ఆలయ కమిటీ సభ్యులను నియమిస్తూ గురువారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. చైర్‌పర్సన్‌గా అర్చన, కమిటీ సభ్యులుగా వాసవి, రాజమ్మ, వెంకటసుబ్బయ్య, చలపతి, చెంగలరాయుడు, ముత్యాలమ్మ, వెంకటేశ్వర్లు, ఆదిశేషమ్మ, ఎక్స్ అఫిషియో సభ్యుడుగా ఎస్‌పీ.చిరంజీవిలను నియమించింది. తమకు పదవి రావడానికి సహకరించిన ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్, టీడీపీ సీనియర్ నాయకులు కొండేపాటి గంగాప్రసాద్, తానంకి నానాజీలకు ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

రైల్లో కత్తితో ఆకతాయి హల్‌చల్
అదుపులోకి తీసుకున్న ఆర్‌పీఎఫ్ పోలీసులు



రైలు వద్ద గుమికూడిన ప్రయాణికులు

సూళ్లూరుపేట, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): చెన్నై - భగత్ కోటి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లో ఓ ఆకతాయి కత్తితో హల్‌చల్ చేయడంతో ప్రయాణికులు భయాందోళనకు గురైన సంఘటన గురువారం చోటుచేసుకుంది. చెన్నై నుంచి వస్తున్న రైలులో ఓ గుర్తు తెలియని వ్యక్తి కత్తితో ప్రయాణికులను బెదిరిస్తూ హల్‌చల్ చేశారు. దీంతో ప్రయాణికులు ఆన్‌లైన్ ద్వారా రైల్వే పోలీసులకు సమాచారం చేరవేశారు. అప్రమత్తమైన రైల్వే పోలీసులు సూళ్లూరుపేట స్టేషన్‌లో రైలును ఆపేసి ఆకతాయి కోసం భోగిల్లో గాలించారు. ఆర్‌పీఎఫ్ పోలీసులను చూసిన ఆకతాయి బీ2 బోగిలో బాత్‌రూంలోకి వెళ్లి తలుపులు వేసుకున్నాడు. ఆర్‌పీఎఫ్ పోలీసులు దాదాపు గంటసేపు శ్రమించి బాత్‌రూం తలుపులు తీసి ఆకతాయిని అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన వ్యక్తి తమిళంలో ఒక్కొక్కసారి ఒక్కో విధంగా మాట్లాడుతుండడంతో మతిస్థిమితం లేనినట్లు అనుమానిస్తున్నారు. ఈ ఘటనతో పలు రైళ్లు ఆలస్యంగా నడిచాయి.

ఉద్యమాలకు ఊపిరి యూటీఎఫ్

కోట, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ఉద్యమాలకు ఉపిరిపోసింది యూటీఎఫ్ అని ఆ సంఘ నేతలు అన్నారు. మండల పరిధిలోని చిట్టేడు, కేశవరం, మద్దాలి, చెందోడు, కొత్తపాళెం గ్రామాల్లోని పాఠశాలల్లో గురువారం యూటీఎఫ్ నాయకులు సభ్యత్వ నమోదు చేపట్టారు. యూటీఎఫ్ మండల అధ్యక్షుడు మనోహర్, ప్రధాన కార్యదర్శి భాస్కర్‌రావు, సంఘ ప్రతినిధులు కోటేశ్వరరావు, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి



గర్భిణులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి టౌన్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): గర్భిణులు బిడ్డకు జన్మనిచ్చే వరకు పౌష్టికాహారం తీసుకోవాలని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. గురువారం స్థానిక పద్మశాలి కల్యాణ మండపంలో తల్లిపాల వారోత్సవాలు ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే గర్భిణులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో సీడీపీవో షంషాద్ బేగం, నాయకులు జానపాటి బాలకృష్ణ, గంగాధర్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

పుచ్చలపల్లిలో తల్లిపాల వారోత్సవాలు

కోట, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పుచ్చలపల్లిలో గురువారం తల్లిపాల వారోత్సవాలు జరిగాయి. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కృష్ణమ్మ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు అనిత, ప్రసన్న గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యంపై అవగాహన కల్పించారు.

ప్లేస్‌మెంట్ ఆఫీసర్ అక్రమాలపై విచారణ చేపట్టండి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ అక్రమాలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఎన్ఎస్‌యూఐ డిమాండ్ చేసింది. ఈ విషయమై యూనివర్సిటీ రిజిస్ట్రార్ భూపతి నాయుడికి ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి మల్లికార్జున, నేషనల్ లా విద్యార్థి సంఘం అధ్యక్షుడు సుందర్రాజు గురువారం వినతిపత్రం అందజేశారు. మల్లికార్జున మాట్లాడుతూ ఉద్యోగం వచ్చిన ప్రతి విద్యార్థి నుంచీ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ మూడువేల నుంచి పదివేల రూపాయల వరకు అక్రమంగా వసూలు చేశారని ఆరోపించారు. ఐదేళ్లుగా ఈ వ్యవహారం నడిచిందని తెలిపారు. ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి విచారణ చేపట్టాలని కోరారు. ఆయన వసూలు చేసిన డబ్బును యూనివర్సిటీ అకౌంట్లోకి జమ చేయాలని, లేకపోతే విద్యార్థులతో కలిసి ఉద్యమిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ముఖేష్, కుమార్ పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో మంత్రి అనగాని

తిరుచానూరు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): పద్మావతి అమ్మవారిని గురువారం ఉదయం జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ దర్శించుకున్నారు. ఆలయం వద్ద డిప్యూటీ ఈవో హరీందర్‌నాథ్, సూపరింటెండెంట్ రమేష్ ఆయనకు స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అమ్మవారి దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనం ఇచ్చి అమ్మవారి శేషవస్త్రంతో సత్కరించారు.

ఉపాధ్యాయుడిపై తప్పుడు కేసు తగదు

బాలాయపల్లి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని జయంపు ఎస్టీకాలనీ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న చిన్నఅంకయ్యపై నమోదు చేసిన పోక్సో కేసు నమోదు చేయడం సరికాదని విద్యార్థుల తల్లిదండ్రులు అన్నారు. గురువారం వారు పోలీస్ స్టేషన్‌కు చేరుకుని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ తమ అభిప్రాయాలు తెలుసుకోకుండా ఉపాధ్యాయుడిపై ఎంఈవో ఫిర్యాదు ఎలా చేస్తారని ప్రశ్నించారు. చిన్నఅంకయ్యపై తప్పుడు కేసు పెట్టి ఇరికించారని, వెంటనే కేసును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

మందుల దుకాణంలో మత్తుపదార్థాల విక్రయం

గూడూరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆస్పత్రి రోడ్డులో గల ఓ మందుల దుకాణంలో నిషేధిత మత్తు పదార్థాలు విక్రయిస్తున్న విషయం గురువారం వెలుగుచూసింది. స్థానిక ఆస్పత్రి రోడ్డులోని ఓ మందుల దుకాణంలో నిషేధిత మత్తుపదార్థాలను విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో బుధవారం రాత్రి పోలీసులు దాడులు నిర్వహించి ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. విచా రణ జరుగుతోందని, పూర్తి వివరాలు వెల్లడిస్తామని పోలీసులు చెప్పారు.

ఘనంగా ఇసనాక వర్ధంతి



ఇసనాక చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నూకలపాలెం వాసులు

సూళ్లూరుపేట, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): చెంగాళమ్మ ఆలయ మాజీ ట్రస్టుబోర్డు చైర్మన్ స్వర్గీయ ఇసనాక హర్షవర్ధన్ రెడ్డి వర్ధంతిని మున్సిపాలిటీ పరిధిలోని నూకలపాలెంలో ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఇసనాక చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు

టీటీడీలో పదోన్నతులు ఎందుకు ఆపేశారు?
సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి

తిరుపతి(ఆటోనగర్), ఆగస్టు7(ఆంధ్రజ్యోతి): టీటీడీలో ఐదేళ్లుగా పదోన్నతులు ఎందుకు ఆపేశారో చెప్పాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. టీటీడీలో ఎస్సీ, ఎస్టీ రోస్టర్ పాయింట్‌లో ఎదురైన ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని సుదీర్ఘకాలంగా ఉద్యోగులకు పదోన్నతులు నిలిపివేయడం ధర్మమా అని ప్రశ్నించారు. ధర్మాన్ని ఆచరించే సంస్థలో ఇలా జరగడం సమంజసం కాదని విమర్శించారు. పదోన్నతులకు అర్హత ఉన్న 100 మందికిపైగా ఉద్యోగ విరమణ చేశారని, మరో 100 మంది కారుణ్య నియామకాల కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు. వెంటనే పదోన్నతులు కల్పించి, ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని కోరారు.

10న భగవద్గీత పారాయణం

తిరుపతి(ఎంఆర్‌పల్లె), ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): శ్రీఅన్నమయ్య డ్యాన్స్ అకాడమీ, అపుస్మా ఆధ్వర్యంలో కృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని ఆదివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం వరకు తిరుపతి రఘునాథాచార్య ఓపెన్ ఆడిటోరియంలో భగవద్గీత పారాయణం, నృత్యగాన కార్యక్రమం నిర్వహించ నున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో పోస్టర్లు ఆవిష్కరించారు.

అరవపాళెంలో ప్రత్యేక గ్రీవెన్స్ డే



అర్జీలు స్వీకరిస్తున్న ఎంపీడీవో మనోహర్ గౌడ్

చిట్టమూరు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అరవపాళెం సచివాలయం వద్ద గురువారం ఎంపీడీవో మనోహర్ గౌడ్ ప్రత్యేక గ్రీవెన్స్ డే నిర్వహించారు. సచివాలయం పరిధిలోని చిన్న దరఖాస్తు, పెద్ద దరఖాస్తు, చింతలతోపు, బయ్యవారికండ్రిగ, ఎల్లసిరి, పాటిమిట్ట గ్రామాల ప్రజలు పలు సమస్యలపై ఇచ్చిన అర్జీలను స్వీకరించారు. పింఛన్లు, భూ సమస్యలు, తల్లికి వందనం, తాగునీటి సమస్య, వ్యవసాయ విత్తనాల పంపిణీలో అవకతవకలు, అన్నదాత సుఖీభవ నగదు జమ కాకపోవడంపై అర్జీలు అందినట్లు ఎంపీడీవో తెలిపారు. ఆయా శాఖల అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తామని ఆయన చెప్పారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ జనార్దన్, వీఆర్వో కోటయ్య, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

నిడిగుర్తి పీహెచ్‌సీలో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

వాకాడు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నిడిగుర్తి పీహెచ్‌సీలో గురువారం క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. బీపీ, షుగర్, పురుషులకు నోటి క్యాన్సర్, మహిళలకు రొమ్ము, గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్ పరీక్షలు చేశారు. కార్యక్రమంలో కమ్యూనిటీ మెడిసెన్ విభాగాధిపతి డాక్టర్ నాగరాజు, డాక్టర్ హరిత, నోడల్ ఆఫీసర్లు ప్రత్యూష, లలిత్, నిడిగుర్తి పీహెచ్‌సీ వైద్యులు హేమ, స్రవంతి, నిడిగుర్తి సర్పంచ్ నాగరాజు, స్థానిక కూటమి నాయకులు దువ్వూరు అజిత్‌కుమార్‌రెడ్డి, వాకాటి సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విత్తనాల పంపిణీ

కోట, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సిద్ధవరం రైతు సేవా కేంద్రంలో గురువారం రైతులకు 50శాతం సబ్సిడీతో పచ్చిరొట్ట, జీలగ, నవధాన్యాల విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు తిరుమూరు మురళి, అనూక్, శీనయ్య, జనసేన నాయకులు అశోక్, చిరంజీవి, సహాయ వ్యవసాయ అధికారులు వెంకటకృష్ణయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.